
అక్టోబర్, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 9 పేజీలు: 64 వెల: రూ. 20/-

దసరా శుభాకాంక్షలు



# దీపావళి కథల పోటీ
## (గ్రామీణ కథలు, హాస్య కథలు)

సాహిత్య ప్రక్రియల్లో కథ స్థానం కథదే. అయితే, రాను రాను హృదయాన్ని తాకే మంచి కథలు కరువయిపోతున్నాయి. అందువల్ల మంచి కథకి పట్టం కట్టాలని 'స్థానిక పాలన' పత్రిక నిర్ణయించింది.

ఈ దీపావళి సందర్భంగా గ్రామీణ కథలు, హాస్య కథలు అనే రెండు విభాగాల్లో పోటీ నిర్వహిస్తున్నాం. గ్రామీణ నేపథ్యం ఉండి, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే కథలు ఒక విభాగంలోను, హాస్య కథలను మరొక విభాగంలోను పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

## బహుమతుల వివరాలు

రెండు విభాగాలకు విడివిడిగా ఈ కింద పేర్కొన్న బహుమతులుంటాయి.

| | |
|---|---|
| ఉత్తమ గ్రామీణ కథ | రూ. 15,000 |
| ఉత్తమ హాస్య కథ | రూ. 15,000 |
| ద్వితీయ ఉత్తమ గ్రామీణ కథ | రూ. 10,000 |
| ద్వితీయ ఉత్తమ హాస్య కథ | రూ. 10,000 |
| తృతీయ ఉత్తమ గ్రామీణ కథ | రూ. 8,000 |
| తృతీమ ఉత్తమ హాస్య కథ | రూ. 8,000 |
| ప్రతి విభాగంలో మూడు కన్సోలేషన్ బహుమతులు (ఒక్కొక్క కథకి) | రూ. 5,000 |
| సాధారణ ప్రచురణకు ఎంపికైన గ్రామీణ, హాస్య కథలకు | రూ. 2,000 |

## గ్రామీణ, హాస్య కథల పోటీకి కథలు పంపే రచయిత(త్రు)లు ఈ కింది సూచనలను గమనించాలి:

☆ కథలు కింద పేర్కొన్న చిరునామాకు నవంబర్ 1వ తేదీ లోగా అందే విధంగా పంపాలి.

☆ ఒక్కొక్కరు ఎన్ని కథలయినా పంపవచ్చు ☆ రెండు విభాగాల పోటీలలోను పాల్గొనవచ్చు.

☆ కథ రాతప్రతి మీద కథ పేరు మాత్రమే ఉండాలి. రచయిత పేరు కథకి జతపరిచే హామీ పత్రంలో వుంటే చాలు.

☆ కథ నిడివి చేతి రాతలో A4 సైజు కాగితాల్లో 6 పేజీలు మించకూడదు. సైజుకు మించిన కథలను పరిశీలించటం సాధ్యపడదు.

☆ పేజీకి ఒక పక్క మాత్రమే, దస్తూరీ అర్థమయ్యే విధంగా, స్పష్టంగా రాయాలి.

☆ సామాజిక అంశాలతో పాటు అన్ని అంశాలపై కథలు పంపవచ్చు. అశ్లీలత, అసభ్యత, కులమతాలను రెచ్చగొట్టే ధోరణులు, రాజకీయాలు, వ్యక్తిగత దూషణ, వెకిలితనం లేకుండా ఉండే కథలు పంపాలి.

☆ పోటీకి పంపే కథలు తెలుగు సంస్కృతికి దగ్గరగా ఉండాలి. అరువు తెచ్చుకున్న కథాంశాలు, విదేశీ సంస్కృతీ కథలో ప్రతిఫలించకూడదు. అనుకరణ పాత్రలతో కూడిన కథాంశాలకు దూరంగా ఉండాలి.

☆ ఎంపిక కాని కథలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. ఎంపికకాని పక్షంలో తమ కథలను త్రిప్పి పంపాలని కోరుకునేవారు అందుకు అవసరమైన స్టాంపులు అంటించిన కవర్లను కూడా తప్పక జత చేయాలి.

☆ న్యాయనిర్ణేతల కమిటీ మాత్రమే బహుమతి పొందే కథలను నిర్ణయిస్తుంది.

☆ ఎంపికైన కథలు 'స్థానిక పాలన' పత్రికలో ప్రచురితమవుతాయి.

☆ ఫలితాలను డిసెంబర్ 2010 'స్థానిక పాలన' పత్రికలో చూడవచ్చు.

చిరునామా:
**ఎడిటర్, 'స్థానిక పాలన'**
ఎ.ఎం.ఆర్. అపార్డ్, రాజేంద్రనగర్,
హైదరాబాద్-500 030. ఆంధ్రప్రదేశ్, ఇండియా.
ఫోన్: 040-24018656, ఫ్యాక్స్: 040-24017005
E-mail: phanikumar@ap.gov.in

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 9

అక్టోబర్, 2010



చీఫ్ ఎడిటర్

**డా॥ ఫణి కుమార్**

ఎడిటర్

**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ అరుణజ్యోతి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**సి. వెంకటేశ్వర రావ్**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID: phanikumar@ap.gov.in
phaniapard@gmail.com


# విషయ సూచిక


సంపాదకీయం .......... 2

విజయాల దశమి విజయ దశమి .......... 3

ప్రజా నిర్వహణలో పర్యావరణ పారిశుధ్యం .......... 6

ఆదర్శ గ్రామాల నిర్మాణానికి స్ఫూర్తి కలిగించిన పంచాయతీల సందర్శన .......... 9

అందమైన తెలుగుకి విందు భోజనం బద్దెన కవిత్వం .......... 12

గ్రామీణ నీటి సరఫరాపై ప్రభుత్వ సూచనలు .......... 16

గ్రామ రెవెన్యూ లెక్కలు-వాటి పరిణామం .......... 18

శ్రీరమణ పేరడీలు .......... 19

మహాత్మా గాంధీజీ ఆలోచనల్లో గ్రామీణాభివృద్ధి ప్రణాళికలు .......... 21

భూమి సర్వే ప్రక్రియ .......... 23

గ్రామీణాభివృద్ధి-వికేంద్రీకృత ప్రణాళికీకరణపై సర్టిఫికెట్ కోర్సు .......... 25

21వ శతాబ్ది భారతదేశంలో కులం-జనగణన .......... 27

గ్రామీణాభివృద్ధిలో రిమోట్ సెన్సింగ్ పాత్ర .......... 30

కామన్‌వెల్త్ క్రీడల్లో మన క్రీడాకారులు .......... 32

పేదలకు వరం ఉపాధి హామీ పథకం .......... 36

వలస దేవర (కథ) .......... 38

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు .......... 42

పంచాయతీరాజ్ వ్యవస్థ-సేవల వికేంద్రీకరణ .......... 44

రబీ పంటల సాగు .......... 53

ప్రధాన స్రవంతి మాధ్యమంలోకి ప్రాథమిక అవసరాలు రావా..? .......... 56

లేకి (కథ) .......... 57

పోషకాహార లోపం-ప్రగతికి అవరోధకం .......... 60

బడి పిల్లలకు బతుకులాట చూపించాలి .......... 63

అవిగో కోవెల దివ్వెలు ...! .......... 64

## సంపాదకీయం..

# జాతిపిత ఆలోచనలు పంచాయితీ ఆచరణ కావాలి

ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సామ్రాజ్యంతో అహింసాయుత పోరాటం చేసిన పూజ్య బాపూజీ మానవ పోరాటాల చరిత్రలోనే ఒక సరికొత్త పథాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సముపార్జనతోనే ఆయన సంతుష్టి చెందలేదు. అదే సమయంలో పీడనకు తావులేని, హింసకు చోటులేని సామాజిక వ్యవస్థ రూపకల్పనకు నిర్మాణాత్మక కృషి ఏమి చేయాలో, ఎలా చేయాలో చూపారు.

నిజం చెప్పాలంటే, మహాత్మాగాంధీ మొత్తం ఆలోచనలన్నీ గ్రామీణ ప్రజలు అనుభవిస్తున్న దుర్భర దారిద్ర్యం నుంచి వారిని ఎలా విముక్తం చేయాలన్న తపన నుంచి ఆవిర్భవించినవే. నగరాలు, పట్టణాల్లోని ప్రజల ఆహార అవసరాలన్నిటినీ తీర్చడం ద్వారా గొప్ప సేవలందిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రజల జీవన పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉండటం గాంధీజీని కలచివేసేది. అందువల్లనే, గ్రామీణ ప్రజల పరిస్థితులు మెరుగుపరచనిదే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా అర్థరహితమని ఆయన భావించేవారు.

గ్రామాల్లో సంపూర్ణమైన సామాజిక, ఆర్థిక మార్పులు రావాలని, తద్వారా గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పడానికి వీలవుతుందని బాపూజీ యోచించారు. గ్రామ స్వరాజ్య సాధనకు ఆయన రూపొందించిన కార్యక్రమంలో 'సహకారం' కూడా ఉంది. గ్రామీణ పరిశ్రమలను అభివృద్ధి పరచటంలోనే కాక, గ్రామీణుల్లో సమిష్టిగా కృషి చేసే తత్వాన్ని అలవరచటంలోనూ సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని గాంధీజీ దృఢంగా విశ్వసించేవారు.

సహకార సంఘాలు గ్రామీణ రంగంలో నిర్వహించే పాత్ర గురించి గాంధీజీ యోచన సరైనదే. ఎందుకంటే, కుటీర పరిశ్రమల్లో కానీ, వ్యవసాయంలో కానీ కొద్ది మొత్తాలను పెట్టుబడిగా పెట్టి, సహకార విధానాలను అనుసరిస్తూ, సమిష్టి కృషి జరపటం ద్వారా గ్రామీణులు తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని అనేక చోట్ల రుజువైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద ఆర్థిక సహాయం అందించటం వలన, ఈ విధానం ద్వారా ఆదాయం పొందటం గ్రామీణులకి మరింత సులువు. తద్వారా పట్టణాలు, నగరాలకు గ్రామీణుల వలసలను కూడా నివారించవచ్చు.

ఈ విషయంలో గ్రామ పంచాయితీలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. గ్రామాల్లో నిరుద్యోగులుగా ఉన్న వారిని సహకార సంఘాల ఏర్పాటు దిశగా ప్రోత్సహించి, వారికి తగిన సహాయ సహకారాలు అందించాలి. మార్గదర్శనం చేయాలి. సహకార శాఖ ద్వారా, బ్యాంకులు, ఆర్థిక సంస్థల ద్వారా వారికి తోడ్పాటు అందేలా పంచాయితీలు చొరవ తీసుకోవాల్సి ఉంటుంది.

తద్వారా మన జాతి పిత, పూజ్య బాపూజీ కలలు కన్నట్లు, విశ్వసించినట్లు, ఆకాంక్షించినట్లు గ్రామ స్వరాజ్యం ఆవిర్భవించడానికి దోహదపడగలం. పంచాయితీలు కూడా తమవంతు పాత్ర నిర్వహించినట్లవుతుంది.

# విజయాల దశమి విజయ దశమి



**సర్వమంగళ మాంగళ శివే సర్వార్థసాధకే!**
**శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే!!**

**ఆదిపరాశక్తి సర్వదేవతల శక్తుల్ని తనలో నింపుకొన్న దివ్యశక్తి స్వరూపిణి. బాలాత్రిపుర సుందరిగా, లలితాంబికగా, మహిషాసురమర్దినిగా సహస్రనామాలతో అలరారుతూ ఉండే తల్లి. అమ్మలగన్న యమ్మగా కీర్తిని పొంది, ఒక మాతృమూర్తిగా కష్టం తెలుసుకొని అందరినీ ఆదుకొనే దయాంతరంగ.**

మనదేశం పితృస్వామ్య వ్యవస్థగా పేరుపొందింది. అయినా తల్లికి ఇచ్చిన ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. *'న మాతుః పరదైవతమ్'* అని మాతృమూర్తి ప్రాశస్త్యాన్ని భారతజాతి ఏనాడో ప్రపంచానికి చాటి చెప్పింది. వేదకాలం నుంచే స్త్రీ విద్యాది అనేకరంగాలలో ఎంతో ప్రాధాన్యత ఉన్న స్థితిలో ఉందని చెప్పడానికి సాక్ష్యాలు ఉన్నాయి. మమతానురాగాలకీ, ఆత్మీయతా మకరందాలకీ నెలవయిన మన దేశంలో స్త్రీ స్వరూపాన్ని ఉపాసనగా చేసుకొని ఆరాధించడం కూడా అనాదిగా ఉంది. శైవం, వైష్ణవం, గాణాపత్యం అనే మతాలలాగే శాక్తేయం అనే మతం కూడా ఉంది. దీనిలో ఆరాధ్య దేవత శక్తి.

**ఓంకార పంజరశుకీం ఉపనిషదుద్యానకేళి కలకంఠీం**
**ఆగమ విపిన మయూరీం ఆర్యాం అంతర్విభావయే గౌరీమ్**

గౌరీదేవిని వేదాలలో ప్రతిపాదించిన దైవంగా శాక్తేయులు భావిస్తారు. అంతేకాదు మనదేశంలో ఎందరో గ్రామదేవతలున్నారు. వారందరూ ఈ శక్తి స్వరూపిణులే. ఎన్నో మహిమలతో భక్తులను కాపాడుతున్నారడానికి ఆధారాలున్నాయి. అవే ప్రజలలో అమ్మవారి మీద విశ్వాసాన్ని ఇంకా ఇంకా పెరిగేలా చేస్తున్నాయి.

## దేవీ నవరాత్రులు

భారతదేశంలో జరుపుకొనే పండుగలలో దసరా ఎంతో విశిష్టమైంది. ఇది దేవీ నవరాత్రులతో ప్రారంభమవుతుంది. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు చేసే ఉత్సవాలనే దేవీ నవరాత్రి ఉత్సవాలని పిలుస్తారు. ఇవి శరదృతువులో వస్తాయి. కాబట్టి శరన్నవరాత్రులని కూడా వ్యవహారం.

దేవి అంటే దుర్గాదేవి. ఈ దేవి తొమ్మిది రోజులలోనూ తొమ్మిది రూపాలతో పూజలను అందుకొని భక్తుల దుర్గతిని పోగొట్టి సుగతిని ప్రసాదిస్తుంది. అంటే కష్టాలను హరించివేసి, సుఖాన్ని ప్రసాదిస్తుంది. అందుకే ఆమె దుర్గ.





# అమ్మలగన్న యమ్మ . . .



కవిత్వం ఒక జీవకళ. అదే మామూలు వాక్యాన్ని సైతం కవిత్వంగా నిలబెడుతుంది. భాష మొత్తం పదాలుగా, అక్షరాలుగా, వర్ణాలుగా తుత్తునియలై పోయినా సరే.. అందులో ఏ ఒక్క ముక్కకయినా కవిత్వం చివురు తొడిగితే చాలు.. అది మళ్లీ జీవిస్తుంది. తాను జీవించి మళ్లీ ఆ వర్ణాలను, అక్షరాలను పదాలను కూర్చి భాషను పునర్నిర్మిస్తుంది. అంత శక్తి కవిత్వానికే కాదు.. కవిత్వానికే ఉంది.

అందుకే కవి సాధించనిదంటూ ఈ లోకంలో ఏదీ లేదు. కవికి తెలియనిదీ, కవి కననిదీ, ఆఘ్రాణించనిదీ ఏదీ లేదు. అందుకే 'కవిర్మనిషి పరిభూ స్వయంభూ' అంటూ ఈశావాస్యోపనిషత్తు కవిని పరమాత్మగా చెప్పడంలోని అంతర్యం ఇదే. ఆ తరువాత పరమాత్మ తత్త్వం తెలియడం వల్లనే ఋషులు కవులయ్యారు. ఆ ఋషి కానివాడు కవిత్వం రాయలేడన్నారు. ఇదంతా మానవబుద్ధికి అందని అతీతమయిన ప్రజ్ఞావిశేషమేదో ఉంటేగానీ కవి కవిత్వం రాయలేడన్నది అందరు అంగీకరించిన విషయం. అందుకే కవులు ఎంతమంది తరలిపోయినా కవిత్వం ఎన్ని రూపాలుగా మారినా కవిత్వం కవిత్వంలా నిత్యనూతనంగా అలరారుతూనే ఉంది ఉంటుంది.

పోతన సహజకవి బిరుదాంచితుడు. తన కావ్యాన్ని బాలకృష్ణుడికి ఇస్తూనే రాముడు రాయమన్నాడని చెప్పి రామకృష్ణావతారాల మహిమను ప్రకటించాడు. నన్నయగారు చూపించిన 'హరి హయార్కగజాననార్క షడాస్యమాతృసరస్వతీ' అనే పద్ధతిలోనే ఇష్ట దేవతాప్రార్థన చేస్తూ పార్వతిదేవి గురించి ఒక చక్కని పద్యం రాశాడు. అది ఇది.

అమ్మలగన్న అమ్మ ముగురమ్మలమూలపుటమ్మ చాల పె
ద్దమ్మ సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ తన్ను లో
నమ్మెడు వేల్పుటమ్మల మనమ్ముల యుండెడి యమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి ఈవృత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్

ఇక్కడ 'అమ్మలగన్న యమ్మ' అంటే ఆది పరాశక్తి అనే సూచన. అమ్మల కన్న అమ్మ అంటే పర్వతరాజపుత్రి అని మరొక విరుపు. ఎందరో అమ్మలను కన్న (రక్షించిన) అమ్మ అని కూడా చెప్పకోవచ్చు. లక్ష్మి, సరస్వతి, పార్వతి ఈ ముగ్గురూ అమ్మలు. వీరికి మూలపుటమ్మ. చాలపెద్దమ్మ అంటే - ఆమె ఆదిస్వరూపిణి అని తెలుస్తోంది. దేవతల తల్లి అయిన ఆదితి కడుపుశోకాన్ని ఎన్నోసార్లు పోగొట్టిన దయామయి. నమ్మినవారి ఎదలో కొలువై ఉండే తల్లి. ఆమె దుర్గ.

ఇలా మనసుని దేవాలయంగా కట్టి పూజిస్తే కానీ వశం కాని దుర్గమమయిన దేవత. అందువల్ల అటువంటి అమ్మని దయతో మహత్తునీ, కవిత్వాన్నీ, పటుత్వాన్నీ ఇమ్మని పోతన ప్రార్థిస్తున్నాడు.

ఇందులో ముగ్గురమ్మలనీ మూడింటిని ప్రసాదించమని వేడుకొంటున్నాడు. లక్ష్మీదేవిని మహత్తు నిమ్మనీ, సరస్వతిని కవిత్వమిమ్మనీ, పార్వతీదేవిని పటుత్వమిమ్మనీ అభ్యర్థన. పైకి కేవలం పార్వతీదేవి స్తుతిలా కన్పించేలా రాసినప్పటికీ పోతన మనసులో ముగురమ్మల మూర్తులూ బాగా ప్రతిష్ఠితాలయ్యాయి.

ఈ తొమ్మిది రోజులలో సరస్వతీ పూజ జరుపుకోవడం ఒక ముఖ్యమైన ఆచారం. సప్తమి రోజున మూలా నక్షత్రం నాడు దుర్గను సరస్వతి రూపంలో పూజిస్తారు. ముఖ్యంగా విద్యార్థులు తమకు చదువు బాగా రావాలని కోరుకొంటూ జీవితంలో ఉన్నతస్థానాల్ని పొందాలని ప్రార్థిస్తారు. ఈ విధంగా నవరాత్రులు గడిచిన తరువాత రోజే విజయదశమి. దీనినే దసరా అని పిలుస్తారు.

## దసరా

దసరా అన్నపదం 'దశహరా' అనే సమాస నుంచి వచ్చింది. అంటే పది పాపాల్ని హరించి వేస్తుందని అర్థం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు మూలమైన ఆదిపరాశక్తిని తొమ్మిది రోజుల్లోనూ తొమ్మిది రూపాలతో పూజలు చేసి, పదవరోజున అంటే దశమినాడు ఆయుధపూజ, శమీ పూజలను చేయడం మన ఆచారం.

పూర్వపు రాజులు దశమి రోజున శత్రువులపై దండెత్తి వెళ్ళేవారు. అలా చేస్తే విజయం తప్పక లభిస్తుందని వారి నమ్మకం. విజయం లభించాక తమకు సహకరించిన రథ, గజ, అశ్వాదులను, యుద్ధానికి ఉపయోగించిన ఆయుధాల్ని గౌరవంతో పూజించడం, అర్పించడం చేసేవారు. ఈ ఆచారాన్ని సామాన్య మానవులు కూడా ఆచరించే వారు. రైతులు, వృత్తులలో ఉన్నవారు కూడా తమ జీవనానికి ఉపయోగపడే పనిముట్లను పూజించడం దసరా నాడు అలవాటుగా మారింది. ఇది మానవునిలోని కృతజ్ఞతా భావనకు నిదర్శనం. ఇది నేటికీ కొనసాగుతోంది. అనంతరకాలంలో వాహనపూజ కూడా వ్యవహారంలోనికి వచ్చింది.

### శమీపూజ

రెండవది శమీ పూజ. శమీ అంటే జమ్మి చెట్టు. జమ్మి చెట్టును విజయదశమి నాడు పూజించడం మన ఆచారంగా మారింది.

*శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశినీ*
*అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ*

విజయదశమి నాడు జమ్మిపూజ చేసిన తర్వాతే శ్రీరాముడు రావణుడి పైకి దండయాత్రకు వెళ్ళాడు. పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్తూ తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై దాచి వెళ్ళారు. ఇటువంటి విశిష్టతలు ఉండడం వల్లనే శమీపూజ మన ఆచారంగా మారిందని పెద్దలు చెబుతారు.

దశమి నాటి సాయంత్రం మేళతాళాలతో ఊరి వెలుపల జమ్మిచెట్టు వద్దకు వెళ్ళి పల్లకీలో దేవతల విగ్రహాల్ని పెట్టుకొని ఊరేగింపు చేస్తారు. అక్కడ జమ్మి చెట్టు కింద దైవాన్ని ఉంచి, జమ్మిచెట్టును, దైవాన్నీ పూజిస్తారు.

జమ్మిచెట్టు సకల పాపాల్ని హరించి వేస్తుందని మనవారి నమ్మకం.

విజయదశమి నాడు ప్రారంభించిన కార్యానికి అపజయం అన్నది ఉండదు. ఈ పండుగను బెంగాల్, అస్సాం, ఉత్కళ, ఆంధ్రప్రాంతాలలో వైభవంగా చేస్తారు. మైసూరు, బరోడాలలోని దుర్గా ఉత్సవాలు, విజయవాడలోని కనకదుర్గ ఆలయోత్సవాలు చెప్పుకోదగ్గవి.

### పల్లెల్లో దసరా

పదిరోజుల పండుగయిన దసరాకి అందరూ ఆడబడుచుల్ని, అల్లుళ్ళనీ పిలిచి కొత్తబట్టలు పెడతారు. అంతా కలిసి మెలిసి విందులతోనూ, వినోదాలతోనూ గడుపుతారు. కర్రసాములు. కత్తిసాములు, ఆటలు, మల్లయుద్ధాలు, మొదలయిన పోటీలు నిర్వహిస్తారు. పులివేషాలు, పగటివేషాలు, బొమ్మల కొలువులు ఈ పండుగకు అదనపు ఆకర్షణ. బీదవారికి, యాచకులకు దానాలు చేస్తారు. ఇలా చెయ్యడం మనుషులలోని దయాగుణాన్ని పెంపొందేలా చేస్తుంది.

ఇల్లు అలికి ముగ్గులు పెట్టి గుమ్మాలకు తోరణాలు కట్టి అందంగా అలంకరిస్తారు. ఆడవాళ్ళు బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పసుపు కుంకుమ, పువ్వుల్ని పంచి అందరి దీవెనల్ని అందుకొంటారు. ఇలా చేయడం వల్ల సమాజంలో మనిషి అందరితో కలిసి మెలసి జీవించడానికి అలవాటు పడతాడు. క్రీడల వల్ల పోటీతత్వం అలవడుతుంది. శరీరధారుఢ్యం కలుగుతుంది. దేన్నయినా కష్టపడి సాధించాలనే తపన పెరుగుతుంది. కళల పట్ల ఆరాధన, అభినివేశం దసరా వల్ల కలుగుతుంది. వ్యక్తిని వ్యక్తిగా తీర్చిదిద్దడానికి కావలసిన ఉత్తమమైన లక్షణాలను పిల్లలలో చిన్ననాడే కలిగించడానికి దోహద పడడం ఈ పండుగలోని మరో ప్రత్యేకత.





### పిల్లల్లో దసరా

పిల్లలు చిచ్చర పిడుగులు. వీళ్ళను ఎలా మలచుకొంటే అలా తయారవుతారు. ఈ సూక్ష్మం తెలియజేసే పండుగే దసరా. పూర్వం దసరా వచ్చిందంటే పిల్లలంతా విల్లూ, బాణాలు ధరించి, రంగుల్ని జల్లుకొంటూ ఊరంతా తిరిగేవారు. గురువుగారు నేర్పిన పద్యాలను నోరారా ఆలపిస్తూ హడావుడి చేయడం ఎంతో ముచ్చటగా ఉండేది. 'ధరసింహాసనమై నభమ్ము గొడుగై తద్దేవతల్ పుత్రులై వర్ధిల్లు నారాయణా!' అని నారాయణ శతకంలోని పద్యాలను ఎలుగెత్తి పాడుతూ ఊరంతా తిరుగుతూ ఉంటారు. దసరా పాటలు వినడానికి, పాడడానికి ఎంతో హృద్యంగా ఉంటాయి.

*ఏదయా మీ దయా మా మీద లేదు -*
*ఇంత సేపుంచుట ఇది మీకు తగునా*
*దసరాకు వస్తిమని విసవిసలు పడక - చేతిలో లేదనక అప్పివ్వరనక*
*ఇరుగుపొరుగులవారు ఇస్తారు సొమ్మే - పావల బేడైతె పట్టేది లేదు*
*అర్థరూపాయైతె అంటేది లేదు - ముప్పావలా అయితె ముట్టేది లేదు*

ఇచ్చు రూపాయాయైతె పుచ్చుకుంటాము - అటు పైని పావలా పప్పుబెల్లాలు అయ్యవారికి చాలు అయిదు వరహాలు - పిల్లవాళ్ళకు చాలు' అని పాడుకొంటూ ఊరేగుతుంటారు. ఇవన్నీ పిల్లల్లో మనోవికాసాన్ని పెంపొందింప జేస్తాయి. సామాజిక అవగాహన, సమైక్య జీవనం అలవడతాయి. చిన్నప్పటి నుంచే చురుకుదనం, చొచ్చుకుపోయే మనస్తత్వం అబ్బుతుంది.

తరగతి గదిలో ఎక్కడో మారుమూల నీరసంగా పడికూర్చున్న విద్యార్థిని సైతం దసరా వేదికపైకి తీసుకొస్తుంది. వారిలోని అభిరుచుల్ని, నైపుణ్యాల్ని వెతికి బయటకు తీస్తుంది. తల్లిదండ్రుల కంటే గురువుగారితోనే విద్యార్థి ఎక్కువగా కలివిడిగా తిరుగుతారు. అటువంటి విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దుతాడు ఉపాధ్యాయుడు. వీరి గురు శిష్య సంబంధాన్ని సామాజికమైన ఆచారాలతో ముడివేసి మహత్తరంగా తెలియజేస్తుంది దసరా.

ఇటు ఆధ్యాత్మికంగానూ సామాజికంగానూ ఎంతో గొప్పదైన దసరా నాడు దుర్గామాతను, సర్వసతీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించి, మనల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దమని ఆ తల్లిని వేడుకొందాం.

*- డా. అద్దంకి శ్రీనివాస్*



**మా**నవునికి రక్షిత మంచినీరు ఎంత అవసరమో పర్యావరణ పారిశుద్ధ్యం కూడా అంతే అవసరం. ప్రపంచంలో ఇప్పటికీ 2.6 బిలియన్ ప్రజలు సక్రమమైన పారిశుద్ధ్యం వసతులు పొందలేక అనేక వ్యాధులతో సతమతమవుతున్నారు. అంతేకాకుండా ప్రపంచంలో 884 మిలియన్ ప్రజలు రక్షిత మంచినీటి సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మిగతా ఆఫ్రికన్ దేశాలు, వాటికన్ అమెరికా దేశాలు ఈ పద్ధతిని అవలంబిస్తున్నాయి. ఈ పద్ధతి ఆయా దేశాలలో పారిశుద్ధ్యం పెంపొందించడంలో కీలక పాత్ర వహించిందని చాలా నివేదికలు తెలియ జేస్తున్నాయి.

పారిశుద్ధ్యం అంటే 'వ్యాధులను అరికట్టడానికి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి తీసుకున్న చర్యలు'.

# ప్రజానిర్వహణలో పర్యావరణ పారిశుద్ధ్యం

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచంలో ప్రతి 8 మందికి ఒక్కరు రక్షిత మంచినీటిని పొందలేకపోతున్నారని చెపుతున్నారు. ఈ కారణాల వల్ల ప్రతి సంవత్సరం 1.8 మిలియన్ పిల్లలు అతిసారవ్యాధితో మరణించడం జరుగుతున్నది. ఇప్పటివరకు భారత ప్రభుత్వం, వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు (ఉదా: UNICEF, UNDP, World Bank, FID) కొన్ని వేల కోట్ల రూపాయలు ఈ రంగంలో ఖర్చు చేయడం జరిగింది. భారత ప్రభుత్వం 1986లో కేంద్ర గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రజల పారిశుద్ధ్యపు అల వాట్లను పెంపొందించడానికి చర్యలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం అమలులో పొందిన అనుభవాలను దృష్టిలో వుంచుకొని భారత ప్రభుత్వం 1999 లో సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమ అమలులో కొంతవరకు పురోగతి సాధించి నప్పటికీ, సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా పలు గ్రామాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

ఈ క్రమంలో ప్రజా నిర్వహణలో పారి శుద్ధ్య (PMES) అనే ఒక కొత్త పద్ధతిని 2000 సంవత్సరంలో బంగ్లాదేశ్ దేశంలో ప్రారంభించబడింది. ఇందులో సమాజం మొత్తం కలిసి బహిరంగ మలవిసర్జన నిర్మూలించడానికి ఒక నిర్ణయం తీసు కుంటారు. బహిరంగ మలవిసర్జన చేయ రాదని వారు తీర్మానిస్తారు. బంగ్లాదేశ్ తరువాత ఇండియా, కాంబోడియా, ఇండోనేషియా, నేపాల్, పాకిస్తాన్

ఈ PMES విధానంలో ప్రజలను చైతన్యపరచడానికి వివిధ రకాల ట్రిగ్గరింగ్ పద్ధతులను ఉపయోగిస్తాం.

- గ్రామస్థులతో సత్సంబంధాలు
- గ్రామం, బహిరంగ మలవిసర్జన జరిగే ప్రాంతాలలో నడక
- గ్లాసు - నీరు
- గ్రామ పటం
- లెక్కలు
- ప్రవాహం
- బహిరంగ మలవిసర్జన వలన వచ్చే జబ్బులు
- వైద్య ఖర్చులు లెక్కించడం
- నీటి పరీక్ష



పైన చెప్పిన పద్ధతుల ద్వారా గ్రామ ప్రజలలో బహిరంగ మల విసర్జన, కలుషిత నీరు, మురుగునీరు, చెత్తాచెదారం వలన కలిగే నష్టాల ను వివరించడం జరుగుతుంది. ప్రజలలో ఆలోచన కలిగే విధంగా ఈ కార్యక్రమాలు చేపట్టాలి. ఈ ట్రిగ్గరింగ్ అయిన మరుసటిరోజు ఆ గ్రామానికి వెళ్ళి ట్రిగ్గరింగ్ అయిన తరువాత (పోస్ట్ ట్రిగ్గరింగ్) చేయవల సిన కార్యక్రమాలు చేపడతారు.

గ్రామంలో పర్యావరణ పారిశుద్ధ్యం కమిటీ ఏర్పాటు చేయాలి. కమిటీలో సర్పంచ్, వార్డు మెంబర్లు, సహజ నాయకులు, యువతీ యువకులు ఈ కమిటీలో కనీసం 50% మంది మహిళలు ఉండాలి. కమిటీ ఏర్పాటు చేసిన తరువాత కమిటీతో తీర్మానం చేయించాలి. ఇందులో గ్రామ ప్రజలంతా పాల్గొని ఫలాన తేదీకి మా గ్రామాన్ని సంపూర్ణ పర్యావరణ పారిశుద్ధ్యం గ్రామంగా తీర్చిదిద్దుకుంటామని తీర్మానం చేయించాలి. ఇందులో బహిరంగ మలవిసర్జన నిర్మూలన, మురుగునీరు యాజమాన్యం, చెత్తాచెదారం యాజమాన్యం, రక్షిత మంచినీటి సరఫరా, పాఠశాల, అంగన్‌వాడి పారిశుద్ధ్యం మొదలైన అంశాలు ఉండాలి. చివరిగా గ్రామం మొత్తం సర్వే చేసి గ్రామ పారిశుద్ధ్య ప్రణాళిక తయారు చేయాలి. గ్రామంలోని ప్రతి ఒక్కరికి పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించే విధంగా కార్యక్రమాలు అమలు చేయాలి.



ఈ PMES అమలులో భాగంగా అపార్డు, గ్రామీణ నీటిసరఫరా పారిశుద్ధ్య శాఖ వారు మాస్టర్ ఫెసిలిటేటర్లుకు శిక్షణ ఇచ్చి వీరి ద్వారా అపార్డుకు అనుబంధంగా వున్న 5 విస్తరణా శిక్షణా కేంద్రాలలో (ETC) దాదాపు 1200 మంది గ్రామస్థాయి ఫెసిలిటేటర్లుకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి, వారి ద్వారా మొదటి దశలో గుర్తించిన 2000 గ్రామపంచాయతీలలో ఈ PMES పద్ధతిలో ట్రిగ్గరింగ్ విధానం ద్వారా గ్రామ పారిశుద్ధ్యం ప్రణాళికలు తయారు చేయడం జరిగింది. ఈ 1200 మంది గ్రామస్థాయి ఫెసిలిటేటర్లు 3-4 మందిని కలిపి ఒక టీంగా ఏర్పాటు చేసి కొన్ని గ్రామాలు వారికి కేటాయించడం జరిగింది. ఆ టీం సభ్యులు వారికి కేటాయించిన గ్రామాలలో ఒక్కొక్క గ్రామంలో 3-4 రోజులు ఉండి ట్రిగ్గరింగ్ టూల్సు ద్వారా ప్రజలను చైతన్యపరచి, గ్రామ పర్యావరణ పారిశుద్ధ్య కమిటీ ఏర్పాటు చేసి, ఆ కమిటీ ద్వారా ఫలానా తేది నాటికి మా గ్రామాన్ని సంపూర్ణ పర్యావరణ పారిశుద్ధ్యం గ్రామంగా తీర్చిదిద్దుకుంటామని తీర్మానం చేయించడం జరిగింది.

### 1. గ్రామస్తులతో సత్సంబంధాలు

ఫెసిలిటేటర్లు గ్రామంలోకి వెళ్ళిన తరువాత గ్రామం మొత్తం తిరుగుతూ గ్రామస్తులతో తాము గ్రామానికి వచ్చిన ఉద్దేశ్యాన్ని తెలియజేస్తూ, వారితో స్నేహసంబంధాలు ఏర్పాటు చేసుకుంటూ అందరినీ ఒక ప్రదేశానికి సమీకరిస్తారు. ఈ విధంగా చేయడం వలన గ్రామస్తులు సులభంగా గ్రామవిషయాలను ఫెసిలిటేటర్లుతో చర్చించడం జరుగుతుంది. గ్రామానికి సంబంధించిన సమాచారం అంతటినీ సేకరించడానికి అవకాశం ఏర్పడుతుంది.

### 2. బహిరంగ మలవిసర్జన ప్రాంతాలలో నడక

ఫెసిలిటేటర్లు గ్రామస్తులతో కలిసి బహిరంగ మలవిసర్జన చేసే ప్రాంతాలను సందర్శించాలి. దీని వలన ఏ ఏ ప్రాంతాలలో బహిరంగ మలవిసర్జన చేస్తున్నారో తెలుస్తుంది. ఈ నడక వలన పరిసరాలు కలుషితమయ్యే విధానాలను గ్రామస్తులు తెలుసుకొంటారు.

### 3. గ్లాసు - నీరు

బహిరంగ మలవిసర్జన చేసే ప్రాంతాల సందర్శనలో భాగంగా ఫెసిలిడేటర్లు ఒక గ్లాసులో నీరు, ఒక పొడవాటి వెంట్రుకను తీసుకొని వెంట్రుకను మలంలో అటుఇటూ తిప్పి గ్లాసులో వున్న నీటిలో ముంచాలి. తరువాత ఈ నీటిని ఎవరైనా తాగుతారా అని అడగాలి. అపుడు గ్రామస్తుల ముఖాలలో మిశ్రమ స్పందనలు గమనించవచ్చు. ఈ విధానం ద్వారా బహిరంగ మలవిసర్జన ద్వారా గ్రామ నీటివనరులు కలుషితమయ్యే క్రమాన్ని తెలుసుకుంటారు. వారిలో ఆలోచనలు చెలరేగుతాయి.

### 4. గ్రామపటం

గ్రామస్తులందరితో కలిసి గ్రామపటాన్ని గీయించి, వారితోనే ఆ గ్రామపటంలో బహిరంగ మలవిసర్జన చేసే ప్రాంతాలను పసుపుపచ్చ రంగుతో గుర్తించమని చెప్పాలి. ఈ పటం ద్వారా ఆ గ్రామంలో బహిరంగ మలవిసర్జన తీవ్రతను తెలియజేస్తూ, దాని దుష్పరిణామాల గురించి గ్రామస్తులకు తెలియజేయడం వలన వారిలో ఒక చలనం తీసుకురావడానికి అవకాశం ఉంటుంది.

### 5. మలము లెక్కలు

ఫెసిలిటేటర్లు గ్రామంలో రోజుకు ఎంత మలం ఉత్పన్నమవుతున్నది. అలాగే ఒక సంవత్సర కాలానికి ఎంత మలం మన గ్రామంలో

ఉత్పన్నమవుతున్నది అనే విషయాలు తెలియజేస్తూ దాని వలన కలిగే నష్టాలను వివరించాలి.



### 6. ప్రవాహం

బహిరంగ మలవిసర్జన ద్వారా మన పరిసరాలు ఏ ఏ మార్గాల ద్వారా కలుషితమవుతున్నాయో తెలియజేస్తూ దాని వలన సంభవించే నష్టాలను తెలుసుకుంటారు.

### 7. బహిరంగ మలవిసర్జన - జబ్బులు

బహిరంగ మలవిసర్జన ద్వారా సంభవించే జబ్బులు (అతిసార, మలేరియా, కలరా, విరేచనాలు మొదలగు) గురించి తెలియజేస్తూ ప్రజలలో అవగాహన కలుగజేస్తారు.

### 8. వైద్యఖర్చులు లెక్కించడం

కలుషిత నీరు, అపరిశుభ్ర పరిసరాలు వలన కలిగే జబ్బుల వలన గ్రామస్తులు చేస్తున్న వైద్య ఖర్చులు, అలాగే వారు నష్టపోతున్న పని దినాల గురించి తెలియ జేయడం వలన వారిలో అవగాహన పెంపొందించి, వారి అలవాట్లలో మార్పు తీసుకురావడానికి అవకాశం ఉంటుంది.

### 9. నీటి పరీక్షలు

చివరిగా ఆ గ్రామంలో ఉపయోగించే నీటిని $HS_2$ పరీక్షలు నిర్వహించాలి. వారు తాగుతున్న నీరు సురక్షితమైనవా లేక కలుషితమవుతున్నాయా అనేది తెలియజేయాలి. ఎందువలన నీరు కలుషితమవుతాయో వివరించాలి.

ఈ విధంగా 2000 గ్రామాలలో గ్రామ పర్యావరణ పారిశుద్ధ్య ప్రణాళికలు తయారు చేసి సంబంధిత గ్రామీణ నీటి సరఫరా సూపరిటెండ్ ఇంజనీరుకి అందజేయడం జరిగింది. ప్రణాళికలో పొందుపరచిన అంశాలను గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్య శాఖ ఇతర సంబంధిత శాఖల (Line Departments) సమన్వయంతో అమలు చేయడం జరుగుతుంది. వీటికి సంబంధించిన శిక్షణా కార్యక్రమాలను అపార్డులో నిర్వహిస్తారు.

గత కొన్ని సంవత్సరాలుగా అమలుచేస్తున్న కార్యక్రమాలు ద్వారా రక్షిత మంచినీటి సరఫరాలో కొంతవరకు పురోగతి సాధించామని చెప్పవచ్చు. అయితే పారిశుద్ధ్య విషయంలో మనం చాలా వెనకబడి వున్నామని చెప్పవచ్చును. యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రతి 10 మందికి 7 మంది గ్రామీణ ప్రజలు సరి అయిన పారిశుద్ధ్య సౌకర్యాల లేక జీవనం గడుపుతున్నారు. ప్రతి సంవత్సరం ఎయిడ్స్, మలేరియా వ్యాధులతో మరణించే వారికంటే డయేరియాతో చనిపోయే పిల్లలు ఎక్కువగా వున్నారని మన గణాంకాలు చెపుతున్నాయి.


ప్రతిరోజు 4000 మంది లేక ప్రతి 20 సెకండ్లకు ఒక్కరు చొప్పున శిశుమరణాలు సంభవిస్తున్నాయి. ప్రతి సంవత్సరం దాదాపు 60 మిలియన్ శిశుజననాలు పారిశుద్ధ్యం సౌకర్యాలు నోచుకోని కుటుంబాలలో జరుగుతున్నాయని అంతర్జాతీయ సంస్థల నివేదికలు తెలియజేస్తున్నాయి. ఈ సమస్యలన్నింటినీ నిర్మూలించడానికి ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు విశేష కృషి చేస్తున్నప్పటికీ, ఆశించినంత ప్రగతి సాధించలేక పోతున్నాం. ఇంతవరకు అమలుచేసిన కార్యక్రమాల ఎలో సప్లైడ్రివెన్ విధానం, సబ్సిడీ విధానం ఇమిడి వుంది. పారిశుద్ధ్య కార్యక్రమాల అమలులో 'ప్రవర్తనలో మార్పు' (Behavioural Change) అనేది చాలా కీలకం అని చెప్పవచ్చు. పథకం అమలులో దీనిపై ఎక్కువగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు సంబంధించిన అంశాలు చిన్నతనం నుంచి అలవరచుకోవలసిన అలవాట్లు. ఒక అలవాటును మార్చడం చాలా కష్టమని మనందరికి తెలుసు. పారిశుద్ధ్యపు అలవాట్లలో మార్పు రానంత వరకు మనం అమలుచేసే కార్యక్రమాలలో పురోగతి సాధించడం చాలా కష్టమని చెప్పవచ్చు. ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి, ఆలోచన రేకెత్తించడానికి ఈ CLTS అనే ఒక కొత్త విధానాన్ని పరిచయం చేయడం జరిగింది.

ఈ విధానంలో అనేక ప్రేరేపణ కార్యక్రమాల ద్వారా ప్రజలను పారిశుద్ధ్యపు అలవాట్లపై చైతన్యపరచి, అపరిశుభ్రత పరిసరాలు వలన కలిగే అనర్ధాలను తెలియజేస్తూ వారిలో ఒక కదలిక తీసుకువచ్చి, సమాజం మొత్తం కలసికట్టుగా ముందుకు వచ్చి సంపూర్ణ పర్యావరణ పారిశుద్ధ్య గ్రామంగా సాధించడానికి చేపట్టవలసిన కార్యక్రమాల గురించి చర్చించి అందరి ఆమోదంతో అమలు చేయడానికి, సన్నద్ధం చేయడానికి ఈ PMES దోహదపడుతుందని చెప్పవచ్చును. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పవచ్చు.

మంచి పారిశుద్ధ్యపు అలవాట్లను పాటించే విధంగా ప్రజలను ప్రేరేపించే కార్యక్రమాలు ద్వారా పారిశుద్ధ్య పథకాలు అమలు చేయగలిగితే గ్రామీణ ప్రజలకు మెరుగైన పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని అందించగలమని చెప్పవచ్చు.

- డా॥ యమ్. ముత్యాలు
సిడబ్ల్యు ఎస్ - అపార్డ్



# ఆదర్శ గ్రామాల నిర్మాణానికి స్ఫూర్తి కలిగించిన పంచాయతీల సందర్శన

ఎ.యం.ఆర్. అపార్డ్ వారు జాతీయ సామర్థ్యాల పెంపు కార్యక్రమంలో భాగంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల (బి.ఆర్.జి.ఎఫ్) మార్గదర్శకాలతో రూపొందించిన ఆదర్శ పంచాయతీల సందర్శనలో భాగంగా మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల సందర్శన తరువాత తమిళనాడు రాష్ట్రంలోని ఆదర్శ గ్రామాలను సందర్శించేందుకు ప్రాంతీయ విస్తరణ శిక్షణా కేంద్రాల (ఇ.టి.సి) ద్వారా ప్రణాళిక రూపకల్పన చేయబడినది. ముందుగా ఇ.టి.సి. రాజేంద్రనగర్ పరిధిలో గల 5 జిల్లాల ప్రజా ప్రతినిధులను పంపేందుకు కార్యక్రమం రూపొందించబడింది.

మొదటి విడతగా నిజామాబాద్ జిల్లా సర్పంచ్‌లకు ఈ సందర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడినది. రూపొందించిన ప్రణాళిక ప్రకారం ది. 14.07.2010 తేది మధ్యాహ్నం గం. 1.00లకు నిజామాబాద్ జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయం నుండి సర్పంచుల సందర్శన యాత్రను ప్రారంభించటం జరిగింది. ఈ యాత్ర ద్వారా తమ గ్రామాలను కూడా అభివృద్ధి బాటలో నడిపించడానికి, ఆదర్శవంతమైన మార్గాలను ఆచరించడానికి అవసరమైన స్ఫూర్తిని, ఆసక్తిని సర్పంచ్‌లలో కలిగించడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యం.

ఆదర్శ గ్రామ పంచాయతీల సందర్శనలో ముఖ్యంగా ఈ దిగువ తెల్పిన అంశాలకు ప్రాముఖ్యత నివ్వటం జరిగింది.

1. గ్రామ పంచాయతీ వనరుల అభివృద్ధి
2. త్రాగునీటి సరఫరా
3. పారిశుధ్యం - పర్యావరణ పరిరక్షణ
4. పాలనలో ప్రజల భాగస్వామ్యం, అవగాహన
5. పాలనలో పారదర్శకత.
6. విద్య

7. చెట్ల పెంపకం.

8. 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు సంక్రమించిన అధికారాల అమలు.

ఈ కార్యక్రమంలో భాగంగా తమిళనాడు. రాష్ట్రంలోని తిరుచ్చి (తిరుచ్చిరాపల్లి) జిల్లాకు చేరుకుని మొదట మనాచనల్లూర్ బ్లాకులోని 'పునంపాళయం' గ్రామాన్ని సందర్శించటం జరిగింది. సంపూర్ణ పారిశుధ్ధ్య ఉద్యమం ద్వారా ఈ గ్రామంలో ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేసి, 2006-07 సంవత్సరానికి గాను ఈ గ్రామానికి 'నిర్మల్ గ్రామ పురస్కార్' అవార్డు ను సాధించారు. ఈ గ్రామ సర్పంచ్ అయినటువంటి శ్రీమతి మీనాంబ రాజమాణికం మన రాష్ట్ర సర్పంచులను సాదరంగా ఆహ్వానించారు. పరిచయాల తరువాత పూనం పాళయం ఎన్.జి.పి. అవార్డును సాధించే స్థాయికి రావటంలో ప్రజల భాగస్వామ్యం, తనవంతు కృషి, అక్కడి బ్లాకు స్థాయి అధికారుల సహకారం మొదలైన విషయాలను వివరించారు. ముందుగా గ్రామపంచాయితీ తాలూకు ఆర్థిక, సామాజిక స్థితిగతులను వివరించారు.

## పూనంపాళయం

ఈ గ్రామం 5400 మంది జనాభాతో, 1500 యిండ్లతో, 4 హామ్లెట్‌లను కలిగివుంది. యిక్కడ 6 వార్డులకు గాను 9 మంది సభ్యులు ఎన్నుకోబడ్డారు. తమిళనాడు రాష్ట్రంలో నేటికీ పూర్వపు బ్లాకు వ్యవస్థయే కొనసాగుతున్నది. సర్పంచులందరూ ప్రస్తుతం అమలు కాబడుతున్న సామాజిక పింఛన్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణ పథకం, త్రాగునీటి సరఫరా, పారిశుధ్ధ్య నిర్వహణ మొదలైన విషయాలపై తమకు గల సందేహాలను నివృత్తి చేసుకొని మన రాష్ట్రానికి, ఆ రాష్ట్రానికి గల వ్యత్యాసాలను బేరీజు వేయడం మొదలు పెట్టారు.

గ్రామంలో పారిశుధ్ధ్యం విషయాన్ని పరిశీలిస్తే. గ్రామంలో మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదు. వాటి స్థానే ప్రతి యింటి ఆవరణలో యింకుడు కుండీల వ్యవస్థ కనిపించింది. అందువల్ల గ్రామంలో పారిశుధ్ధ్య నిర్వహణ తలకు మించిన భారంగా పరిణమించలేదు. అయినప్పటికీ, గ్రామ పంచాయతీ వారు నెలకు రెండు పర్యాయాలు ప్రాంతాల వారీగా దినసరి వేతన కూలీలచే చెత్తా చెదారాలను తొలగింప చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వ్యయం కూడా స్వల్పంగానే కన్పిస్తోంది. ప్రతి యింటికీ మరుగుదొడ్డి సౌకర్యం ఉంది.

త్రాగునీటిని సరఫరా చేయటానికిగాను 10,000 నుండి 20,000 లీటర్ల సామర్థ్యం కలిగిన 27 ఓ.హెచ్.ఎస్.ఆర్.లు, 5000 లీటర్ల సామర్ధ్యం కలిగిన ఓ.హెచ్.ఎస్.ఆర్.లు 7 ప్రాంతాల వారీగా ఉన్నాయి. ప్రతి ఓ.హెచ్.ఎస్.ఆర్.కు వేర్వేరు మోటార్లు ఉన్నట్లు, రోజుకు రెండు పర్యాయాలు నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఓ.హెచ్.ఎస్.ఆర్.లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నామని, క్లోరినేషన్‌లో భాగంగా 2 క్లోరిన్ మాత్రలను రోజూ గ్రామస్తులే వచ్చి గ్రామపంచాయతీ కార్యాలయం నుండి తీసుకొని వెళ్తారని తెలియజేశారు. గ్రామంలో ఎక్కడా పిట్ ట్యాపులు కానీ, హెడ్‌లు లేని కుళాయిలు గానీ లేవు. ప్రతి మంచినీటి కుళాయి భూమికి 3 అడుగుల ఎత్తులోనే వుంది.

సామాజిక పింఛన్లకు సంబంధించినంత వరకు తమిళనాడు రాష్ట్రంలో వర్గీకరణ బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి నెలకు రూ.400-00లు చొప్పున పోస్టాఫీసు ద్వారా చెల్లించటం జరుగుతున్నది. కానీ మన రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులకు రు. 200-00లు చొప్పున, వికలాంగులకు రు. 500-00లు చొప్పున రకరకాల పద్ధతులలో చెల్లిస్తున్నారు. ఇక లబ్ధిదారుల విషయాన్ని పరిశీలిస్తే మన రాష్ట్రంలో గ్రామ పంచాయతీ స్థాయిలో వందల సంఖ్యలో సామాజిక పింఛన్లు చెల్లిస్తుండగా, సదరు రాష్ట్రంలోని గ్రామాలలో మాత్రం వంద లోపు సంఖ్యలోనే పింఛన్లు చెల్లిస్తున్నారు. దీనిని బట్టి అక్కడి ప్రజలలో గల అవగాహన, భాగస్వామ్యం పాలనలో పారదర్శకత, పాలకుల నిబద్ధత మొదలైన విషయాలను గమనించవచ్చును.

గృహ నిర్మాణ పథకం క్రింద కూడా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, యింటి నిర్మాణం పూర్తి చేసే విధంగా వారిని ప్రోత్సహిస్తున్నారు. అంతేకాకుండా ఎటువంటి ఆధారాలు లేని నిరుపేదలకు ప్రభుత్వమే గృహం నిర్మించి యిచ్చేవిధంగా 'కలైంజర్ వీటి వసతి తిట్టం' (కె.వి.వి.టి) అనే పథకాన్ని ప్రారంభించి, లబ్ధి దారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినట్లుగా తెలియజేసినారు. సదరు పథకం క్రింద నిర్మించే ఒక్కొక్క యింటి విలువ అంచనా సమారు రూ. 60,000 - 00 లు.

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు తీరును గూర్చి కూడా తమకు గల సందేహాలను సర్పంచులు నివృత్తి చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక ఏవిధంగా జరుగుతుంది? అని సర్పంచులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీమతి మీనాంబ, బి.పి.యల్ సర్వే ఆధారంగా, గ్రామసభ ద్వారా, పారదర్శకంగా జరుగుతుందని తెలియజేసినారు.

పనుల ఎంపిక ఏ విధంగా జరుగుతుంది? అని సర్పంచులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా, శ్రీమతి మీనాంబ ప్రజల అవసరాల మేరకు గ్రామ సభలో పనుల జాబితా తయారు చేసి, సదరు జాబితాను బ్లాకు కార్యాలయం ద్వారా జిల్లా కలెక్టరు వారికి సమర్పించి, అచటి నుండి అనుమతి లభించిన తరువాత పనుల ప్రాధాన్యత ననుసరించి పనులకు చేపట్టటం జరుగుతుందని తెలియజేశారు.

గ్రాంట్లు, యం.పి. నిధులు, యం.ఎల్.ఎ. నిధులకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంజూరు కాబడిన పనుల జాబితాననుసరించే నిధులు మంజూరు కాబడతాయని తెలియజేశారు.

పూనంపాళయం గ్రామంలోని ఆసక్తికరమైన విషయమేమిటంటే,

గ్రామంలో వర్షాలు కురియటం ద్వారా వచ్చే నీటినంతటినీ ఒక ప్రత్యేకమైన గుంట లేదా చెరువులోనికి తరలించే విధంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి ఉన్నారు. సదరు చెరువును 35×42 మీ॥ చుట్టు కొలతలతోను, 4మీ॥ లోతుతోను నిర్మించి ఉన్నారు. చెరువు ఉపరితల భాగం ఎక్కువ నీటితో నిండిన ఎడల అధికంగా వచ్చి చేరిన నీరు బయటకు పోయేందుకు అనువుగా అవుట్ లెట్‌ను ఏర్పాటు చేసి ఉన్నారు. సదరు చెరువులోనికి వచ్చి చేరిన నీటిని (ఉపరితలంలోని నీటిని) పశువులకు ఉపయోగించే విధంగాను, అదే సమయంలో సదరు చెరువులో నీటిని నిల్వ చేయటం ద్వారా భూగర్భజలాల నిల్వలను మెరుగు పరుచుటకు వీలుగా నిర్మాణాన్ని ఏర్పాటు చేసియున్నారు. సదరు చెరువు పనిని ఎ.జి.ఎ.యమ్.టి (అన్నైతు గ్రామ అన్నా మరు మలైచ్చి తిట్టం) గ్రాంటు ద్వారా వచ్చిన సుమారు రూ.8.5 లక్షల వ్యయంతో పూర్తి చేసినట్లుగా తెలియజేశారు.

సదరు గ్రామంలోని గ్రామస్థులు కుటీర పరిశ్రమల ద్వారా జీవనోపాధిని పొందుతున్నారు. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా యిచ్చే ఋణాలను గ్రహించి వారు ఈ కుటీర పరిశ్రమలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదరు కుటీర పరిశ్రమలలో మా టీము ప్రధానంగా గమనించిన కుటీర పరిశ్రమ ఏమిటంటే వజ్రాలు, కెంపులు, పచ్చలు మొదలైన బంగారు ఆభరణాల తయారీలో వినియోగించే రకరకాల రాళ్ళను సానపెట్టడం. పట్టణంలోని వ్యాపారుల నుండి ముడిరాళ్ళను స్వీకరించి సానపెట్టడం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఈ పనిని ఏదేని ఒక కుటుంబం చేపట్టటం లేదా తద్వారా మరింత మందికి జీవనోపాధిని కల్పించే విధంగా వుంది. సాన పెట్టిన రాయి ఒక్కింటికి రూపాయి చొప్పున పరిశ్రమ నడుపుతున్న వారికి వ్యాపారుల వద్దనుండి లభిస్తుంది.

పై అంశాలను గమనించగా ఇక్కడ గ్రామసభకు, తద్వారా ప్రజల అభిప్రాయానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి గ్రామాభివృద్ధిని సాధిస్తున్నట్లుగా తెలియ వస్తున్నది. కేవలం ఈ ఒక్క గ్రామ పంచాయతీయే కాకుండా తమిళనాడు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ ఇదే పద్ధతి అనుసరిస్తున్నట్లుగా తెలియవచ్చింది. అక్కడి ప్రజలు అవగాహనతో పాటు, బాధ్యతను కూడా కలిగి ఉన్నారనడానికి ఇవే నిదర్శనాలు. కాబట్టి ఈ విధానాలను మన రాష్ట్రంలో కూడా అమలు పరిస్తే మరింతగా అభివృద్ధిని సాధించేందుకు అవకాశం కలుగుతుంది.

## జి.జ్యోతి రెడ్డి, మామిడిపల్లి, ఆర్మూర్ మండలం

పూనంపాళయం గ్రామంలో డ్రైను వ్యవస్థ లేకపోవడం వల్ల పారిశుధ్ధ్య నిర్వహణ సులభతరమైనదనీ, కానీ ఈ పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో భిన్నంగా ఉందనీ తెలియజేసారు. ప్రతి యింటికీ ఐ.ఎస్.ఎల్ నిర్మాణం ఎంతో ఆవశ్యకమనీ, వారి 100% మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేస్తాననీ, అందుకు ప్రజలు, అధికారుల తోడ్పాటు తనకు ఎంతో అవసరమని తెలియజేసారు. అంతేకాకుండా వర్షం కురిసినప్పుడు వచ్చే నీటినంతటిని సమీకరిస్తూ ఏర్పాటు చేసిన ఏ.జి.ఏ.ఎమ్.టి పాండ్ భూగర్భ జలాల పెరుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని తెలియజేసారు.

## టి, నాగభూషణం గౌడ్, బిరనూర్ గ్రామం మండలం

తమిళనాడు రాష్ట్రంలో గ్రామాలలో ప్రజల భాగస్వామ్యంతో పాటు, నిధులు నేరుగా గ్రామ పంచాయతీకి రావటం వల్ల యింతగా అభివృద్ధి జేయడం సాధ్యపడిందని తెలియజేసారు. సెవింతిలింగపురంలో నిర్మించిన ఇకోసాన్ కమ్యూనిటీ కంపోస్టు టాయిలెట్స్ వల్ల ప్రజలకు, పంచాయతీకి కూడా ఎంతో లాభదాయకమనీ, ఇది ఎంతో ఆదర్శవంతంగా ఉందనీ, మన రాష్ట్రంలో కూడా ఈ విధమైన టాయిలెట్స్ నిర్మిస్తే బాగుంటుందనీ తెలియజేసారు.

## బి. రాజేశ్వర రావు, సాలూర, బోధన్ మండలం

ఏ విధమైన గ్రాంట్లు అయినా సరే పంచాయతీకి నేరుగా రావటం వల్ల అభివృద్ధి అనేది ప్రజలకు అందుబాటులోనికి వచ్చిందనీ, ప్రజలు, నాయకులు కలిసిమెలిసి పార్టీలకతీతంగా పనిచేస్తూ ముందుకు సాగుతున్నారని తెలియజేసారు.

## రమేష్ కులకర్ణి, ఖేమరాజ్ కల్లలి, జుక్కల్ మండలం

ప్రజలు, నాయకులు సమయస్ఫూర్తితో, సమభాగస్వామ్యంతో కలిసి ముందుకుసాగడం వల్ల అభివృద్ధిలో ముందజలో ఉన్నారనీ, యిక్కడ కొనసాగిస్తున్న ఐ.ఎస్.ఎల్ స్కీము అద్భుతంగా ఉందనీ, ఈ పరిస్థితీ మన రాష్ట్రంలో భిన్నంగా ఉందనీ, డ్రైన్లు లేకపోయినప్పటికీ పారిశుధ్ధ్య నిర్వహణ బాగుందనీ తెలియజేసారు.

## ఎస్. నిరంజనా చౌదరి, ఫరీద్ పేట, మాచారెడ్డి మండలం

చిన్న గ్రామాలైనా వివిధ విశిష్టతలతో అభివృద్ధిలో ముందంజలో ఉండటం వల్ల యితరులకు ఆదర్శవంతంగా ఉన్నాయనీ, కాబట్టి మన రాష్ట్రంలో కూడా ప్రజలు, నాయకులు కలిసి ముందుకు సాగితే అభివృద్ధి సాధ్యపడుతుందనీ తెలియజేసారు.

## పి. దామోదర్, వేల్పూర్ గ్రామం – మండలం

నాయకులు పక్షపాత వైఖరితో పని చేయరాదనీ, ప్రజలు కూడా తమ బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తించాలనీ, నిధులన్నీ గ్రామ పంచాయతీలకు నేరుగా వచ్చి చేరితే మరింత అభివృద్ధి సాధ్యపడుతుందనీ, గ్రామపంచాయతీ స్థాయిలో అధికారాలన్నీ సర్పంచ్‌లకే చెందాలనీ తెలియజేసారు.

**- జి. సత్యవాణి**

ఫ్యాకల్టీ, ఇ.టి.సి,
రాజేంద్రనగర్

## తెలుగు సాహిత్య చరిత్ర

**తెలుగు సాహిత్యంలో శతక వాఙ్మయానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది.**

శ్రీరాముని దయ చేతను
ఆరూఢిగ సకల జనులు జేరాయనగా
ధారాళమైన నీతులు
నోరూరగ చవ్వులుబుట్ట నుడిెదెద సుమతీ!

**అంటూ సుమతి శతకంలోని మొదటి పద్యాన్ని తెలుగు బాల బాలికలకు తల్లిదండ్రులు ఇంట్లో నేర్పిస్తారు. బడులలో ఉపాధ్యాయులు నేర్పిస్తారు. సుమతి శతకం, కృష్ణ శతకం, దాశరథి శతకం- వంటి శతకాలలోని పద్యాలను కనీసం ఓ పది పద్యాలు కంఠస్థం చేసినవారు ఈనాటికీ ఎందరో ఉన్నారు. అంటే తెలుగులోని తియ్యదనం అటువంటిది. ఆ పద్యాలలోని మాధుర్యం అటువంటిది.**

ఈనాడు, ఆంగ్లభాషా వ్యాప్తి, ఆంగ్లభాషా మాధ్యమంలోనే పిల్లలను చదివిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆశపడే తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు పంపుతున్నారు. అటువంటి పాఠశాలలో చదువుతున్న బిడ్డ తనను 'మమ్మీ' అని పిలువకుండా 'అమ్మా!' అని పిలిచినందుకు ఉపాధ్యాయులపై దండెత్తిన తల్లులు కూడా ఉన్నారనడం అతిశయోక్తి కాదు. తెలుగుభాషకు ప్రాచీన హోదా కల్పించాలని ఉద్యమాలు చేస్తున్న ఈ కాలంలో తల్లిదండ్రులు, తమ చిరంజీవులకు ఆంగ్లభాషలోని 'రైమ్స్'తో పాటు కొన్ని తెలుగు పద్యాలను నేర్పిస్తారని ఆశిద్దాం.

ఉన్నా తెలుగు సాహిత్యంలో, అందునా శతక వాఙ్మయంలో బద్దెన కవి రచించిన సుమతి శతకం ఒక ప్రముఖ స్థానాన్ని సంపాదించుకొంది.

ఏ కావ్యంలోనైనా కవి ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకొని కొన్ని నీతులు చెబుతాడు. బద్దెనకవి రచించింది శతకం కనుక ప్రతి పద్యంలోను ఏదో ఒక విశేషం ఉంటుంది. బద్దెనకవి సుమతి శతక రచనతో ఇతర కవులెవరూ పాటించని ఒక గొప్ప నియమాన్ని పాటించాడు. తాను రచించిన 110 పద్యాలను అకారాది క్రమంలో రాశాడు. మొదట శ్రీకారంతో శతకాన్ని ప్రారంభించి రెండవపద్యం అకారంతో మొదలుపెట్టి 7 పద్యాలు రాశాడు. తరువాత ఆకారము, ఇకారము ఈ విధంగా రచిస్తూ చివరి పద్యం 'స్త్రీల యెడ వాదులాడకు' అంటూ ముగించాడు. ఈరకమైన రచనా విన్యాసం ఎంతో చక్కగా ఉంది. ఈ పద్ధతిని ఎవరూ ప్రారంభించలేదు. అటువంటి కీర్తి బద్దెనకు మాత్రమే దక్కింది.

సుమతి శతకంలోని 'అక్కరకు రాని చుట్టము', 'అడిగిన జీతంబియ్యని' పద్యాలు నోటికి రాని తెలుగువాడు ఉండడంటే ఆశ్చర్యపడవలసిన ఆశ్చర్యం లేదు. ప్రతి పద్యంలోను ఒక విశేషమో, ఒక చమత్కారమో, ఒక గూఢార్థమో కనిపిస్తాయి. సాధారణంగా పద్యం చదువుతుంటే, దాని భావం అతిసులభంగా అర్థమౌతుంది. గూఢార్థం

# అందమైన తెలుగుకి విందు భోజనం బద్దెన కవిత్వం

బద్దెనకవి సుమతి శతకాన్ని రచించాడు. నీతిసార ముక్తావళి అనే మరొక గ్రంథాన్ని కూడా రచించాడు.

బద్దెనకవి ఆంధ్రచోళ రాజవంశానికి చెందినవాడు. కృష్ణా నదీ తీరానికి సమీపంలోనున్న 'దక్షిణాసహస్ర' దేశాన్ని పరిపాలించినవాడు. ఇది ఒక చిన్న సామంతరాజ్యం. బద్దెన ఒక చిన్న సామంతరాజు. బద్దెన కవి కాల నివాసాలను గురించి కవులలోను, విమర్శకులలోను భిన్నాభిప్రాయాలున్నాయి. తాతగారి పేరు మనుమడికి, ఆ తరువాత వారికి ఆ వంశంలో పెట్టడం చాలాకాలం నుండి వస్తున్న ఆచారం. ఈ పద్ధతి ఈనాటికి సంప్రదాయబద్ధంగా కొన్ని వంశాలలోను, కుటుంబాలలోను వస్తున్నదే. ఈ కారణంగా కొందరు విశ్లేషకులు బద్దెన కాలనిర్ణయం మీద తర్జనభర్జనలు పడ్డారు. చివరకు ఈ రాజకవి క్రీ.శ. 1156-1163 మధ్య కాలమువాడని నిర్ధారణ చేశారు. అస్తు! అగుగాక!

ఇది ఇలాఉంటే సుమతి శతకం రాసిన బద్దెన మరొకడున్నాడని కొందరన్నారు. తిక్కన సోమయాజు ఒక కృష్ణశతకం వ్రాశాడని కూడా విమర్శకుల అభిప్రాయం. కాని, తిక్కన రచించిన కృష్ణశతకం మాత్రం లభ్యం కావడంలేదు. ఎవరి అభిప్రాయాలు, ఊహలు, భావనలు ఎలా వంటి విషయాలు తెలియాలంటే, ఒక్కొక్కప్పుడు పండితుల పరిశీలన అవసరమౌతుంది. అటువంటి ఆసక్తికరాలైన విషయాలతో కూడిన ఒకటి రెండు పద్యాలను పరిశీలిద్దాం.

**అడియాస కొలువుఁగొలువకు**
**గుడి మణియము సేయబోకు కుజనుల తోడన్**
**విడువక కూరిమి సేయకు**
**మడవిని తోడరయ కొంటెనరుగకు సుమతీ!**

ఓ మంచి బుద్ధి కలవాడా! ఏదో లభిస్తుందని నిష్ప్రయోజనమైన ఆశ కలిగించే పనిని చెయ్యకు. దేవాలయాలలో ఉద్యోగం, దేవాలయాల పై అధికారం చేసే ఉద్యోగం చెయ్యకు. నీచమైన బుద్ధి గలవారితో అడ్డూ అపులేని స్నేహం చెయ్యకు. అడవిలో తోడు లేకుండా ఒంటరిగా ప్రయాణం చెయ్యకు.

బాగుంది. ఇంతవరకు పద్యంలోని భావం అర్థం చేసుకోగలం. మనం ఏ పనైనా చేస్తున్నామంటే కొద్దో గొప్పో ధనాపేక్షతోనే చేస్తాం. సంసారాన్ని గడుపుకోవాలంటే ధనం కావాలి కదా!

**'అర్థము పురుషార్థముల లోపలనుత్తమము అర్థవంతునకు**
**లోకమునందు సాధ్యమేమియు గానము'**

అని మిత్ర లాభంలో పరవస్తు చిన్నయసూరిగారి వచనముంది కదా! ఈనాటి సామెతలో చెప్పాలంటే "పైసామే పరమాత్మాహై", money makes many things వంటి సూక్తులు మనమెరుగనివి కావు. ఎంతో శ్రమపడి కష్టం చేసిన తర్వాత నెలసరి జీతం రాకపోతే ఉద్యోగస్థులు పడే అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. కొన్ని కొన్ని సంస్థలలో అయితే మాసాల తరబడి జీతాలు రావు. జీతాలు వస్తాయనే ఆశతో అనవసరంగా శ్రమపడి ఉద్యోగం చెయ్యవద్దంటాడు బద్దెన. ఈయన రాజ్య పరిపాలకుడు కూడా కావడం చేత కార్యనిర్వహణ (Administration)లో ఆరితేరినవాడు కనుక, జీతం రాని కొలువు చెయ్యవద్దని, పొట్ట పోషించుకోవడానికి మరో మార్గం లేదా దారిచూసుకోమని హితవు పలికాడు.

పైన చెప్పిన హితోపదేశం బాగానే ఉంది. దేవాలయాలలో (అర్చకత్వం) ఉద్యోగాన్ని, దేవాలయాలలో పనిచేసే అర్చకులు మొదలైన వారి మీద పెత్తనం చేసే అధికారంతో కూడిన ఉద్యోగాన్ని చెయ్యవద్దని నిష్కర్షగా చెప్పాడు. ఈనాడెన్నో పెద్ద పెద్ద దేవాలయాలు ఉన్నాయి. ఆనాటి ప్రభువులు, భక్తిశ్రద్ధలతో, పరమార్థం కోసం ఆ స్వామివారికెన్నో మాన్యాలు ఇచ్చారు. నగలు నట్రా యిచ్చారు. కానుకలిచ్చారు.

నిత్యోత్సవాలకు, వారోత్సవ పక్షోత్సవాలకు, మాసోత్సవ వార్షికోత్సవాలకు, ఇంకా మధ్య మధ్య వచ్చే ఉత్సవసేవలకు తమకు తోచిన విధంగా దానధర్మాలు చేశారు. వాటికి సంబంధించిన శాసనాలు వేయించారు. ఇవన్నీ ఎంత కట్టుదిట్టంగా ఉన్నా, దైవసంబంధమైన కార్యాలతో ముడిపడి ఉన్న ఉద్యోగం చెయ్యొద్దని బద్దెన చెప్పాడు. ఆయనింత గట్టిగా నొక్కి వక్కాణించాడంటే దీని వెనుక ఏదో ఒక విషయం దాగి ఉందని విమర్శకులు ఊహించగలరు.

"ప్రయోజన మనుద్దిశ్య న మందోపి ప్రవర్తతే" - అని సంస్కృతంలో ఒక సామెత ఉంది. ప్రయోజనాన్ని అంటే ఫలాపేక్షను ఆశించకుండా మూర్ఖుడు కూడా ఏ పని చేయడు అని దాని అర్థం. పాపభీతి, దైవభీతి లేని ఆలయోద్యోగం చెయ్యవద్దని బద్దెన బల్లగుద్ది చెబుతున్నాడంటే దానికో కథ శ్రీమద్రామాయణంలోనిది గుర్తు తెచ్చుకోవాలి.

శ్రీరామచంద్రుడు రాజ్యపరిపాలన చేస్తున్నాడు. ఆయన పాలనలో ప్రజలందరూ సుఖంగా కాలక్షేపం చేస్తున్నారు. ధర్మం నాలుగు పాదాల మీద నడుస్తోంది. ఒకవేళ ఎవరికైనా ఏ విషయం మీదనైనా ధర్మ నిర్ణయం కావాలనిపిస్తే ఒక ధర్మ ఘంటని శ్రీరామచంద్రుడు ఏర్పాటు చేశాడు. రాముడే ధర్మపరిపాలన సాగిస్తూ ఉంటే, ధర్మం జరుగలేదని ఎవరంటారు? ధర్మఘంట ప్రయోజనం ఏముంటుంది? అని శ్రీరాముని కొలువులోని వారు తర్కించుకొంటూ ఉండేవారు.

ఇలా ఉండగా, శ్రీరాముడు కొలువులో ఉన్న సమయంలో ఘణిల్లుమని ధర్మఘంట మ్రోగింది. సభ్యులంతా ఆశ్చర్యపోయారు. "లక్ష్మణా! ఘంటానాదం చేసిన వారెవరో తెలుసుకొనిరా!" అని రామచంద్రుడు లక్ష్మణుని ఆదేశించాడు. రాజాజ్ఞ ప్రకారం లక్ష్మణుడు బయటకు వచ్చి చూశాడు. అక్కడెవరు లేరు. చుట్టప్రక్కల చూశాడు. జనం ఎవరు కనబడలేదు. కాని, ఒక కుక్క వగరుస్తూ కనబడింది. అదే సంగతిని లక్ష్మణుడు శ్రీరామునకు చెప్పాడు. "పాపం! దానికేమి ధర్మసంకటం వచ్చిందో! తెలుసుకున్నావా?" అన్నాడు శ్రీరామచంద్రుడు.

లక్ష్మణుడు మళ్ళీ బయటకు వచ్చాడు. ఆసమయంలో కుక్క, మహాద్వారం వైపు చూస్తూ అరుస్తోంది. ఆ శాసనాన్ని చూచిన లక్ష్మణుడు,"మహాత్మా! నీకు వచ్చిన కష్టం ఏమిటి? అదేదో చెప్పు. శ్రీరామచంద్రుని పాలనలో ఏ జీవికి కష్టం కలుగకూడదు. నీకు వచ్చిన ఎటువంటి కష్టాన్నైనా నేను పోగొడతాను. నన్ను విశ్వసించు. శ్రీరాముడు అభయ ప్రదాత" అన్నాడు.

ఆ మాటలు విని శునకం, "లక్ష్మణా! బాగా చెప్పావు. శ్రీరాముడు అభయ ప్రదాత అని కదా నీవన్నావు. నేను చెప్పుకోవలసిన విషయాన్ని ఆ మహానుభావుడికే చెప్పుకొంటాను. మధ్య నీకు చెప్పడమెందుకు?" అని పలికింది. లక్ష్మణుడా విషయాన్నే శ్రీరామచంద్రునకు విన్నవించాడు.

రామాజ్ఞ ప్రకారం, లక్ష్మణుడు తిరిగివచ్చి, 'నీవు చెప్పుకోవలసిన విషయాన్ని శ్రీరామచంద్రుల వారికే విన్నవించుకో!' అని శునకాన్ని సభలో ప్రవేశపెట్టాడు. శ్రీరాముడు, సభలోని వారు కుక్కని చూశారు. దాని బుర్రబ్రద్దలై ఉంది. రక్తం కారుతోంది. ఎంతో బాధగా వగరుస్తోంది. అది సింహాసనం మీదనున్న శ్రీరామచంద్రుని, సభ్యుల్ని చూసింది.

శ్రీరాముడు, శునకాన్ని చూచి, "ఓ శునకమా! నీవు చెప్పదలచిన విషయాన్ని నిర్భయంగా చెప్పు" అన్నాడు.

శ్రీరాముని పలుకులు విని శునకం, "మహారాజా! లోకంలోని సర్వప్రాణులకు రాజే నాయకుడు. లోకమంతా నిద్రలో మునిగి ఉంటే, మహారాజు జాగరూకుడై ప్రజల రక్షణ భారం వహిస్తాడు. మహారాజు ధర్మ పరిపాలకుడు కాకపోయినా, సమర్థుడు కాకపోయినా, అధర్మపరులు విజృంభిస్తారు. ధర్మం నశిస్తుంది. దాని వలన సాధారణ ప్రజానీకం ఎన్నో ఇబ్బందులకు గురౌతారు. పరిపాలకుడు ప్రజలకు కన్నతండ్రి వంటివాడు. ఆయన లేకపోతే లోకమంతా శూన్యమైపోతుంది. నీవు ధర్మానికి ప్రతిరూపం. దయాసముద్రుడివి. నేనవసరంగా ఎక్కువగా మాట్లాడినట్లుగా నీకనిపిస్తే నన్ను క్షమించు" అంది.

ఆ మాటలకు శ్రీరాముడు, "నన్ను పొగిడే మాటలు వద్దు, ఇంతకీ నీ పనేమిటో చెప్పు" అన్నాడు.

అప్పుడు శునకం, "శ్రీరామచంద్రా! ఈ ఊళ్ళో సర్వార్థసిద్ధుడు అనే సన్యాసి ఉన్నాడు. అతడు నిష్కారణంగా నా బుర్రబద్దలు కొట్టాడు. ఇటు చూడు, రక్తం కూడా కారుతోంది" అంది.

సభ్యులు, శ్రీరామలక్ష్మణులు దాని కథ విన్నారు. కారుతున్న రక్తం చూశారు. ధర్మరక్షకుడైన శ్రీరాముడు సర్వార్థసిద్ధుని కొలువుకి పిలిపించాడు. "ఈ శునకాన్నెందుకు హింసించావు? ఇది నీకు చేసిన అపకారం ఏమిటి?" అని శ్రీరాముడు సర్వార్థ సిద్ధుణ్ణి ప్రశ్నించాడు.

దానికి సమాధానంగా సర్వార్థసిద్ధుడు, "శ్రీరామచంద్రా! నేనొక బ్రాహ్మణుడిని. పైగా సన్యాసిని. ప్రతిదినము నేను భిక్షాటన చేసి జీవిస్తున్నాను. జపతపాలు ముగించి, ఈనాడు భిక్షకు బయలుదేరేసరికి వేళమించిపోయింది. అందుకని తొందరగా బయలుదేరాను. నేనే ప్రక్కనుండి నడిస్తే ఈ కుక్క కూడా నా దారికి అడ్డు వస్తూ అదీ నడవసాగింది. భిక్ష అడిగేది అయిదారుగురు గృహస్థుల యిండ్లలోనే. అసలే సమయం మించిపోయింది. దానికితోడు ఈ కుక్క నా నడకకి అడ్డు తగులుతోంది. ఆ సమయంలో ఒక కట్టె దొరికింది. దానితో దాన్ని కొట్టాను. దానికి దెబ్బ ఎక్కడ తగిలిందో నేను పరిశీలించలేదు. దారికి ఆటంకం కల్పిస్తున్నదన్న కోపంతోనే కొట్టాను. నా కోపమే నా శత్రువని నాకు తెలుసు. మహారాజా! కోపమనేది ప్రాణాలు తీసేటంతటి శత్రువు. కోపం మహారాజుకి అలంకారమైన ఖడ్గం వంటిది. ఎంతటి గొప్పవాడు కోపాన్ని జయించలేడు. సిద్ధుడనైన నేను కూడా కోపం జయించలేకపోయాను. కోపంతోనే నేను ఈ శునకాన్ని నిర్దాక్షిణ్యంగా కొట్టాను. పాపం! దీని బుర్ర బ్రద్దలైంది. నీవు మహారాజుగా నాకే శిక్ష

విధించినా భరిస్తాను'' అని పలికి చేతులు కట్టుకు నిలబడ్డాడు.



సర్వార్థసిద్ధునకు విధించవలసిన శిక్షను గురించి సభలోని వారు రకరకాలుగా చర్చించారు. సర్వార్థసిద్ధుడు బ్రాహ్మణుడు కనుక, అతడికి మరణశిక్ష విధించకూడదు అని నిర్ణయించి చెప్పారు. ఏ శిక్ష విధిస్తే బాగుంటుందా! అని ఆలోచిస్తున్న సమయంలో, దెబ్బతిని ధర్మం కోసం వచ్చిన శునకం మహారాజుతో, ''శ్రీరామచంద్రా! నా మీద నున్న అభిమానంతో సర్వార్థసిద్ధుణ్ని సభకు రప్పించావు. మీరంగీకరిస్తే ఈతనికి ఏ శిక్ష విధిస్తే బాగుంటుందో నేను వివరిస్తాను'' అంది. రాముడంగీకరించాడు.

'కుక్క ఏ శిక్ష విధిస్తుందా!' అని ఆలోచనలోపడ్డారు సభ్యులంతా. అప్పుడా శునకం ''మహారాజా! ఇక్కడికి సమీపంలోనే 'కాలంజరం' అనే పట్టణముంది. అక్కడొక మఠం ఉంది. ఆ మఠానికి సర్వార్థసిద్ధుణ్ని అధికారిగా నియమించు'' అని చెప్పింది.

శునకం చెప్పినట్లుగానే శ్రీరాముడు సర్వార్థసిద్ధుణ్ని కాలంజర మఠానికి అధికారిగా వెంటనే నియమించాడు. సభ్యులంతా ఆశ్చర్యపోయారు. తనను బుర్ర బద్దలయ్యేటట్లు కొట్టినా, శునకం తనకెంతో ఉపకారం చేసిందని దాని మంచిమనస్సుకి సర్వార్థసిద్ధుడు మనస్సులో కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు. సర్వార్థసిద్ధుని శ్రీరాముడు ఆజ్ఞానుసారం ఏనుగునెక్కించి ఊరేగిస్తూ, కాలంజర మఠానికి సైనికులు తీసికొనివెళ్ళారు.

సభ్యులంతా శ్రీరాముని, శునకాన్ని పరీక్షగా చూశారు. వారు, ''శ్రీరామచంద్రా! రక్తం వచ్చేటట్లు కొట్టిన కుక్కకు న్యాయం చెయ్యలేదు సరికదా! సర్వార్థసిద్ధుణ్ని ధర్మాధికారిని చేశావు. ఇందులోని గూఢార్థమో, పరమార్థమో మాకు అర్థం కావడం లేదు'' అని తమ సందేహం వెలిబుచ్చారు. దానికి తగిన సమాధానం శునకమే చెబుతుందన్నాడు శ్రీరాముడు.

శ్రీరాముని అనుమతి మేరకు సభ్యులకు శునకం ఈవిధంగా సమాధానం చెప్పింది. ''పూజ్యులారా! నేను గత జన్మలో కాలంజర మఠంలోని దేవుని సేవించే అర్చకుడను. అక్కడనున్న స్వామిని ఎంతో భక్తిశ్రద్ధలతో అర్చించేవాడిని. ప్రతిదినం స్వామివారికి దీపారాధన, అర్చన చేసేవాడిని. దీపం వెలిగించే ముందు వత్తినలిపి, నూనె అంటిన వ్రేళ్ళను గోడలకు రాస్తే గోడ పాడవుతుందనే భయంతో శిరసు మీదనున్న జుట్టుకి రాసుకొనేవాడిని. వ్రేళ్ళకంటిన నూనె దైవద్రవ్యం. ఆ విషయం తెలియని నేను గోడ పాడవుతుందనే భావంతో, వ్రేళ్ళను శిరస్సునకు రాచుకొన్నాను. ఆ పాప ఫలితంగా నాకు ఈ కుక్క జన్మ సంభవించింది. తెలియకుండా చేసిన పాపానికే నాకీ జన్మ కలిగినది కదా! ఈ సిద్ధుడు కోపిష్ఠి. కోపాన్ని జయించలేకపోయాడు. కాలంజరలో ధర్మాధికారిగా ఉంటూ ఎన్నో పాపాలు తెలిసి కూడా చేస్తాడు. ఆ కారణంగా కుక్క కన్నా నీచమైన జన్మలు పొందుతాడు. అందుకే ఆయనను ధర్మాధికారిగా నియమించమని కోరాను'' అని చెప్పి కుక్క సభ విడిచిపెట్టి వెళ్ళిపోయింది.

శ్రీరాముడు ఒక చిరునవ్వు నవ్వాడు. సభ్యులు ఆశ్చర్యంతో ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

కనుక గుడిమణియము సేయకుమని బద్దెన హెచ్చరించాడు. తరువాత నీచబుద్ధి గలవారితో స్నేహం తగదంటాడు. స్నేహం చేస్తేనేకాని, అతడు నీచుడో కాదో తెలియదు. స్నేహం చేసిన తర్వాత అతడు దుర్మార్గుడని తెలుస్తుంది. అపుడు వానిని పూర్తిగా విడిచి పెట్టకూడదు. దానిలోని దుర్మార్గున్ని పోగొట్టే విధంగా ప్రయత్నించాలి.

అడవిలో ఒంటరిగా ప్రయాణం చేస్తే ఏ క్రూరజంతువు వలననైనా ప్రాణానికి అపాయం కలుగవచ్చు. అందుచేత, కొంతమంది జట్టుగా కలిసి ప్రయాణిస్తే, ప్రమాదాన్ని ఒకింత తప్పించుకోవచ్చు. ఈనాటికి అడవిదారుల్లో చెయ్యవలసిన ప్రయాణాలున్నాయి. జరుగుతున్న ప్రమాదాలను గురించి కూడా తెలుసుకొంటున్నాం.

వాటినన్నింటిని ముందుగానే ఊహించిన బద్దెన మనకొక మంచి హెచ్చరిక చేశాడు.

మరొక పద్యం చూద్దాం-

**అల్లుని మంచి తనంబును - గొల్లని సాహిత్యవిద్య కోమలి నిజమున్**
**పొల్లున దంచిన బియ్యము - తెల్లని కాకులును లేదు తెలియుము సుమతీ!**

'ఓ బుద్ధిమంతుడా! మంచితనం చూపించే అల్లుడు, యాదవ కులంలో జన్మించిన సాహితీపరుడు, నిజం మాట్లాడే స్త్రీలు, ఊక దంచితే బియ్యం రావడం, తెల్లని కాకులు లోకంలో లేవు. ఈ విషయం తెలుసుకో' అని పద్యానికి భావం.

ఈ పద్యంలో మొట్టమొదటగా అల్లుడికి మంచితనం లేదంటాడు. ఈ పద్ధతి లోకంలో ఎందుకు వ్యాపించిందో తెలియదు. ఎందరో అత్తమామలు, తమ అల్లుళ్ళతో పడరాని బాధలుపడి ఉన్న కారణంగా ఈ వాక్యానికటువంటి ప్రశస్తి వచ్చింది. ఒకవేళ ఇంటికొచ్చిన అల్లుడు ఎంత మంచివాడైనా, భార్యను నెత్తి మీద పెట్టుకొని చూసుకుంటున్నా అతడికీ ఈ అపవాదు తప్పదు. ప్రక్కనున్నవారు ఏదో విధంగా అతడి మనస్సులో విషం ఎక్కిస్తారు. అది కావాలని, ఇది కావాలని అడగమని నీచబోధ చేస్తారు. ఈ దుష్టసంప్రదాయాన్ని బద్దెన గుర్తించే ఈ విషయం వ్రాసి ఉంటాడు. ఈ విషయాన్నే శ్రీనాథుడు కాశీఖండంలోను, పిల్లలమఱ్ఱిపినవీరన తన శకుంతలా పరిణయంలో కూడా వివరించారు.

బద్దెన కవి కాలం నాటికి, యాదవ వంశీయులు సాహిత్య విద్యలో చెప్పుకోదగినంత స్థాయిని సంపాదించి ఉండకపోవచ్చును. యయాతి కుమారుడు యదువు. ఈయన వంశంలోని వారు యాదవులు.

శ్రీకృష్ణుడు కూడా ఈయన వంశంలోనివాడే. శ్రీకృష్ణుని తరువాత యాదవ వంశంలోని వారు సాహిత్యానికి దూరమై ఉంటారు. ఆ కారణంగా కవి పైవిధంగా వ్రాసి ఉంటాడు. ఉత్తర భారతదేశంలోను, తెలంగాణా జిల్లాలలోను కూడా ఈనాడెందరో విద్యావంతులైన యాదవ ప్రముఖులు ఉన్నారు.

కోమలి అంటే స్త్రీ. స్త్రీ నిజం చెప్పదని వాడుక. అంతేకాక ఆడువారి నోట్లో నువ్వు గింజ నానదని ఒక ప్రతీతి. దీనికి కర్ణుడు, కుంతీదేవికి మొదటి సంతానం. సూర్యవరప్రసాది. కుంతీదేవికి పాండురాజుతో వివాహం జరుగక పూర్వమే కర్ణుని జననం జరిగింది. పాండురాజుతో వివాహం అయినప్పుడు కూడా ఈ నిజాన్ని ఆమె ఆయనకు చెప్పలేదు. కుమారాస్త్ర విద్యాప్రదర్శన సమయంలో కుంతి కర్ణుణ్ని గుర్తించినా ఆ విషయం బయటపెట్టలేదు.

కర్ణుడు చనిపోయిన తరువాత, ''కర్ణుడికి కూడా నివాపాంజలి సమర్పించు నాయనా!'' అని ధర్మరాజుకి చెప్పింది. కర్ణుడు తన అన్నగారేనని తెలిసి, ఆ విషయం తనకు తల్లి అయిన కుంతి చెప్పినందుకు ఎంతో చింతించాడు ధర్మరాజు.

'ఆ సమయంలో' 'స్త్రీల నోట ఏ మాట దాగకొండు గాక!' అని ధర్మరాజు శపించాడు. స్త్రీ కూడా పురుషుని కంటే ఎన్నోరెట్లు తెలివిగలదే. అయినా ఆమెకు సమాజం సృష్టించిన కట్టుబాట్లు వల్ల బయటకు రాలేకపోయింది. స్త్రీ నిజం మాట్లాడదని ఒక నెపం. స్త్రీ మీద మోపుతున్న పురుషపుంగవులు మాత్రం నిజం చెబుతున్నారా? అర్ధరాత్రి దాకా ఇంటికి ఎందుకు రావడం లేదో యదార్థం చెబుతున్నారా?

తెల్లని కాకులు లేవని కవి చెప్పాడు. చాలామంది వర్ణించారు. కాని, ఆ మధ్య తెల్లనికాకి ఉందని టి.వి.లో చూపించారు. కవిగారి కాలం నాటికి ఇన్ని సాంకేతిక విలువలు లేవు కనుక ఆ విధంగా చెప్పారు.

బద్దెనకవి రచించిన సుమతి శతకపు పద్యాలను పెద్దలు తమ బిడ్డలకో, మనుమలకో నేర్పిస్తే మన సాహిత్య సంపద తరతరాలకు అందుతుంది. అందుకే రెండుమూడు పద్యాలు ఉటంకిస్తున్నాను. పిల్లలకు నేర్పిచూడండి!

**తలనుండు విషము ఫణికిని**
**వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్**
**తలతోక యనకనుండును**
**ఖలునకు నిలువెల్ల విషము కదరా! సుమతీ!**

**మాటకు ప్రాణము సత్యము**
**కోటకు ప్రాణంబు సుభట కోటి ధరిత్రన్**
**బోటికి ప్రాణము మానము**
**చీటికి ప్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ!**

**బలవంతుడ నాకేమని**
**పలువురితో నిగ్రహించి బ్రదుకుటమేలా?**
**బలవంతమైన సర్పము**
**చలిచీమల చేతచిక్కి చావదె సుమతీ!**

ఈ విధంగా సుమతీ శతకం వ్రాసిన బద్దెనకవి నీతిసార ముక్తావళి అనే గ్రంథాన్ని కూడా రచించాడు. ఈ గ్రంథంలో కవి మధ్యమధ్య ఎన్నో నీతులు ఉపదేశించాడు. అవి, రాజకీయానికి, సమాజానికి, పరిపాలనకి, ధర్మ ప్రతిష్ఠాపనకు చెందినవి. వాటిని వివరిస్తూ బద్దెన...

**సీ॥ రాజనీతియు అసద్రాజ నీతియును**
**మంత్రి మార్గంబు దుర్గం త్రి విధము**
**అధికార విధియు కార్యవిచారము, ఉపాయ**
**గతియును, రాజ్యరక్షా క్రమంబు**
**ఇల నరాజక వృత్తి హితసేవకస్థితి**
**దుస్సేవక క్రియ దుష్టరాజ**
**సేనా బలము దానశీలతా మహిమ వి**
**వేక సంగతియును లోకనీతి**
**పద్ధతులు చేసి భువినతి ప్రజ్ఞ తెలయు**
**బద్దె నీతియు. . . . .**

అంటూ ఏయే నీతులు తాను తన గ్రంథములో చెప్పదలచుకొన్నాడో వాటినన్నింటిని వివరించాడు. నిజమే! నాణానికి రెండు ప్రక్కల రెండు బొమ్మలున్నట్లు రాజనీతి వెనుకనే అసద్రాజనీతి (కూటనీతి) కూడా ఉంటుంది. రాజైనవాడు రాజనీతితో పాటు కూటరాజనీతి కూడా తెలుసుకొని ఉండాలి. అప్పుడే శత్రువు తన మీద ఎటువంటి ప్రయత్నాలలో ఉన్నాడో తెలుస్తుంది.

''నేను ఇతరులకి అన్యాయం చెయ్యను. అలాగే నాకు కూడా ఇతరులు అన్యాయం చెయ్యరు'' అని భావించకూడదు. అటువంటి ఆలోచనలో రాజు ఉంటే, శత్రురాజు ఆయన మీద ఏదో సమయంలో విరుచుకుపడతాడు. అలాగే అధికారం కలిగి ఉండడం గొప్పకాదు. ఎక్కడ అధికార దుర్వినియోగం జరుగుతుందో కనిపెట్టాలి. అటువంటి పద్ధతిని అరికట్టాలి. అప్పుడే రాజు సమర్థవంతంగా రాజ్యపరిపాలన చెయ్యగలుగుతాడు. అధికారులు దుష్టులని రాజు గుర్తించినపుడు వారిని పదవులలో నుండి తొలగించి సత్పరిపాలనకు మంచి బాటలు వెయ్యాలంటాడు బద్దెనకవి. ప్రతాపరుద్ర మహాచక్రవర్తి సంస్కృతంలో నీతిసారా ముక్తావళి అనే గ్రంథాన్ని రచించాడు. దానిలో-

**కో తి భార స్సదుర్ధానాం - కిం దూరం వ్యవసాయినామ్ ।**
**కో విదేశస్స విద్యానాం - కః పరః ప్రియవాదినామ్ ॥**

దీనికి బద్దెన

**దూరము వ్యవసాయకులకు - భారంబు సమర్థులకును, భాసుర విద్యా**
**పారగులకును విదేశము - వైరము ప్రియవాదులకును, వసుమతిఁగలదే?**

కార్యనిర్వాహకుడికి దూరప్రదేశము లేదు. అతడెక్కడైనను తన పని చేసుకుపోతాడు. సమర్థుడైన వానికి భారమనే ప్రశ్నే లేదు. విద్యావంతుడైన పండితుడికి దూరదేశమే లేదు. విద్వాంసుడెక్కడైనను పూజింపబడతాడు. (విద్వాన్ సర్వత్ర పూజ్యతే). నిజం మాట్లాడేవానికి శత్రువుండడు. ఎవరితోను శత్రుత్వం ఉండదు.

ఇలాగే, వాన అందరికి అవసరమే. మానవుడి ప్రాణం నిలబడాలంటే నీరు ఎంతో అవసరం. అంత అవసరమైనది కదా! అని ముసురుపట్టి విడిచి పెట్టకుండా రోజులు తరబడి వానకురుస్తూ ఉంటే, ఇష్టపడ్డవాళ్ళే కష్టాలపాలై వర్షాన్ని తిట్టుకుంటారు. ఎలాగంటే, ఎవరైనా చుట్టపుచూపుగా బంధువుల యింటికి ఒకటిరెండు సార్లు వెడితే ఇబ్బందిలేదు. పని గట్టుకొని పదేపదే వాళ్ళ యింటికి విడిచిపెట్టకుండా వెడితే ''ఈ శని గాడేమిటిరా బాబూ! మనల్ని విడిచిపెట్టకుండా పట్టుకున్నాడు'' అని తిట్టుకుంటారు. శనిగాడని పేరు పెడతారు. కనుక 'అతి' మంచిది కాదు- అని బద్దెన వివరిస్తాడు. సులభంగా అర్థమయ్యే రీతిలో బద్దెన కవిత్వం ఉండి అందరిచేత ప్రశంసలందుకొన్నది.

*- వారణాసి వేంకటేశ్వర శాస్త్రి*

# గ్రామీణ నీటి సరఫరాపై ప్రభుత్వ సూచనలు

☆ అక్రమ ప్రైవేటు కుళాయి కనెక్షన్లను, గుంటలో ఉన్న కుళాయిలను వెంటనే తొలగించాలి. అలా తొలగించనిచో సంబంధిత గ్రామ పంచాయితీ సర్పంచ్‌పై నిబంధనల ప్రకారం చర్య తీసుకోబడుతుంది.

☆ త్రాగునీటి ఎద్దడి ఏర్పడితే గ్రామంలోని అన్ని ప్రైవేటు కుళాయి కనెక్షన్లను తొలగించి పబ్లిక్ కుళాయిల ద్వారా మంచి నీరు సరఫరా చేయాలి.

☆ అక్రమ కుళాయిలు, గుంటలు ఉన్నటువంటి కుళాయిల వద్ద పైపు లీకేజీలను గుర్తించి వెంటనే తొలగించాలి. తద్వారా మురుగు నీరు మంచినీటి పైపులలోనికి పోకుండా మంచినీటి కాలుష్యాన్ని, అతిసార వ్యాధిని నిరోధించవచ్చు.

☆ గ్రామంలో ఉన్న అన్ని కుళాయిలకు 'క్యాప్‌లు' బిగించి నీరు వృధా కాకుండా చూడాలి. గ్రామస్థులు మంచినీరు పట్టుకునేటప్పుడు వృధా కాకుండా గ్రామ పంచాయితీ సరియైన చర్యలు తీసుకోవాలి.

☆ ఏదైనా గ్రామంలో మంచినీటి కొరత తీవ్రంగా ఉన్నట్లయితే ప్రైవేటు వ్యవసాయ బోరు నుండి మంచినీరు సరఫరా చేయటానికి గ్రామ పంచాయితీ చట్టాన్ననుసరించి రెవెన్యూ అధికారులు తగు ఏర్పాట్లు చేయాలి.

☆ గ్రామ పంచాయితీ మంచినీళ్ళ ట్యాంకును (OHSR/GLSR) నెలకు రెండు పర్యాయాలు శుభ్రం చేయాలి. అంతేగాక సరైన మోతాదులో బ్లీచింగ్ పౌడరును (10,000 లీటర్లకు 23 గ్రాములు) మంచినీళ్ళు ట్యాంకులో కలిపిన తరువాత మాత్రమే గ్రామస్థులకు మంచినీరు సరఫరా చేయాలి. గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ / అసిస్టెంట్ ఇంజనీర్ వారు నీళ్ళలో కలపవలసిన బ్లీచింగ్ పౌడరు మోతాదును గ్రామ పంచాయితీకి తెలియచేస్తారు.

☆ గ్రామ పంచాయితీ పైప్‌లైన్లలో లీకేజీలను కనుగొన్న వెంటనే సంబంధిత గ్రామీణ నీటి సరఫరా విభాగంఅసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ / అసిస్టెంట్ ఇంజనీర్‌కి తెలియచేయాలి. వారు వెంటనే పంచాయితీకి తెలియచేసి లీకేజీలు అరికట్టేలా చూచి బిల్లు చెల్లించటానికి పంచాయితీకి పంపిస్తారు.



☆ పబ్లిక్ కుళాయిలు వాల్వ్ ఛాంబర్లు, ఫ్లాట్ ఫారమ్‌లు వద్ద పరిశుభ్రముగా ఉండేలాగా గ్రామ పంచాయితీలు సరియైన చర్యలు తీసుకోవాలి. చేయవలసిన మరమ్మత్తులకు ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులు అంచనాలు తయారు చేస్తారు. సంబంధిత గ్రామ పంచాయితీ రిపేరు చేయించి బిల్లు చెల్లిస్తారు.

☆ లో-ఓల్టేజి, ఏ ఇతర కారణాల వల్లనైనా మోటారు కాలిపోతే వెంటనే గ్రామ పంచాయితీ వారు ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులకు తెలియపర్చాలి. ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులు అంచనాలు తయారు చేసి మోటారు రిపేరు అయిన వెంటనే బిల్లు తయారుచేసి గ్రామ పంచాయితీకి చెల్లింపు నిమిత్తం పంపిస్తారు.

☆ రక్షిత మంచినీటి సరఫరా పథకం నిర్వహించటానికి, మంచినీటి అమలు బిల్లులు సకాలంలో చెల్లించటానికి సంబంధిత గ్రామ పంచాయితీ సర్పంచ్ / పర్సన్ ఇన్‌చార్జ్, గ్రామ పంచాయితీ కార్యనిర్వహణాధికారి పూర్తి బాధ్యత వహించాలి.

☆ మరమ్మత్తు పనులు చేపట్టటానికి సాంకేతిక సలహాలు ఇవ్వటమే గాక, పంచాయితీ నిధుల నుండి బిల్లు చెల్లించే ఏర్పాటుకు సంబంధిత ఆర్.డబ్ల్యు.ఎస్. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ / అసిస్టెంట్ ఇంజనీరు సహకరించాలి.

☆ వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రజలు వాడేలా చూడాలి. బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలి.

### రక్షిత మంచి నీటినే వాడండి! అతిసార వ్యాధికి దూరం కండి!!

☆ 15 రోజులకోసారి మంచినీళ్ళ ట్యాంకు (ఓ.హెచ్.ఎస్.ఆర్)ను శుభ్రం చెయ్యాలి. శుభ్రం చేయవలసిన తేదీని ఓ.హెచ్.ఎస్.ఆర్. మీద వ్రాయాలి.

☆ ప్రతిరోజూ క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే ప్రజల ఉపయోగార్థం వదలాలి.

☆ ఐ.ఎస్.ఐ. మార్కు గల బ్లీచింగ్ పౌడర్‌ను మాత్రమే వాడాలి.

☆ ప్రతి 10,000 లీటర్లకు 23 గ్రాముల బ్లీచింగ్ పౌడర్ వాడాలి.

☆ మంచి నీటి చెరువులలో చేపలు పెంచకూడదు.

☆ మంచినీటి చెరువుల గట్ల మీద మల మూత్రాదులు విసర్జించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులను కడగటం, స్నానం చేయటం, బట్టలు ఉతకటం నిషిద్ధం.

☆ మంచినీటి చెరువులలోని నీరు ఆకు పచ్చగా మారితే 150 నుండి 200 గ్రాముల మైలతుత్తం ఒక ఎకరానికి కలపాలి.

☆ పైపులైన్లు లీకేజీలను వెంటనే అరికట్టాలి.

☆ గ్రామాలలో గోతులు త్రవ్వి నీరు పట్టుకోటం నిషిద్ధం. అలా చేసిన వారిపై చర్య తీసుకోవాలి.

☆ అక్రమ మోటార్ కనెక్షన్లు గుర్తించి, తొలగించాలి.

☆ అక్రమ కుళాయి కనెక్షన్లు వెంటనే తొలగించాలి.

☆ ప్రతి రోజూ డ్రెయిన్‌లను శుభ్రపరచాలి. వారానికోసారి డ్రెయిన్‌లలోని సిల్టును తొలగించాలి.

☆ లబ్ధిదారులు వారికి నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించేలా పంచాయితీ సిబ్బంది చూడాలి.

☆ బహిరంగ మలవిసర్జన చేసే వారిపై తగు చర్యలు తీసుకోవాలి.

☆ రోడ్డు మార్జిన్‌లు రోడ్డు ఎత్తుకన్నా తక్కువ గానూ, వాలుగానూ ఉండేలా సంబంధిత లైను సిబ్బంది చూడాలి. లేకపోతే రోడ్లపై మురికిగుంటలు ఏర్పడి, దోమలకు పుట్టినిల్లుగా తయారవుతాయి.

☆ ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలోనూ, క్వారీ ప్రాంతాలలోనూ గుంటలలోని నీరు ఉపయోగించరాదని ప్రతిరోజూ పంచాయితీ సిబ్బంది శాం, శాం ద్వారా తెలియచేయాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగమని ప్రచారం చేయాలి.



☆ ఇసుక మీద ఏర్పడిన తెట్టును ప్రతి 10 లేక 15 రోజులకొకసారి నలుగురు మనుషులచేత అంగుళం మందం మేర తొలగించి, శుభ్రంగా కడిగించాలి.

☆ కడిగిన ఇసుకను తిరిగి జాగ్రత్తగా చెక్క మీద నిలబడి ఫిల్టర్‌లో పోయాలి.

☆ ఎట్టి పరిస్థితులలో ఫిల్టర్‌లలో ఇసుక మందం తగ్గకూడదు.

## ఫిల్టర్ల నిర్వహణలో ప్రజలు పాటించవలసిన జాగ్రత్తలు

☆ శుభ్రమైన కాచివడపోసిన లేదా క్లోరినేట్ చేయబడిన నీటిని మాత్రమే త్రాగాలి.

☆ పైపులైన్లు, వాల్వులు వద్ద లీకేజీ ఉంటే పంచాయితీ వారికి తెలియపరచాలి.

☆ చెరువు గట్ల మీద, రోడ్ల పక్కన మల మూత్రాలు విసర్జించకూడదు.

☆ బావులు, గొట్టపు బావులు, పబ్లిక్ కుళాయిల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. వాటివద్ద వృధా నీరు పోవడానికి ఫ్లాట్‌ఫారాలు కట్టాలి.

☆ వాంతులు, విరేచనాలు అయిన వారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్ళాలి. తదుపరి గ్రామీణ నీటి సరఫరా విభాగం వారికి తెలియపర్చాలి.

☆ అంటు వ్యాధులు ప్రబలినపుడు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలి.

☆ నిల్వ ఉండిన మాంసాహారాన్ని భుజించకూడదు.

☆ వంటచేసే ముందు, తినే ముందు చేతులు సబ్బుతో కడుక్కోవాలి.

☆ తినే పదార్థాల మీద ఈగలు ముసరకుండా చూసుకోవాలి.

## క్లోరినేషన్‌లో పాటించవలసిన జాగ్రత్తలు

☆ మనకు చెరువులోనికి వచ్చేనీరు చాలా అపరిశుభ్రం.

☆ దానిలో మల మూత్రములు, చెత్తా చెదారం వస్తాయి.

☆ అదే నీటిని త్రాగటానికి వాడితే ప్రజలకు కలరా, టైఫాయిడ్ వంటి జబ్బులు వస్తాయి.

☆ ముందు చెరువు నాలుగు మూలలా బ్లీచింగు పౌడరు మూటలను ఏరోజుకారోజు కట్టి వ్రేలాడతీయాలి.

☆ దీనివలన రోగాల్ని కలుగచేసే క్రిములను కొంతవరకు నిరోధించవచ్చును. ఇంతటితో సరిపోదు.

☆ మీ మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులో కూడా బ్లీచింగ్ పౌడరును కలపాలి.

## ఎంత కలపాలి?

☆ ప్రతి 10,000 లీటర్ల సామర్థ్యానికి 50 గ్రాముల బ్లీచింగు పౌడరు కలపాలి. అంటే లక్ష లీటర్ల సామర్థ్యానికి 500 గ్రాముల బ్లీచింగు పౌడరు తీసుకొని దానిని నీటిలో కలిపి ద్రావణం తయారు చేసి, ఆ ద్రావణాన్ని ఓ.హెచ్.ఎస్.ఆర్.లో పొయ్యాలి.

☆ వేశాక 30 నిమిషాలు ఆగాలి. అప్పుడు క్రిములు చచ్చిపోతాయి. కాని బ్లీచింగు పౌడరు నాణ్యమైన ఐ.ఎస్.ఐ. మార్కు గల కంపెనీదే కొనాలి.

☆ ఎక్కువ కాలం నిలువ ఉన్న బ్లీచింగు పౌడరులో శక్తి ఉండదు.

☆ 15 రోజులకు కావలసిన బ్లీచింగు పౌడరునే నిలువ ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు మూటకట్టి దాచాలి.

☆ మీ దగ్గర క్లోరోస్కోపు ఉంచుకోవాలి.

☆ బ్లీచింగు చేసినటువంటి నీటిలో 2 పి.పి.యస్. వరకు క్లోరిన్ శాతం ఉండాలి. దీనిని క్లోరోస్కోప్‌తో చూసుకోవాలి.

☆ ఊరి చివర కుళాయిలో కూడా 0.2 పి.పి.యమ్. రెసిడ్యూయల్ క్లోరిన్ ఉండాలి. ఇది మీ క్లోరోస్కోపులో తెలుస్తుంది.

☆ క్లోరినేషన్ చెయ్యని నీరు త్రాగిన ప్రజలకు చాలా ప్రమాదం.

☆ మీ గ్రామ ప్రజలకు ఈ ప్రమాదం రానీయకండి.

***ఇంతే కాదు . . .***

☆ మీ ఓ.హెచ్.ఎస్.ఆర్.ను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలి.

☆ వాల్వు పిట్లలోను, పైపు లైనులోను లీకేజీలు లేకుండా చూసుకోవాలి.

☆ గ్రామాలలో గోతులు త్రవ్వి నీరు పట్టుకొనుట నిషిద్ధం. అట్లు చేసినచో పైపులలోని నీరు కలుషితం అవుతుంది.

☆ చెరువు గట్టుపై ప్రజలు, జంతువులు మల మూత్రములు విసర్జించకుండా చూడాలి.

☆ మంచినీటి చెరువులో దిగటం, స్నానం చేయటం, బట్టలు ఉతకటం నిషేధం.

☆ మీ మంచినీటి సరఫరా పథక పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.

*(ప్రభుత్వ మెమో నెం. 11070/పి.టి.యస్.-3/ఎ-1/2000-01 తేది : 12-4-2001 ఆఫ్ పి. ఆర్. ఆర్.డి. డిపార్ట్‌మెంట్)*

☆

ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు ఆంధ్ర ప్రాంతంలో 38 గ్రామ లెక్కలు ఉండేవి. 15-12-1979 న (ఎన్) శాఖ జి.ఓ.యం.యస్.నెం. 1474 ప్రకారం ఆంధ్రా ప్రాంతంలో గ్రామ లెక్కలను 38 నుండి 23కు తగ్గించడమైనది.

అదే విధంగా తెలంగాణ ప్రాంతంలో 39 గ్రామ లెక్కలు ఉండేవి. 1-7-1976 రెవిన్యూ (ఎన్) శాఖ జి.ఓ. ఎం.ఎస్. నెం. 599 ప్రకారం తెలంగాణ ప్రాంతంలో గ్రామ లెక్కలను 39 నుండి 22కు తగ్గించడమైనది.

27-4-1983న రెవెన్యూ (ఎన్) శాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం. 734, 6-8-83 న రెవిన్యూ (ఎన్) శాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం. 1070 ప్రకారం, తెలంగాణ ప్రాంతంలోని గ్రామ లెక్క నెం.3 (పహాణి), ఆంధ్రా ప్రాంతంలోని గ్రామ లెక్క నెం.2 (అడంగల్)లను ఏకీకృతం చేయడమైంది. 1985-86 అంచనా సంఘం తమ మూడవ నివేదికలో, గ్రామాధికారుల వ్యవస్థను రద్దుచేసిన దృష్ట్యా, రాష్ట్రమంతటకీ ఉమ్మడి గ్రామ లెక్కల రికార్డు విధానం వుండాలని అభిప్రాయపడి, ఉమ్మడి గ్రామ రికార్డుల ను రూపొందించడానికి గాను నిపుణుల సంఘాన్ని నియమించాలని సిఫారసు చేసింది. ఆ ప్రకారంగా, 8-2-1989 తేదీ రెవిన్యూ (ఎన్) శాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం. 115లో భూమి శిస్తు కమీషనరు అధ్యక్షతన నిపుణుల సంఘాన్ని నియమించడం జరిగింది.

లేదా 4 ఎకరాల తరి భూమి విస్తీర్ణం కొలతలు చూపటం జరుగుతుంది.

రెండు సర్వే నెంబర్లకు మధ్యన గల విభజన రేఖ (సరిహద్దు) భూమిపై తెలియాలన్నా లేదా ఒక సర్వే నెంబరులోని విభాగాల (సబ్ డివిజన్స్) మధ్య సరిహద్దులు తెలియాలన్నా ఆ సర్వే నెంబరు స్కెచ్ (పటం) కావాలి. గ్రామంలోని అన్ని సర్వే నెంబర్లకు ఒక్కొక్క దానికి విడిగా పటాలు వుంటాయి. వీటన్నింటిని వరుస క్రమంలో పెట్టి తయారు చేసినదే పొలం కొలతల పుస్తకం. దీనినే ఆంధ్రా ప్రాంతంలో ఎఫ్.యం.బి. అని, తెలంగాణా ప్రాంతంలో 'టిప్పను' అని సంక్షిప్తంగా పిలుస్తారు.

స్కెచ్‌ను ఉపయోగించి, సరిహద్దులను గుర్తించడానికి సర్వే పరిజ్ఞానం కావాలి. ఆంధ్రప్రాంతంలో గ్రామ రెవెన్యూ అధికారి వద్ద, తహశీల్దారు వారి కార్యాలయంలో ఒక్కొక్క సెట్టు ఉంటుంది. కాని తెలంగాణా ప్రాంతంలో సర్వే అసిస్టెంటు డైరెక్టరు కార్యాలయంలో మాత్రమే ఒక సెట్టు ఉంటుంది. ఒక సర్వే నెంబరులో మార్పులు చేసినప్పుడు, మండల సర్వేయరు, ఆ యఫ్.యం.బి.లో మార్పులు చేసి రెవెన్యూ డివిజన్ ఆఫీసులో వుండే డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే గారి పరిశీలనకు పంపిస్తారు. అతడు సర్వేయర్ తయారు చేసిన స్కెచ్ సరిగా వున్నదీ, లేనిదీ చూచి ఆమోదిస్తారు. లేదా సరి చేయడానికి త్రిప్పి పంపుతారు.

# గ్రామ రెవెన్యూ లెక్కలు - వాటి పరిణామం

నిపుణుల సంఘం, ఆంధ్రపాంతంలోనూ, తెలంగాణ ప్రాంతంలోనూ నిర్వహిస్తున్న గ్రామ లెక్కలను పరిశీలించిన తరువాత, మారిన పరిస్థితులకు అనుగుణంగా లేని లెక్కలను తొలగించి, ఏకీకృత లెక్కలను సిఫారసు చేసింది. నిపుణుల సంఘం సిఫారసుననుసరించి 10-3-1992 న 1402 ఫసలీ ప్రారంభం నుండి అమలులోనికి వచ్చాయి.

### గ్రామ పటం

గ్రామంలోని భూములను మొత్తం (గుడి కట్టు) గ్రామ రేఖా చిత్రాన్ని చూపించేదే గ్రామ పటం. గ్రామ పటంలో గ్రామ సరిహద్దులు, వాటి మధ్య సర్వే నెంబర్ల పొందిక చూపిస్తుంది. భూములు, వీటితో పాటు, గ్రామ కంఠాలు, రోడ్లు, కాలువలు, చెరువులు, శ్మశానాలు వంటి పోరం బోకు భూములను కూడా గ్రామ పటం చూపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామ భౌతిక రూపం, గ్రామ పటంలో కనిపిస్తుంది. కనుక ఒక సర్వే నెంబరుకు చెందిన భూమి గ్రామంలో ఎక్కడ ఉందో గుర్తించడానికి గ్రామ పటం చాలా అవసరం. ఇది సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి వద్ద, మండల సర్వేయరు వద్ద, తహశీల్దారు కార్యాలయంలో, అసిస్టెంటు డైరెక్టరు ఆఫ్ సర్వే కార్యాలయంలో కూడాఉంటాయి.

### పొలం కొలతల పుస్తకం (యఫ్.యమ్.బి) - ఫీల్డు మెజర్‌మెంట్ బుక్

గ్రామ పటం సర్వే నెంబర్ల సమాహారం. ప్రతి సర్వే నంబరుకు ఒక పటం (స్కెచ్) ఉంటుంది. అందులో సర్వే నెంబరు నిర్దిష్ట కొలతల ను సూచిస్తుంది. ఆంధ్రప్రాంతంలో ఒక్కొక్క సర్వే నెంబరులో య. 10 మెట్టభూమి లేదా య.5లు పల్లం (తరి) ఉండగా, తెలంగాణా ప్రాంతంలో ఒక్కొక్క సర్వే నెంబరులో య. 30 లు మెట్ట, య. 2,3

### రీ సెటిల్‌మెంట్ రిజిష్టరు

ఆంధ్రప్రాంతంలో దీనిని రీ సెటిల్‌మెంట్ రిజిష్టరు లేక, డైగాట్లు అని, అదే విధంగా తెలంగాణా ప్రాంతంలో శేత్ వార్ అని అంటారు. ఈ రిజిష్టరులు బ్రిటీష్ కాలంలో తయారుచేయబడి ముద్రించబడిన రిజిష్టరు, సర్వే సెటిల్‌మెంట్ కార్యకలాపాలు ఒక్కొక్క గ్రామానికి పూర్తిచేసి గతంలో దీనిని తయారు చేశారు. మిగతా అన్ని గ్రామ లెక్కలకు మూలస్తంభం వంటిది. ఈ రిజిష్టరులో ఒక రెవెన్యూ గ్రామానికి సంబంధించిన అన్ని రకాల భూముల సర్వే నెంబర్లు, వాటి వివరాలు, వాటి విస్తీర్ణాలు, అవి సర్కారు భూములా లేక ఇనాం భూములా, అందులో మాగాణి, మెట్ట లేక పోరంబోకులు, ఆయా భూములలోని మట్టి తరగతి, రకము, తరము ఎకరం ఒక్కింటికి రేటు, అప్పటి రేట్ల ప్రకారం శిస్తు వివరాలు వుంటాయి.

మాగాణి భూములకు ఏ జలాధారం వలన పారుదల ఏర్పడినది, ఆ జలాధారం తరగతి సామర్థ్యం తెలియజేస్తాయి. ఈ రిజిష్టరు గ్రామం గుడికట్టు మొత్తం సర్వేనెంబరు వారీగా తెలియజేస్తుంది. ఈ రిజిష్టరులో ఆయా సర్వే నెంబర్లలో ఏర్పడు మార్పులన్నింటిని ఎప్పటికప్పుడు ప్రత్యేక రిజిష్టరులో నమోదు చేసి ఈ రిజిష్టరుకు అనుబంధంగా నిర్వహించాలి.

ఈ రిజిష్టరు ఏదేని సర్వేనంబర్లకు ఏవైనా మార్పులు సంభవించి నప్పుడు సమీకృత గ్రామ లెక్క 2వ నంబరులో ముందుగా నమోదు చేసి తదుపరి శాశ్వత రిజిష్టరులోని 14వ కాలంలో ఆ మార్పును నమోదు చేయవలసి ఉన్నది. అనగా సర్వే నంబరులో సబ్ డివిజన్ వలన మార్పులు, వర్గీకరణ మినహా మరి ఏ మార్పులు చేయరాదు.

*- బి. వెంకటేశ్వర రావు,*
*కన్‌సల్‌టెంట్, ల్యాండ్ సెల్, అపార్డ్*

# ఫీచర్ వ్యాస వ్యాసులు అను కాలమిస్టులు

***అణువులో అనంత విశ్వాన్ని దర్శించగలవారు మాత్రమే ఫీచర్ వ్రాసి నెగ్గగలరు. అల్ప విషయంపై అనల్పంగా చర్చించగల చతురత వుండాలి. తెలుగుదేశంలో అలాంటివారు ఎందరో వున్నారు. వారిలో కొందరి ఫీచర్ రచనలను అనుకరిస్తున్నాను యీ పేరడీలో -***

*ప్రముఖులంతా వారి జీవితాల్లో ప్రేమలేఖలు రాశారో లేదో నాకు తెలియదు. వారి మీద నాకున్న యెనలేని అభిమానం కొద్దీ వొకవేళ వారు రాసి వుంటే యెలా వుండేవి అని వూహించి ఈ పేరడీ రాయటం జరిగింది.*

## హలో! ఓ ప్రేముందా ?

**అప్పారావు సర్వాంతర్యామి. గొప్ప వేదాంతి. వొడుపుగల రుణవేత్త కూడా. సమస్త విషయాలను అప్పు మీదకు మళ్ళించి మానవుల దగ్గర మాత్రమేగాక పశుపక్ష్యాదుల వద్ద సైతము అప్పు పిండగల వుద్దండ పిండము. అప్పారావుని ముందస్తుగా మనం యిప్పుడు వదిలించుకోపోతే. "హలో! ఓ పై వుందా"? అని మన మీద విరుచుకుపడే ప్రమాదం వుంది.**


[redacted]

*అ- ఋణగారికి,*

*ఋణాభినందనలతో.*

మిమ్మల్ని చూడగానే అయిదు రూపాయల నోటు మీద జింక బొమ్మ ప్రాణం పోసుకుని అలా గెంతుకుంటూ వచ్చినట్టు అయింది. మీ చూపులు విచ్చు రూపాయలు. మీ ముక్కు బ్లాంకు చెక్కు. మీ మొహం మూడు సింహాల మొహార్. మొత్తంగా మిమ్మల్ని చూసినప్పుడు వెగటు పుట్టేంత అప్పు దొరికినట్టు అయింది.

చూడగా చూడగా యీ ప్రపంచమే ఒక పెద్ద ఋణవలయంగా తోస్తుంది. ఇచ్చి పుచ్చుకొనేవి యీ వలయంలో రెండే రెండు. మొదటది అప్పు, రెండోది ప్రేమ. యీ అప్పారావు ఎన్నడూ మొదటిదాన్ని తప్ప మరి దేన్నీ ఎవడ్నీ బదులుగానైనా అడిగెరగడు. ప్రేమ కూడా అప్పు లాంటిదే! నిలవున్న కొద్దీ పెరిగి పేట్రేగిపోతుంది మరి. లేఖ రావడం ప్రేమకు సంబంధించినదైతే, లేక రావడం అప్పు సంబంధికం. ప్రేమలో అప్పులోలేని సౌలభ్యం వొహటుంది. అప్పు లేదనవచ్చు. కనుక మీరు లేదనడానికి ఇది అప్పు కాదు. నా ప్రేమను కాదనేసి అప్పు ప్రాప్తమనోహరిగా మిగిలిపోవడం అరుణా! మీకు భావ్యం కాదు.




గంగాభాగీరధి మీ బామ్మగారిని ఒప్పించే బరువు బాధ్యతలు నేనే తీసుకుంటాను. మీరు సరే అంటే అరువు ముందుకు వేస్తాను. మన పెళ్లి సందర్భంగా పదిమందికీ ఋణగ్రస్తుణ్ణి అయే అవకాశం యిప్పించండి. ప్రస్తుతం కవరుకు స్టాంపులు అంటించలేదు. అది చెల్లించి స్వీకరించి నా లేఖను విముక్తం చేసుకోండి.

*(అప్పారావు లేఖని ఇంతటితో ఆపకపోతే యిది అప్పువైపు దారి తీసే ప్రమాదం వుంది)*

☆

## ది గ్రేట్ లౌ లెటర్

**గురజాడ వారు సృష్టించిన 'గిరీశం' ముళ్లపూడి వారి చేతిలో పునర్ యవ్వనాన్ని సంతరించుకున్నాడు. లెక్చర్లకు అలవాటు పడిన గిరీశం ప్రేమలేఖ ఇలా సాగుతుంది.**

[redacted]ంస్ బుచ్చెమ్మ,

[redacted]టర్ రాయమంటే - ఓ యిటీజ్ [redacted]ఔట్‌డేటెడ్. లౌ అండ్ ఇట్స్ నేచర్ [redacted] మీద ఓ ఘంట లెక్చరిచ్చేద్దును [redacted] గాని మన టెలుగూన్‌కి కొన్ని [redacted]ఫార్మాలిటీస్ అఘోరించాయి కదా! [redacted]పోతే వదినా! మీకిక్కడ వో విషయం [redacted]ెప్పాలి. ఎప్పుడూ యీ గిరీశం [redacted]క కళ్యాణం కోసం అంటే వరల్డ్ మారేజ్ కోసమే కంకణం కట్టుకున్నాడుగాని సొంతానికి వో సారయినా కట్టుకున్నాడు కాదు మీరు డేరింగ్ - డార్లింగ్ అంటే యిహ పెళ్లి విషయమంటారా దొరల ఫాయలాలో లాగించేద్దాం. అయితే ప్రేమను గురించి మీకిక్కడ నాలుగు ముక్కలు చెప్పకపోతే సందర్భం వదలి చెపాయించినట్టు అయిపోతుంది. మీరు కొసాకి చదివాక నచ్చకపోతే గుగ్గిలం వేసుకోండి. గిరీశం అక్షరం నిప్పుల్లో వేసినా ఘుమ ఘుమలాడుతుంది. చర్చిల్ మహాశయుడు చచ్చి ఏ లోకాన వున్నాడో. 'నీ లెటర్స్ వుంటే లంక పువాకు బలాదూరోయ్' అనేవాడు. అసలీ ప్రేమలేఖలు డిక్టేషనుకి వొదగవుగాని లేకపోతే పూటకొహటి దంచెయ్యకపోయినా'. టెంథౌంజెండ్ బ్రెయిన్సు, ఇరవై వేల చెవులూ వున్న సభల్లో లెక్చర్లివ్వడానికి నోరు తిరిగిన వాడికి అఫ్ఫాల్డ్ వొక్కరు చదువుకునే వుత్తరం ముక్క రాయాలంటే డామిట్... చెడ్డ చిరెత్తుకొస్తుంది. సీమ దొరలకి సంతాప

సందేశాలు రాసి పెడితే ఆ భాషా అదీ చూసి బట్టీయం పెట్టేవారు. బతికుండగానే అబిట్యురీలు రాయించుకుని చిత్రాలు కట్టించుకున్న దొరలు యింకా బతికే వున్నారు. కావాలంటే సాక్షికం యిప్పించే గల్ను. నా ప్రేమ వ్యవహారం, కచేరీ వ్యవహారంతో జతచేసి మీ నాన్నతో మాట్లాడగలను. ఆయన మనసు మీ మనసులాగా మెత్తన కాదు చూశారా. తొందరగా నాటుతుందని అనుకోను. బ్రదరిల్లా వెంకటేశం మన ప్రేమకు అంబరిల్లా లాంటివాడు. సిగార్స్‌కే కాపర్స్ కొరత వుండగా తపాల ఖర్చులకు ప్రతిసారి తస్యా వెయ్యాల్సి వస్తోంది.

*(ఏమిటి నా లెటర్సన్నీ కచేరీ నుంచి వచ్చాయని మీ నాన్నకు యిచ్చావా? డామిట్ ప్రేమ అడ్డం తిరిగింది.)*

☆

# రేషా గోపాలం

**ముళ్ళపూడివారి మరో విలక్షణమైన సృష్టి గోపాలం. మధ్య తరగతి ఐడియాలూ, ఆశలూ అతనిలో వుంటాయి. గోపాలాన్ని పెళ్లి కాకముందే మనకు పరిచయం చేసి, తండ్రి అయ్యేదాకా చూపిస్తారు రచయిత.**

*రాధా!*

నిజంగానే నీకు వినిపించేంత దగ్గరగా వచ్చి 'ఏయ్! పిల్లా' అనేసి అప్పటి చూపుల్లో కలికితనాన్ని, కసురుకొనే గాజుల చప్పుళ్ళనీ జాగ్రత్తగా జేబులో వేసుకుని చక్కా వచ్చేద్దామనిపిస్తుంది. జేబు ఎప్పుడూ గుండె మీదే వుంటుంది. కనుక జేబులో భావాలు అలాగ్గా గుండెల్లోకి చేరిపోతాయి.

చామనచాయ నీకు ఎంతగా నప్పిందో నాకు తెలుసు. సృష్టించిన భగవంతుడికి తెలుసు. చామంతులు, మరువపు రెమ్మలు కలిపికట్టిన చెండు అచ్చం మీ చాయలోనే వుంటుంది. నాకింకా బోలెడు రాయాలని వుంది. అంటే - ''నువ్వు దూరంగా మలుపు తిరిగిన గోదారిలా వినిపించీ వినిపించని పిల్లంగ్రోవిలా, చిగురించిన మావి కొమ్మలా, కన్పించని పిల్ల గాలికి కదలాడే జాజి రెమ్మలా వుంటావనీ- నువ్వు నవ్వినప్పుడు కన్నుల్లోంచి జారిన చక్కదనం చెక్కిలిమీద నొక్కుల్లో చిక్కుకుంటోందనీ, జడ ప్రత్యూషచ్ఛాయలో సాగిలపడి నీ నీడ నీ మీదే పడ్డట్టు వుందనీ -నీ ముఖం అందానికి నిర్వచనంలా వుంది స్మీ- కోవెలలో నీ వదనం చూడగానే హారతి, పువ్వులూ గుమ్మంలోనే ఎదురైనట్టు తోచిందనీ''. యిలా యింకెన్నో రాయాలనివుంది. కాని నువ్వు నన్ను పొగడుబోతు అనుకుంటావని ఆ ప్రయత్నం వాయిదా వేశాను.

నువ్వు కవిత్వంగా అనుకునోతే - మొన్నటికి [redacted] మిరప్పండు రంగు చీరె కట్టుకొని నువ్వు వలో కొసంటా జరిగి కూర్చుంటే బామ్మ పాలాల పండక్కి అరటి దొన్నెలో వదలిన దివ్వెలాగున్నావు. బామ్మంటే జ్ఞాపకం వచ్చింది. మా బామ్మ ''ముక్కూ మొహం తెలిసిన పిల్లని చేసుకుంటే దని'' మళ్ళీ మళ్ళీ చెబుతోందిజ మరి ముక్కూ ం తెలిసిన పిల్లలు మీరు తప్ప ఇంఖె ు. కదండీ....

*(ఇందాక రాశాక గోపాలం తెగ సిగ్గు పడిపోయాడు)*

☆

# బుడుగు రాతలు

**బుడుగు ఒక గడుగ్గాయి. ప్రపంచంలో ఈ సైజు పిల్లలకు ప్రతినిధి. పిల్లల్లో పెద్దగా, పెద్దల్లో పిల్లగా వుంటాడు. జట్కా తోలాలని, వింజను నడపాలని, కుతూహలం. బుడుగుకి కూడా చిన్ని ప్రేమించే హృదయం వుంది.**

*సీ గాన పెసూనాంబలుగారికు,*

ఇది లౌ లెటరు రాస్తున్నాననమాట. బాబాయి ఇచ్చిరా అంటే రెండు జెళ్ళ సీతకి ఇచ్చానే అలాంటిదన్నమాట. బాబాయికి కూడా కుంచెం రాయటం వచ్చునుకో. నేను వచ్చినంత కాదనుకో, అయినా నేనేం చిన్న వాడినా! లేకపోతే చితకవాడినా! నీ కసలేం రాదుకదా! నీకు బాహా రావటం కోసం కుంచెం కుంచెం రాస్తాను. లేపోతే బోలెడు ఇంకా చాలా రాసేయగలను. లౌ లెటరు అంటే ప్రేమించుకోవడంట. బాబాయి చెప్పాడు. నాకు తెలియదు అనుకో.

[redacted]

బామ్మ రామకోటి రాస్తుంది ఏమీ తోచక, బాబాయి లౌ లెటరులు రాస్తాడు. బాబాయికి పని దొరకలేదుట కదా. ఇలా అని నాన్న అన్నాడు అయినా పని దొరుకుతుందేమిటి? గోళీలు అయితే దొరుకుతాయి గాని.

బామ్మ బొత్తిగా మతి మరుపుమనిషి. అట్లా అని బామ్మే అంటుంది. అంటే మనం ఓకులు బొత్తిగా పెడతామె అట్టా అన్నమాట. మర్చిపోకుండా రాసిన మాటే సాయంఖాలందాకా రాసుకుంటుంది. అందుకని రామకోటి అంటారు దాన్ని.

అంమ ఏమీ రాయదు. అంమకి పాపం గుడింతాలు కూడా రావు. అందుకని రోజూ నాన్న తలకి బొబ్బర్నూనె రాస్తుంది. నేను వద్దన్నా ''ఊహు'' వినదు. ప్రైవేటు చెప్పి అయినా రాస్తుంది. పాపం చదువు రాదుకాదా అందుకని నేను వూరుకుంటాను.


ప్రేమ గుడ్డిదని బాబాయి చెప్పాడు. బామ్మ కళ్ళజోడు నేను పెట్టుకునేప్పుడు తీసికెళ్ళి పోతానే అప్పుడు బామ్మ గుడ్డిది అయిపోతుంది కదా అట్టాంటి దన్నమాట. మనం ప్రేమించుకొనకపోతే నారాయణ కొట్టు దారి కూడా గుడ్డి అవుతుంది. బాబాయి కాయితాల మీద రాస్తాడునుకో! నేను పలకమీద గుండ్రంగా రాయలిట. ప్రేమించుకునే వుత్తరాలు తీసుకోరుట. ప్రేమంటే అచ్చంగా యిచ్చెయడంట ఒఠొరిగా నిఝింగా అన్నమాట...

ఇహ ప్రైవేటు మాస్టరు వచ్చినా పలక ఉండదన్న మాట. నువ్వు ఆవకతవకగా రాసి నా పలక ఇచ్చేకూడదు. సిన్మాలోలాగా త్యాగం యిచ్చేయడం అన్నమాట.

*(పలక రెండువైపులా నిండిపోయిందోచ్!)*

☆

# మహాత్మా గాంధీజీ ఆలోచనల్లో గ్రామీణాభివృద్ధి ప్రణాళికలు



**జా**తి నిర్మాణంలోనూ, అభివృద్ధి ప్రణాళికా రచనలలోనూ, పాలనా వికేంద్రీకరణ అన్నది ఇటీవలి కాలంలో ప్రాముఖ్యతను సంతరించు కుంటున్నది. ఇది సామర్థ్యాల పెంపుకు, సత్వర సేవల జారీకీ దోహదపడుతుందనటంలో సందేహం లేదు. అందుకే భారత దేశంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ ఆవిర్భావానికి 50 ఏళ్ళయిన సందర్భాన్ని పురస్కరించుకుని దేశం ఉత్సవాలు జరుపుకుంటున్నది.

2009 అక్టోబరు 2 నుండి 2010 అక్టోబరు 2 వరకూ మధ్యగల సంవత్సర కాలాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామసభల సంవత్సరంగా ప్రకటించి "గ్రామ గ్రామాన గ్రామ సభలు జరిపి పరిపాలనలో ప్రజల భాగస్వామ్యానికి స్థానం కల్పించి, పారదర్శకతను పెంచి, వనరుల పెంపు వినియోగం ద్వారా అభివృద్ధి ప్రణాళికలకు గ్రామ స్థాయిలో రూపకల్పన చేసే దిశగా చర్యలు చేపట్టటం జరిగింది. గాంధీజీ 141వ జయంతి (అక్టోబర్ 2) సందర్భంగా వికేంద్రీకరణ, ప్రణాళికలు. గ్రామాభివృద్ధి, సుసంపన్నవంతమైన దేశ, కోసం ఆయన ఆలోచనల్ని మరొకసారి అవలోకనం చేసే ప్రయత్నమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

**"వికేంద్రీకరణ"** - భారతదేశం పట్టణాలలో గాక 7 లక్షల గ్రామాలలో ఉందని గాంధీజీ పదే పదే నొక్కి చెప్పారు. నిలకడగా ఉన్న ప్రపంచ వ్యవస్థను నిర్మించాలంటే ఈ విశాల ప్రజానీకానికి అన్ని రకాలుగా అవకాశాలు కల్పించాలని గాంధీజీ చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే అట్టడుగు నుండి పాలనా వ్యవస్థను నిర్మించుకుంటో రావటమే ఉత్తమమైన, శాశ్వతమైన, సమర్థవంతమైన మార్గము. "ప్రతి గ్రామము స్వయం సమృద్ధి గల ఒక రిపబ్లిక్ కావాలి. కాబట్టి ప్రతిగ్రామమూ తనని తను పోషించుకోగలిగి, తన వ్యవహారాలను నడుపుకోగలగాలి. నిరుద్యోగులు లేని, నిరక్షరాస్యులు లేని ప్రజలు, పౌష్టికాహారం కలిగిన పౌరులు, గాలీ వెలుతురూ వచ్చే ఇండ్లూ ఉండాలి. అందుకు తగ్గ ప్రణాళికలు రచించుకోవాల్సి ఉందనీ "గాంధీజీ చెప్పారు.

### వికేంద్రీకరణ - అభివృద్ధి

1950 ప్రారంభంలో అభివృద్ధి ప్రణాళికల నమూనాల కోసం కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు తదితర అంతర్జాతీయ సంస్థల సహకారం తీసుకుంది. అయితే 1960 ప్రాంతానికల్ల ఆ నమూనాలు ఆశించిన స్థాయిలో ప్రగతిని సాధించలేదని గుర్తించారు.

అభివృద్ధి సాధించాలంటే కేంద్రం నుండి సామాజిక, ఆర్థిక, రాజకీయ నిర్మాణాలలో ప్రాథమిక మార్పులు తీసుకురావటం ద్వారా పేద ప్రజలు తమ ఆర్థిక ప్రగతిని తమకు తామే పెంచుకునే విధంగా ప్రణాళికలు రావాలని ప్రణాళికా రచయితలు విధాన నిర్ణేతలు గుర్తించారు. అందుకు గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పిన గాంధీజీ ఆలోచనలను పరిగణనలోకి తీసుకున్నారు.

వికేంద్రీకరణ వల్ల స్థానిక స్థాయిలో సరళమైన నవకల్పనలతో కూడిన కొంగ్రొత్త ఆలోచనలను, ప్రణాళికలను దారి తీయటమే కాక, ప్రజలకు తమ తమ ప్రాంతాల సమస్యలు, వనరుల ప్రాతిపదిక అభివృద్ధి ప్రణాళికలు రచించుకునేందుకు వేదిక ఏర్పడుతుంది. వివిధ రాజకీయ వర్గాలు, యువజనలు, మహిళలు, ఇతర నిర్లక్ష్యం చేయబడ్డ వర్గాలు విధాన నిర్ణయాలలో పాలు పంచుకోవటంతో పాటు, నిరంతరం ప్రణాళికల అమలును పర్యవేక్షించగలగటం, అవసరమైన చోట్ల మార్పులు, చేర్పులు చేసుకోగలిగి, పూర్తి స్థాయిలో మూల్యాంకనం చేయటానికి వీలుకలుగుతుంది.

లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్లు ప్రజల చేత ప్రత్యక్షంగా నియంత్రణ చేయదగిన పాలనా వికేంద్రీకృత నిర్మాణం ద్వారానే గాంధీజీ కలలుగన్న ప్రజాస్వామ్యం, స్వరాజ్యం ఏర్పడుతుంది. అప్పుడే ప్రజాస్వామ్యం రక్షణ ఏర్పడుతుంది.

అయితే, రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్డులో ప్రకటించిన 29అంశాలను పంచాయితీ రాజ్ సంస్థలకు బదలాయించే విషయాలలోనూ, రాష్ట్ర, కే,ద్ర ఆర్థిక సంఘాల సిఫారసుల మేరకు ఈ సంస్థలకు నిధుల కేటాయించే విషయంలోనూ, విధులు, నిధులతో పాటు స్వేచ్ఛగా స్థానిక స్థాయిలో నిర్ణయాలు తీసుకునే విషయంలోనూ పూర్తి స్థాయిలో వికేంద్రీకరణ జరగాల్సిన ప్రక్రియ మందగొడిగా సాగుతున్నదన్న విమర్శల్ని తొలగించే దిశగా ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ ప్రక్రియ వేగవంతమైతే పరిపాలనలో వికేంద్రీకరణ అన్న సూత్రం నూరుపాళ్ళు విజయవంతమవుతుందనటంలో సందేహంలేదు.

### పరిపాలనలో పారదర్శకత

పరిపాలనలో దాపరికాలకు తావుండరాదనీ, పారదర్శకంగా ఉండాలనీ, ప్రజలకు జవాబుదారీతనంగా పాలక వర్గం ఉండాలనీ ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం జరుగుతోంది. కానీ దాదాపు 70-80 ఏళ్ళ క్రిందటే మహాత్మాగాంధీ పాలనలో పారదర్శకతను నొక్కి చెప్పటం జరిగింది.

**తన ఆత్మకథలోనూ, యంగ్ ఇండియా పత్రికల్లోనూ తన అభిప్రాయాల్ని ఇలా వ్యక్తం చేశారు. "ప్రజల హితాన్ని మనస్సులో ఉంచుకొని, విశాల హృదయంతో నిజాయితీగా వ్యవహరించే ప్రతినిధులు మెరుగ్గా ప్రజా ప్రభుత్వాన్ని రక్షిస్తారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్నవారి నమ్మకము, ఆకాంక్ష, భావము ప్రతిఫలింపగలిగిన ప్రతినిధుల వల్ల ప్రజా ప్రభుత్వానికి హానికలగదు. ఇరవై మంది కేంద్రంలో కూర్చొని ప్రజా ప్రభుత్వాన్ని నడపలేరు.**

ప్రతి గ్రామంలోని ప్రజలు అడుగు నుండి దానికోసం పనిచెయ్యాలి".

## ప్రపంచీకరణ - పరిశ్రమలు - గ్రామీణ వృత్తులు

మానవ నాగరికత, విజ్ఞానం విశాలమైన కొద్దీ ప్రపంచం చిన్నదిగా మారిపోవటం, సాంస్కృతిక, జ్ఞాన మార్పిడి, పరస్పరం ఆధారపడటం అనేది సహజమే. అది వ్యక్తులు, సమాజాలు, దేశాల మధ్య కూడా అసహజం కాదు. విజ్ఞానం పెరిగే కొద్దీ, పారిశ్రామికంగా దేశాలు అభివృద్ధి చెందుతాయి. మానవ అభివృద్ధికి దారులు వేస్తాయి. అదే ప్రపంచీకరణకు, పారిశ్రామికీకరణకు తద్వారా అభివృద్ధికి బాటలు వేస్తాయి. అదే సందర్భంలో ఆ అభివృద్ధి, విదేశీ ఆధిపత్యానికి, భారతీయుల ఆత్మగౌరవానికి గొడ్డలి పెట్టుకాకుండా చూచుకోవాలి. "మన జాతీయ వరం ఇతర దేశాలకు ప్రమాదం కారాదు. ఏ దేశాన్ని స్వార్థానికి ఉపయోగించకూడదు. మనల్ని ఎవరూ తమ స్వార్థానికి ఉపయోగించనీరాదు" అని గాంధీజీ చెప్పారు.

ప్రస్తుతం సెజ్‌ల పేరిట గ్రామీణ ప్రజల, రైతుల భూములు, ఉపాధి పోతుందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రాజెక్టుల పేరిట ప్రజలు నిర్వాసితులవుతున్న దాఖలాలు కళ్ళముందున్నాయి. ఈ సమస్యలకు సామరస్యమైన పరిష్కారాల్ని వెతకాల్సి ఉంది. పారిశ్రామికీకరణ వల్ల మానవుని మనుగడకు ముప్పు వాటిల్లే అవకాశం రానీయరాదు అయితే వ్యక్తి శ్రమను తగ్గించే లక్ష్యం కాక, చాలా మందికి ఇబ్బందిని, కొందరికి లాభాలను చేకూర్చే యంత్రాల పట్ల గాంధీజీ వ్యతిరేకతను వెలిబుచ్చారు.

ప్రస్తుతం యంత్రాలతోనే పనులు జరగటం, మానవ ఉపాధి అవకాశాలను దెబ్బతీయటం జరుగుతోంది. ఆ సమస్య పరిష్కారంలో భాగంగా కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం "మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం" అమలులో దేశం మొత్తంలో మన రాష్ట్రం ముందంజలో ఉంది.

గ్రామీణ వృత్తుల్ని, ప్రత్యేకించి ఖాదీ వంటి పరిశ్రమల్ని ప్రోత్సహించాలని గాంధీజీ చెప్పారు. చేతి వృత్తులు, సబ్బుల తయారీ, పేపర్ తయారీ, అగ్గిపెట్టెలు, నూనె ఉత్పత్తులు, తోలు పరిశ్రమలు మొదలైనవి గ్రామాలలో స్థాపించవచ్చును. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఇప్పటికే ఖాదీ గ్రామోద్య కమీషను, ఖాదీ గ్రామీణ ఉద్యోగులు పనిచేస్తున్నాయి. వాటిని మరింత శక్తి వంతంగా, స్వతంత్రంగా తీర్చి దిద్దే చర్యలు సమర్థవంతంగా చేపట్టాలి.

## పారిశుద్ధ్యం, ఆరోగ్యం - అస్పృశ్యత

ఆరోగ్యానికి, పారిశుధ్యానికి అవినాభావ సంబంధం ఉంది. 2015 నాటికి నూరు శాతం ఆరోగ్యాన్ని సాధించే దిశగా మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకొన్న దేశాలలో భారత్ కూడా అంది. అయితే మన దేశంలో చేతులతో మలాన్ని ఎత్తే 'మానవ సమూహం' ఒకటి ఇంకా ఉనికిలో ఉండటాన్ని గాంధీజీ తప్పు పట్టారు. మన వీధులు మురుగుదొడ్లు మురికిగా ఉండటానికి కారణం అస్పృశ్యత, అపరిశుభ్రమైన వస్తువు లేదా మనిషి అంటరానిదన్నమాట. కానీ మురుకిని తొలగించకపోతే అది అనారోగ్యానికి కారణమవుతుంది. కాబట్టి పారిశుద్ధ్యాన్ని పేదలకు, ధనికులు స్వచ్ఛందంగా సహకరిస్తేనే ఈ సంస్కరణ సాధ్యం అవుతుంది. అలాగే అస్పృశ్యత హిందూ మతానికి ఓ శాపం. అస్పృశ్యతను నిర్మూలించకుండా స్వరాజ్యం రాదు" అని గాంధీజీ చెప్పారు. పౌర శిక్షాస్మృతి 1956 గానీ, ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల నిరోధక చట్టం 1989 గానీ, కేంద్ర, రాష్ట్ర కమీషన్లుగానీ, ఈ అస్పృశ్యతా కళంకాన్ని తొలగించేందుకు చేస్తున్న సిఫారసుల ఆచరణకు పూర్తి స్థాయిలో అమలుకై ఇంకా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారతదేశం గ్రామాల్లో ఉంది. అస్పృశ్యతా అక్కడే ఉంది. మార్పుకై తగ్గ ప్రణాళికలు రచించాల్సి ఉంది. గాంధీజీ ఉద్యమంలో నడిపిన దేవాలయ ప్రవేశోద్యమాలు, సహపంక్తి భోజనాలతో పాటు కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలు మొదలైనవి ఈ ..... కాలంలో ప్రభుత్వాలు చేపడుతున్నాయి. దీనితో పాటు ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టంలోని సెక్షన్ 46లో (1) నుండి (27) వరకు చెప్పబడిన విధుల్ని నిర్వహించుకునేందుకు తగిన ప్రణాళికలు రచించటం ద్వారా గ్రామాభివృద్ధికి బాటలు, సంఘ సామరస్యానికి బాటలు వేయవచ్చును.

## ప్రాథమిక విద్య

భారత రాజ్యాంగం అమలులోకి రావటానికి ముందే విద్య యొక్క ప్రాముఖ్యతను, మానవ నాగరికతలో రాని ప్రథమ స్థానాన్ని గుర్తించటం జరిగింది. యంగ్ ఇండియా, హరిజన పత్రికలు గాంధీజీకి విద్యపై గల అభిప్రాయాన్ని వెలిబుచ్చుతాయి. భారత రాజ్యాంగం 45 ఆర్టికల్‌లో 14 ఏళ్ళలోపు బాల బాలికలకు నిర్భంధ ఉచిత విద్యను రాజ్యాంగం అమలులోకి వచ్చిన పదేళ్ళలోపు అంటే 1960 లోపు 100 శాతం చేరుకోవాలని చెప్పింది. ఈ నాటికీ ఈ లక్ష్యం పూర్తికాలేకపోవటం కేంద్ర ప్రభుత్వం నిర్భంధ విద్యా హక్కు చట్టాన్ని తెచ్చింది. ఆపరేషన్ బ్లాక్ బోర్డు మొదులుకొని, నిరంతర విద్యా పథకం, వయోజన విద్యా మొదలైన ఎన్నో పథకాల సమీక్ష తర్వాత ఈ విద్యా హక్కు చట్టాన్ని తెచ్చింది. నూరు శాతం విద్యార్థుల హజరును పర్యవేక్షించటం,, పాఠశాలల్లో తగిన వసతుల ఏర్పాటుకు వనరులు లభ్యమయ్యేలా చూపటం మొదలైన బాధ్యతల్ని పంచాయితీ రాజ్ సంస్థలకు ఇచ్చి, ఆయా సిబ్బందిని కూడా వీటి ఆధీనంలోకి తెచ్చే ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగాల్సి ఉంది.

## సామాజిక సమస్యలు - మానవ హక్కుల కోణం

సమాజంలో పీడిస్తున్న ఆకలి, దరిద్ర్యం, కనీసావసరాలను అభివృద్ధి కోణం నుండి చూడాలన్న, మానవ హక్కుల పరిధిలోకి తేవాలనీ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చను గాంధీజీ 1930-40 దశాబ్దంలోనే లేవనెత్తారు. యుద్ధము, శాంతి, మానవుల మధ్య సమానత్వం, లింగ వివక్షత మొదలైన ఎన్నో అంశాల్ని గాంధీజీ చర్చించి పరిష్కారాలు చెప్పారు. అవే పరిష్కారాల్ని ఇటీవలి ఆధునిక ప్రభుత్వాలు పథకాల రూపంలో ప్రవేశ పెట్టేందుకు, గమనంలోకి తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నాయి.

అందరికీ సామాజిక సమానత్వం, ఆర్థిక సమానత్వం, సమాన రాజకీయ ప్రతినిధ్యం కోసం చేస్తున్న ప్రయత్నాలు, ప్రయోగాలు సఫలమైతే అంతర్జాతీయ స్థాయిలో భారత దేశం సమున్నతంగా కనబడుతుంది, గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యం, సర్వోదయ సమాజం ఆవిర్భవిస్తుంది.

*- ఎ. గవర్రాజు,* ఫ్యాకల్టీ, ఇ.టి.సి.-రాజేంద్రనగర్

# భూమి సర్వే ప్రక్రియ

**భూముల సర్వే చేయడానికి, మౌలిక (సర్వే) భూమి రికార్డులను నిర్వహించడానికి చట్టబద్ధమైన ప్రాతిపదికను 1923, ఆంధ్రప్రదేశ్ సర్వే సరిహద్దుల చట్టం ద్వారా వీలు కల్పించడమైనది. 1958, ఆంధ్రప్రదేశ్ సర్వే సరిహద్దుల (విస్తరణ, సవరణ) చట్టాన్ని చేయడం ద్వారా సదరు చట్టాన్ని సవరించి, తెలంగాణా ప్రాంతానికి విస్తరించడం జరిగింది.**

రెవెన్యూ పరిపాలన అర్థవంతంగాను, సమర్థవంతంగాను నిర్వహించాలంటే భూమి రికార్డుల నిర్వహణతో పాటు భూమికి సంబంధించిన సర్వే సెటిల్మెంటు ప్రక్రియ కూడా చాలా అవసరం.

సర్వే అంటే ఏదైనా విషయంలో కావలసిన వివరాలను కొన్ని నియమాల ప్రాతిపదికగా సేకరించడానికి జరిపే దర్యాప్తు. భూమికి సంబంధించి సర్వే అంటే భూమిని, ఆ భూస్వభావం, దానిని ఉపయోగించుకుంటున్న పద్ధతిని బట్టి విభాగాలుగా చేయడం, వాటికి సర్వే నెంబర్లను ఇవ్వడం, వాటి విస్తీర్ణాన్ని, హద్దులను నిర్ణయించడం, వాటి పటాలు తయారు చెయ్యడం వంటి ప్రక్రియలు.

భూమి సర్వే రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి టోపోగ్రాఫికల్ సర్వే, రెండవది కెడస్ట్రల్ సర్వే. భూమి నైసర్గిక చిత్రాన్ని, సహజ వనరులను నదులు, చెరువులు, కొండలు, రోడ్లు, రైలు మార్గాలు మొదలైన వాటితో పాటుగా సంపూర్ణంగా రూపొందించడం టోపో గ్రాఫికల్ సర్వే. దీనిని సర్వే ఆఫ్ ఇండియా సంస్థ నిర్వహిస్తుంది.

ఇక కెడస్ట్రల్ సర్వే అంటే ప్రతి వ్యక్తికి సంబంధించిన భూకమతం సరిహద్దులనూ, విస్తీర్ణాన్నీ, యాజమాన్యాన్నీ నిర్ధారించడం. దీనిని రాష్ట్ర సర్వే శాఖ నిర్వహిస్తుంది.

*సర్వేకు సంబంధించి ఇతర ముఖ్యమైన వివరాలు :*

ఎ. సర్వేకు సంబంధించిన కొలతల వివరాలు

1. ఒక గొలుసు - 100 లింకులు
2. ఒక లింకు - 7.92 అంగుళాలు
3. ఒక గొలుసు - 20.12 మీటర్లు లేక 22 గజాలు లేక 66 అడుగులు
4. ఒక ఎకరము - 10 చదరపు గొలుసులు
5. ఒక ఎకరము - 4047 చదరపు మీటర్లు లేక 4840 చదరపు గజాలు
6. ఒక హెక్టారు - 2.471 ఎకరాలు

**ఆంధ్ర ప్రాంతం**

7. ఒక ఎకరము - 100 సెంట్లు లేక 4840 గజాలు
8. ఒక సెంటు - 48 చదరపు గజాలు

**తెలంగాణా ప్రాంతం**

9. ఒక ఎకరం - 40 గుంటలు
10. ఒక గుంట - 121 చదరపు గజాలు

**రాయలసీమ ప్రాంతం**

11. ఒక అంకణము - 1010 = చదపు అడుగులు
12. ఒక ఎకరం - 435-60 అంకణాలు లేక 43,560 చదరపు అడుగులు లేక 4840 చదరపు గజాలు

బి. సర్వే పరికరములు

*1. మెట్రిక్ గొలుసు :* ఈ గొలుసులు మొట్టమొదట కనిపెట్టిన వారి పేర గంటరు గొలుసని పేరు వచ్చింది. సర్వే నిర్వహణలో భూముల దూరాలను కొలవడానికి దీనిని ఉపయోగిస్తారు. దీనిలో వంద లింకులఉంటాయి. రెండు కొనలను పట్టుకొనటానికి వీలుగా ఇత్తడి కడియాలు అమర్చబడ్డాయి. ఒక్కొక్క లింకు పొడవు 7.92 అంగుళాలు, గొలుసు పొడవు 22 గజాలు లేక 66 అడుగులు.

*2. బాణం గుర్తులు :* పది బాణం గుర్తు గల మేకులు కావలసి ఉంటాయి. ఒక్కో మేకు సుమారు 30 సెంటీ మీటర్లు పొడవు కలిగి ఉండును. దూరాన్ని గొలుసుతో కొలుస్తున్నపుడు, ఎన్ని గొలుసుల దూరమున్నదో లెక్కించడానికి ఉపయోగపడతాయి.

*3. క్రాస్ స్టాఫ్ :* ఒకానొక వస్తువు నుండి గొలుసు గీతకు, గొలుసు లైనుకు సమకోణం చేయునట్లుగా ఒక సరళ రేఖను గీచినచో ఈ సరళ రేఖను ఆఫ్‌సెట్టు అంటారు. ఇది ఆ వస్తువుకు, గొలుసు లైనుకు నడుమ నుండు అత్యంత సమీప దూరం.

ఇది 'తల' 'గడ' అను రెండు అంగాలతో ఉండును, తల అనునది 4 అంగుళాల చదరాన్ని $2^{1/2}$ అంగుళాల లావును గల కొయ్య బిళ్ళ. గడ అనునది 5/8 అంగుళాల చక్ర వ్యాసాన్ని, $4^{1/2}$ అడుగుల నిడువును గల ఇనుప కర్ర. దీని చివర ఒకటి మరతీరి తల క్రింద భాగంలోకి తిరుగును. రెండవ చివర నాడి మొన గలిగి నేలలో గ్రుచ్చుటానికి అనువుగా ఉంటాయి.

తలపై భాగాన 1/2 అంగుళం లోతు గలిగి మధ్య సమకోణం ఏర్పడేలాగా రెండు గాడులు ఉంటాయి.

**ఉపయోగాలు**

1. గొలుసు ఉన్న లైను నుండి ఒక వస్తువుకు ఆఫ్‌సెట్‌ను గీయటం.
2. గొలుసు లైను మీద ఒకానొక స్థానం నుండి ఆఫ్ సెట్టును గీయటం.
4. ప్లాటింగ్, ఆఫ్‌సెట్ స్కేలు : కొలతలు పటంలో గీయటానికి.

**సి. భూమి మీద నున్న చిహ్నాలను ప్లానులలో సూచించటానికి తరచుగా వాడే సంకేతాలు**

1. పెంకుటిల్లు లేక డాబా యిల్లు 

2. పూరి ఇల్లు 

3. దేవాలయం 

4. మసీదు 

5. చర్చి

6. కోట

7. లైటు హౌస్

8. కాలి దారి

9. బండ్ల దారి

10. మట్టి రోడ్డు

11. గులకరాళ్ళ రోడ్డు

12. కంకర రోడు, తారు రోడ్డు

13. మీటరు గేజి రైల్వే లైను

14. బ్రాడు గేజి రైల్వే లైను

15. టెలిఫోను లైను

16. నది కాలవ, అక్విడక్టు

17. నది ఆనకట్ట

18. వంతెన

19. బల్లకట్టు

20. చెరువు

21. స్లూయిస్

22. తూము

23. నలుచదరపు బావి

24. గుండ్రని బావి

25. నీలి తొట్టి

26. చిత్తడి నేల

27. ఉప్పుకొటారు

28. ఇసుక

29. శ్మశానం

30. తుప్పలు, అడవి

31. కొండ రాతినేల హద్దు

32. కొండ

33.గ్రామ త్రిసంధిస్థానపు స్టేషను

34.గ్రామ సరిహద్దు స్టేషను

35.ఖండపు దిమ్మె

36.మైనరు సర్వ్యూటు స్థానం

37.థియాడోలైటు స్థానం (పట్టణపు సర్వే)

38.చెయిను సర్వే రాయి (పట్టణపు సర్వే)

39.వంపు రాయి (పట్టణపు సర్వే)

40.అడవుల సరిహద్దు రాయి

41.గ్రామ సరిహద్దు

42.సర్వే వంపు సరిహద్దు

**డి. గ్రామ హద్దులు, పొలాల హద్దులు తెలుసుకోవటానికి ఏర్పరచు డిమార్కేషను రాళ్ళ వివరాలు:**

(1) సుమారు 90 సెం.మీ ఎత్తు $22^{1/2}$ సెం.మీ పొడవు $22^{1/2}$ సెం.మీ వెడల్పు గల థియాడోలైటు.

(2) 60 సెం.మీ ఎత్తు, 15 సెం.మీ పొడవు, 60 సెం.మీ వెడల్పు గల ఫీల్డు రాళ్లు.

డిమార్కేషను రాతి ప్రక్క రూపం

థియోడొలైటు ద్వయసంధి రాతి యొక్క తలపై రూపం (రెండు గ్రామాలు కలిసే ప్రదేశం తెలియజేసే రాయి)

థియొడొలైటు త్రయసంధి రాతి తలపై రూపం. (మూడు గ్రామాలు కలిసే ప్రదేశం తెలియజేసే రాయి)

ఫీల్డు రాతి తలపై రూపం

S

సబ్ డివిజన్‌లను డిమార్కేషను చేయటానికి ఉపయోగించే పొలం రాతి తలపై రూపం

ఖండపు థియోడొలైటు రాతి తల పై రూపం

గ్రామ హద్దు మీద పొలం రాతి తలపై రూపం

చిన్న సర్వ్యూటు స్థానం తలపై రూపం

*- బి. వెంకటేశ్వరరావు*
*కన్‌సల్‌టెంట్, ల్యాండ్ సెల్, అపార్డ్*

# గ్రామీణాభివృద్ధి - వికేంద్రీకృత ప్రణాళికీకరణపై సర్టిఫికెట్ కోర్సు

**వార్తల్లో 'అపార్డ్'**



సర్టిఫికెట్ కోర్స్ పార్టిసిపెంట్స్‌ని ఉద్దేశించి ప్రారంభోపన్యాసం చేస్తున్న కమిషనర్ డా. ఫణికుమార్

**టా**టా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, అపార్డు సంయుక్తంగా నిర్వహిస్తున్న 15 వారాల "గ్రామీణాభివృద్ధి వికేంద్రీకృత ప్రణాళికీకరణ" సర్టిఫికేట్ కోర్సు 13.9.2010న ప్రారంభమైంది. గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ రంగాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలలో పనిచేస్తున్న వారు, ఈ రంగాలలో స్థిరపడాలనుకొనే వారి కోసం ఈ కోర్సును ప్రారంభించటం జరిగిందని అపార్డు కమీషనరు శ్రీ ఫణికుమార్ అన్నారు. గత 5 దశాబ్దాలలో టిస్ గణించిన అకడమిక్ అనుభవాన్ని, అపార్డు క్షేత్ర స్థాయి పరిజ్ఞానాన్ని కలగలిపి ఈ కోర్సును రూపొందించటం జరిగిందని ఆయన అన్నారు.

టిస్ ప్రొఫెసర్ల విజ్ఞానాన్ని, పథకాల అమలులో అపార్డు ఫ్యాకల్టీ సభ్యుల ప్రణాళికా నైపుణ్యాల నుండి విద్యార్థులు ఈ 15 వారాల కాలంలో ఎంతో నేర్చుకోగలరని ఆశాభావం వ్యక్తం చేసారు. గ్రామీణాభివృద్ధి రంగంలో పెరుగుతున్న అవసరాల దృష్ట్యా టిస్‌తో కలిసి త్వరలో ఒక పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సును ప్రారంభించనున్నట్లు అపార్డు కమీషనరు డా ఫణికుమార్ తెలియచేసారు. ప్రతీ ఒక్కరూ ఒక బృందంలో సభ్యునిగా ఎలా పనిచేయాలో గుర్తెరగాలని అన్నారు. మారుతున్న పరిస్థితులలో వ్యక్తిగా అద్భుతాలు సాధించే అవకాశాల కన్నా ఒక బృందంగా విజయాలు సాధించే అవకాశం ఎక్కువ అని ఆయన అన్నారు. టిస్ అసోసియేట్ ప్రొఫెసర్ నరేంద్ర మాట్లాడుతూ, ఈ కోర్సు తొలుత 4 వారాల పాటు టిస్, తుల్జాపూర్ క్యాంపస్‌లో జరుగుతుందని, తదుపరి 8 వారాలు అపార్డు లో తరగతులను నిర్వహిస్తామని, 2 వారాల పాటు క్షేత్ర అధ్యయనం కూడా ఉంటుందని తెలియచేసారు. ఈ కోర్సుకు అపార్డు సి.డి.పి.ఏ సెంటర్ హెడ్ ప్రొ. ఆర్. సూర్యనారాయణరెడ్డి, టిస్ అసోసియేట్, ప్రొ. నరేంద్ర సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. ఎం.ఎల్. కాంతారావు, ప్రొ. బలరాములు, ఫ్యాకల్టీ సభ్యులు డా. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ♦

# కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ డా. హృశికేష్ పాండా

పంచాయితీ రాజ్ సంస్థలు బలోపేతం కావాలంటే ప్రజాప్రతినిధులు సంఘటితం కావల్సిన అవసరం ఉన్నదని, ఈ దిశగా అపార్డ్ కృషి చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డా. హృశికేష్ పాండా అన్నారు. తేది -9-2010న అపార్డ్‌ను తొలిసారిగా సందర్శించిన ఆయన పంచాయతీ రాజ్ ప్రజాప్రతినిధులు, సిబ్బంది సామర్థ్యాల పెంపుదలకు అపార్డ్ అనుసరిస్తున్న వ్యూహాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పంచాయితీ రాజ్ శాఖ పనితీరును, బదలాయించిన అధికారాలు, విధులు, నిధుల విషయమై పంచాయితీరాజ్ అదనపు కమీషనరు శ్రీ శంకర్‌రెడ్డి అపార్డ్ కన్సల్టెంట్ శ్రీ సి. వెంకటేశ్వరరావులు ఆయనకు వివరించారు. రాష్ట్రంలో బి.ఆర్.జి.ఎఫ్. కార్యక్రమం అమలు తీరుపై తెన్నులను కూడా ఆయన బి.ఆర్.జి.ఎఫ్, పి.యం. కన్సల్టెంట్ డి. రామకృష్ణ, డిప్యూటీ కమీషనరు శ్రీ రామారావులతో చర్చించారు. గ్రామ సభను బలోపేతం చేయటానికి అపార్డ్ అనుసరించిన వ్యూహాలను శ్రీ హృశికేశ్ పాండా ప్రశంసించారు. గ్రామ సభల సంవత్సరాన్ని పురస్కరించుకొని అపార్డ్ 4250 గ్రామాలలో కళాజాత బృందాల ద్వారా గ్రామీణ ప్రజలలో అవగాహన కల్గించటం జరిగిందని ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి వివరించారు. గంగదేవి పల్లి గ్రామ పంచాయితీపై రూపొందించిన డాక్యుమంటరీ ఫిల్మును చూసి గ్రామ పంచాయితీలను తప్పక సందర్శిస్తానని చెప్పారు. సాక్షర భారత్ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ కార్యక్రమంలో, ఎస్.జి.ఎస్.వై., ఎన్.ఆర్.హెచ్.యం. కార్యక్రమాల్లో పంచాయితీ రాజ్ సంస్థల పాత్రల గురించి ఆయన అపార్డ్ ఫ్యాకల్టీ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అపార్డ్‌లోని వివిధ సెంటరు హెడ్‌లు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నాడు.



అపార్డ్ ఫాకల్టీ, పంచాయతీరాజ్ అధికారులతో చర్చిస్తున్న పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ హృశికేష్ పాండా

# వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమ ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్

పంచాయితీ రాజ్ ప్రజా ప్రతినిధుల సామర్థ్యాల పెంపుదల కోసం జాతీయ సామర్థ్యాల పెంపుదల నిర్మతి ప్రకార, రెండు లక్షల ఇరవై వేల వార్డు సభ్యులకు శిక్షణ అందచేయటానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి,ఈ కార్యక్రమాన్ని అమలు చేసే బాధ్యతలను జిల్లా ప్రజా పరిషత్తు సి.ఇ.ఓ.లకు, డి.పి.ఓ.లకు అప్పగించటం జరిగిందని అపార్డ్ కమీషనర్ తేది: 17.10.2010న అన్ని జిల్లాల సి.ఇ.ఓ./డి.పి.ఓ.లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అన్నారు. అన్ని జిల్లాల్లో 90 శాతం పైబడి హాజరు సాధించాలన్నారు. సి.ఇ.ఓలు పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు. గతంలో శిక్షణ నిమిత్తం జిల్లా పరిషత్‌కు విడుదల చేసిన నిధులకు వినియోగ పత్రాలను వెంటనే పంపవలసినదిగా సి.ఇ.ఓ.లను కోరారు. దూర విద్యా మాధ్యమం ద్వారా అందించే శిక్షణా కార్యక్రమాలు మన టి.వి. ద్వారా సెప్టెంబరు 23 నుండి ప్రసారమవుతాయని ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారాలు తప్పని సరిగా హాజరయ్యేలా శ్రద్ధ వహించాలని అన్నారు.



పంచాయితీ రాజ్ సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు, సంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి తరచుగా వచ్చే సందేహాలను నివృత్తి చేయుటానికి పంచాయితీ రాజ్ హెల్ప్‌లైన్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన తెలియచేసారు. హెల్ప్‌లైన్ ద్వారా సమస్యలను ప్రజలు కాని, ప్రజాప్రతినిధులు కాని తెలియచేసినప్పుడు ఓపికతో, వినమ్రతతో సమాధానాలు చెప్పాలని కమీషనరు సూచించారు. వార్డు మెంబర్ల శిక్షణా కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, కడప చిత్తూరు జిల్లాలను అభినందించారు. మిగిలిన జిల్లాలు కూడా శిక్షణ అమలు వ్యూహాలను రూపొందించుకొని శిక్షణా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో అపార్డ్ సి.డి.పి.ఏ ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి, కన్సల్టెంట్‌లు శ్రీ సి. వెంకటేశ్వర రావు, శ్రీపతిరావు పాల్గొన్నారు.



# 21వ శతాబ్ది భారతదేశంలో కులం – జనగణన

**2010 భారతదేశ జనాభా లెక్కల ప్రక్రియ మొదలు పెట్టిన నాటి నుంచి కులాన్ని లెక్కించాలన్న డిమాండు ముందుకు వచ్చింది. ఎప్పుడో 1930లలో ఒక్కసారి ఈ రకమైన లెక్కింపు జరిగింది. కులం, దాని సామాజిక ఆర్థిక స్థితిలో ఏమిటి అని తెలుసుకునేందుకు ఇది అత్యవసరం. 2000 సంవత్సరంలో కూడా కులాన్ని జనగణనలో చేర్చాలన్న చర్చ జరిగింది. ఈ చర్చల వివరాలు ఆనాటి విద్యావిషయక పత్రికల్లో నిక్షిప్తమయి ఉన్నాయి. అయితే నాటి రాజకీయ వాతావరణం కులాన్ని జనాభా లెక్కలలో ఒక అంశంగా చేర్చేందుకు అడ్డుగా నిలిచింది.**

ఇప్పుడు, ఎంతో తర్జనభర్జన, ఒత్తిడి, రాజకీయాల అనంతరం కేంద్రప్రభుత్వం కులగణనకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. అయితే కులగణనను డిమాండు చేయడం వెనుక గల ప్రధాన అంశాన్ని మాత్రం గుర్తించనట్టే కేంద్రం ప్రవర్తిస్తున్నది. దేశంలో వివిధ కులాల సామాజికార్థిక స్థితి ఏమిటి అన్నదాన్ని సాధికారికంగా తెలుసుకోవాలి అన్నదే 'కులగణన' డిమాండు ప్రధాన లక్ష్యం. ఇది అర్థం చేసుకోలేని విషయం కాదు. జాతీయ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్.పి.ఆర్)లో కులం కూడా రిజిస్టర్ కావాలి. దానివల్ల, సామాజికార్థిక హోదాకూ, కులానికి గల సంబంధం తేటతెల్లమౌతుంది. భారత రాజ్యాంగం అనుగుణంగా మనం కులాన్ని ఒక ప్రమాణంగా చూస్తూ రిజర్వేషన్లను కల్పిస్తున్నాం. ఒక సామాజిక పునర్నిర్మాణ సాధనంగా రిజర్వేషన్లను, దానికి ప్రాతిపదికగా కులాన్ని భారత రాజ్యాంగం గుర్తిస్తున్నది.

నగరీకరణ. ఆంగ్లీకరణ చెందిన అగ్రవర్ణ రాజకీయవేత్తలు, అభిప్రాయ రూపకర్తలు ఇప్పటికే జనాభా లెక్కల్లో కులాన్ని చేర్చడం వెనుకబాటు తనమనే భావిస్తున్నారు. వారి దృష్టిలో 21వ శతాబ్ది భారతదేశంలో కులం ప్రాధాన్యత ఏమీలేదు. ఈ తర్కాన్ని కొనసాగిస్తూ,వీరు కులాన్ని జనాభా లెక్కల్లో చేర్చడం వల్ల సమాజం చీలి పోతుందని వాదిస్తారు. కులాన్ని మెరుగుపర్చడం ద్వారా కులం పోతుందని వారు వాదిస్తారు.

కులవివక్ష, కులదోపిడీ, కులాహంకారాలు తొలగిపోవాలని భావించడాన్ని, దానికి యత్నించడాన్ని వ్యతిరేకించనవసరంలేదు. జనాభా లెక్కలలో కులాన్ని చేర్చడం అన్న అంశం వేరు. కుల నిర్మూలన లేక కులాధిపత్య నిర్మూలన అన్న అంశం లేదు. కులాన్ని జనాభా లెక్కల్లో చేర్చడం వల్ల 'కుల నిర్మూలనా' వాదలకు కూడా ఎంతో ప్రయోజనం ఉంటుంది. కులానికీ, సామాజికార్థిక వెనుకబాటుకూ మధ్యగల సంబంధాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం దీని వల్ల సాధ్యమౌతుంది. ఈ అంశం అర్థమైనప్పుడు సామాజికార్థికంగా వెనుకబడిన కులాలను ఆ స్థితి నుండి బయటకు తీసుకు వచ్చేందుకు జరగవలసినదేమిటి? వారికి మేలు చేకూర్చగల వ్యూహాలు ఏమిటి అన్న అంశాలను కుల నిర్మూలనా వాదులు కూడా ఆలోచించవచ్చు.

కులం తోకలను పేర్లతో పెట్టుకోకపోవడం, కులాంతర వివాహాలు చేసుకోవడం వంటివి కుల నిర్మూలనకు తోడ్పడుతాయి అని భావించడం సరైందే కావచ్చు. కానీ ప్రతి కులంలో నుండి కనీస గౌరవప్రద జీవన ప్రమాణాలు గల కుటుంబాలు రూపకల్పన జరగాలి. అప్పుడు సమస్థాయిగల కుటుంబాల మధ్య దగ్గరి సంబంధాలు రూపొందుతాయి. అప్పుడు కుల అసమానత నిర్మూలన సాధ్యమవుతుంది. విజయవంతమైన

కులాంతర వివాహిత కుటుంబాలను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది. కులానికి జన్యుపర విలువ ఉన్నదని భావించే మానసిక నిర్మాణం క్రమేణా ఆవిరి కావాలంటే ప్రస్తుతం కులానికీ, సామాజికార్థిక వెనకబాటుకూ అంటే మానసిక సాంస్కృతిక నిర్మాణాలకు-పాదార్థిక భౌతిక నిర్మాణానికి మధ్యగల సంబంధం అర్థం చేసుకుని తీరవలసిందే.




ప్రత్యక్షంగా కులాన్ని కనిపించకుండా మరుగు పరచడం వల్ల కులం దానంతట అదే నిర్మూలించబడదు. దానికి బలమైన మానసిక, భౌతిక ప్రయత్నాలు అవసరం. మనదేశంలో గ్రామీణ ప్రాంతాల్లో కులం బహిరంగంగానూ, నగరాల్లో కులం ముసుగు వేసుకొని కనిపిస్తూనే ఉంటుంది. భారతదేశ వాణిజ్యరంగం కూడా సర్వ కుల సమాహారమేమీ కాదు. ఇవన్నీ వాస్తవాలు.

సామాజిక ఉత్పాదక అవసరాల కోసం పుట్టిన కులం, తదనంతరం జన్యుపర పవిత్రతను సంతరించుకున్నది. కులస్తులకు గల కుల వృత్తి జ్ఞానాలు, యాంత్రీకరణ, తరువాత దారుణంగా నిర్లక్ష్యం చేయబడినాయి. రిజర్వేషన్లు అనే అతి స్వల్పమైన సమస్యలతో కూడిన విధానపర పరిష్కారాన్ని భారత రాజ్యం 'కుల' అంతరాలను తొలగించే సాధనంగా వాడుతున్నది. దాని వల్ల లభిస్తున్న ఫలితాలు చెప్పుకోదగినవైనా అవి ఉత్పత్తిలో గల కులాలన్నింటి స్థితిని గమనిస్తే మాత్రం చాలా తక్కువ స్థాయి ఫలితాలను ఇస్తున్నాయనే అర్థం అవుతుంది.

జనాభా లెక్కల్లో కులాన్ని చేర్చి పరిశీలించడం ద్వారా ఇంతవరకూ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానపర పరిష్కారం అందించిన ఫలితాలు ఏమిటి? అన్నది తెలుస్తుంది. ఈ 60 సంవత్సరాల కాలంలో ఆయా కులాలలో జరిగిన అంతర్గత మార్పులకూ, వాటి అనుకూల, ప్రతికూల ఫలితాలనూ బేరీజు వేయడం సాధ్యమౌతుంది. జనాభా లెక్కలు అనే సామాజికార్థిక కేంద్రీకృత గణాంక సేకరణలో కులాన్ని చేర్చకపోవడం వల్ల మిధ్యావాదనలకు, ఊహాగానాలకు తెరలేస్తుంది.

జనాభా గణనలో ఎంతో అనుభవాన్ని సాధించిన జనగణన విభాగం మనకున్నది. ఆ విభాగానికి మాత్రమే కులగణన లెక్కింపు బాధ్యతలను అప్పజెప్పాలి. కుల సమాచారం ఒక ప్రధాన సామాజిక గుర్తింపునకు సంబంధించిన సమాచారం. దాన్ని అడగకుండా సేకరించే సమాచారం అంతా కుల విషయంలో అర్ధసత్యాలు, అసత్యాలు ప్రచారమవ్వడానికి దారితీస్తుంది.



ఇటీవలే దేశంలో ప్రతి పౌరుడినీ గుర్తించి (15 సంవత్సరాల పైబడిన వారిని) వారికి ఒక యూనిట్ ఐడెంటిటీ సంఖ్యను ఇవ్వదలచిన ప్రాజెక్టు మొదలయింది ఈ ప్రాజెక్టుకూ, జనాభాగణన విభాగానికీ మధ్య సంబంధం ఏమిటో మనకు తెలియదు. ఒకటి మాత్రం నిజం. యూనిక్ ఐడెంటిటీ కార్డు ప్రక్రియ ఆయా వ్యక్తుల గురించిన సమాచారాన్ని రాజ్యం ఒడిసి పట్టుకునే ప్రక్రియ. అది ప్రధానంగా జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారం. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ విధానం ఉంది. రాజ్యానికి, వ్యక్తికి మధ్య అపరిచయం ఉండకుండా చేసే వ్యవహారమిది. ఇది పౌరులకూ ఇవ్వొచ్చు, పౌరులు కాని వారికీ ఇచ్చేట్టు రూపొందించవచ్చు. ఇది కనుబొమ్మలను ఫొటో తీసే వ్యక్తిగత సమాచార వ్యవహారం. దీన్ని జనాభా లెక్కలతో పోల్చడం తప్పు.

యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబరు ఇచ్చే అమెరికా వంటి దేశాల జనాభాగణన, లేక సామాజిక గణాంకాలు ఎంతో లోతుగా జరుగుతాయి. విలువైన వ్యక్తిగత, కౌటుంబిక్ సమాచారాన్ని వారు రాబడుతుంటారు ఉదాహరణకు పెళ్ళికాని తల్లుల సమాచారం వంటి వాటిని కూడా సేకరిస్తారు. మరి మనమేమో కులాన్ని గణించడానికే కింద మీద పడిపోతున్నాం.

ఇంకో ముఖ్య అంశం. యూనిక్ ఐడెంటిటీ నెంబరు పాన్‌కార్డువంటి పౌరుడు దగ్గర ఉంచుకోవలసిన సంఖ్య. అది గుర్తింపు మాత్రమే తెలుపుతుంది. అతని / ఆమె సామాజికార్థిక స్థాయిని అది పట్టి ఇవ్వదు. అది దాని లక్ష్యం కాదు. అందునా అది 15 సంవత్సరాలు పైబడిన వారికి సంబంధించిన అంశం. కులాన్ని జనాభాగణనలో కలిపి లెక్కించాలని డిమాండు ఊపందుకొని, దానికి కొంత సానుకూలత సాధించిన తరువాత, దాన్ని ఈ బయోమెట్రిక్ విధానంలో కలుపుతామని మాట్లాడటం దుర్మార్గం, కపటత్వం.

జనాభాగణన గోప్యంగా ఉంచే సమాచారం, దీనిలో వ్యక్తిగత సమాచారం బయటికి రాదు. గ్రామ స్థాయి నుండి సమీకృత సమాచారం(consolidated) బయటికి వస్తుంది. ఉదాహరణకు ఫలానా కులస్తులలో కనీసం 10వ తరగతి వరకూ చదువుకున్న ఆడపిల్లలు ఎందరు? అన్న ప్రశ్నకు జనాభా లెక్కల విశ్లేషణలో కులాన్ని చేర్చడం

ద్వారా సమాధానం దొరుకుతుంది యూనిక్ ఐడెంటిటీ కార్డులతో కులాన్ని చేర్చడం వల్ల ఇటువంటి ప్రశ్నకు సమాధానం దొరకదు. ఈ విషయం అతి ముఖ్యమైంది.




ఏదో అడిగినందుకు ఇంకేదో చేస్తే పోలా అన్నట్టు ప్రభుత్వం ప్రవర్తిస్తున్నది. 15 సంవత్సరాలలోపు వారి సమాచారం యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఆధారిటీ సేకరించదు. మరి అంత కీలకమైన జనాభా (మొత్తం జనాభాలో దాదాపు 30% జనాభా 0-15 వయసు వరకు వారితో నిండి ఉంటుంది) స్థితి ఏమిటో తెలియదు. గుర్తింపుకార్డుతో కులాన్ని గుర్తించేస్తాం అని ప్రభుత్వం ఎందుకు అంటున్నదో అర్థం చేసుకోవాల్సి ఉంది.

గుర్తింపు కార్డుల వ్యవహారం వేరు, జనాభా గణాంక సేకరణ వేరు. ఇది నిరాకరించలేని సత్యం. రెండింటి ప్రయోజనాలు వేరు వేరు. గుర్తింపు కార్డుల లక్ష్యం భద్రత, నిఘా, నియంత్రణ, బాధ్యతల విధింపు, వంటి అంశాలకు సంబంధించింది. జనాభాగణన లక్ష్యం దేశంలోని వివిధ ప్రాంతాలలోని ప్రజల జీవన స్థితిగతుల స్థూల సమగ్ర అవగాహన అందుకే కుల గణనను ఎట్టి పరిస్థితుల్లో జనాభా గణనలోనే లెక్కించాలి. దీని వలన నిజం నిగ్గుదేలుతుంది.

సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేటి రోజుల్లో జనాభాగణన విభాగం ప్రతి మునిసిపాలిటీ, పంచాయితీస్థాయిలో నిరంతర సమాచారం సేకరించే ఏర్పాటును చేయడం అవసరం. జనన, మరణ, వివాహాలను రిజిస్టరు చేసే హక్కుగల స్థానిక ప్రభుత్వాలు అవి. నిరంతరం, హేతుబద్ధమైన యదార్థమైన కులంతో కూడిన సామాజికార్థిక సమాచారం, దేశపు సామాజికార్థిక పునర్ నిర్మాణానికి అత్యవసరం. ఇది గుర్తించకుండా కులగణనను తప్పు అవడం, తప్పుదోవ పట్టించడం దేశానికి మేలు చేయదు.

కులదురహంకారాలు, కుల పట్టింపులూ తరిగి పోవాలంటే సర్వ ప్రజాజీవన రంగాలలోకి సర్వ కులాల వారు ప్రవేశించే సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, విధాన పర మార్పులు అవసరం. ఈ మార్పులు జరగడానికి వాస్తవం ప్రాతిపదికగా ఉండటం మంచిది. జనగణన యదార్థాన్ని తెలుసుకునే గణాంక ప్రక్రియ. అందులో తప్పనిసరిగా కులం ఒక అంశంగా చేరాలి. దాని వలన గణన కొంత ఆలస్యమైనా నష్టంలేదు.

కులగణన కేవలం ఏదో ఏడుస్తున్న వాళ్ళ కళ్లు తుడుస్తునట్టు, ఒంతుకు గంతేసినట్టు చేయవలసిన పనికాదు. అందుకే దాన్ని తప్పనిసరిగా జాతీయ పాపులేషన్ రిజిస్ట్రేషన్‌లో భాగం చేయాలి. జనాభా గణాంకాలకు దూరంగా, బయోమెట్రిక్ విధానం ద్వారా యూనిక్ ఐడెంటిటీ కార్డుల వ్యవహారంలో కులగణనను ముడి వేయడం అర్థరహితం. దానివల్ల ప్రయోజనం ఉండదు.




యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబరు లక్ష్యం వేరు. జనాభా గణన లక్ష్యం వేరు ఇది అర్థమయి కూడా అర్థకానట్టు ప్రవర్తించడాన్ని అనుమానించాల్సి వస్తుంది. కులాధారిత స్వేచ్ఛా రాహిత్యాన్ని, కులప్రేరిత అసమానతనూ గుర్తించాలన్న ప్రతి ప్రజాస్వామ్యవాదీ జనాభాగణనలో కులాన్ని కలిసి లెక్కించడాన్ని ఆహ్వానించాలి. దానికై ప్రభుత్వంపైన ఒత్తిడి తేవలసిందే.



*- హారతి వాగీశన్*
*రాజనీతి శాస్త్ర బోధకులు,*
*నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం*

# గ్రామీణాభివృద్ధిలో రిమోట్ సెన్సింగ్ పాత్ర

**శాస్త్రీయ పద్ధతిలో ఒక నిర్ధిష్టమైన ప్రదేశం లేదా ఆకృతి సమాచారాన్ని, ఆ ప్రదేశంతో నేరుగా ఎటువంటి సంబంధం లేకుండా సేకరించే ప్రక్రియే రిమోట్ సెన్సింగ్ అని చెప్పవచ్చు.**

**అయితే ఉపగ్రహాల ద్వారా సమాచారాన్ని సేకరించే పద్ధతి వచ్చిన తరువాత రిమోట్ సెన్సింగ్ నిర్వచనం ఈ విధంగా చెప్పవచ్చు.**

"భూ పర్యావరణం, భూ సహజ వనరుల సమాచారాన్ని ఉపగ్రహాలు, వైమానిక చిత్రాలు స్కానింగ్ అనే ప్రక్రియ ద్వారా సేకరించి విశ్లేషించే పద్ధతిని రిమోట్ సెన్సింగ్ అని అంటాం. రిమోట్ సెన్సింగ్‌కు చక్కని ఉదాహరణ మానవుని కళ్ళు. ఏ మాధ్యమం లేకుండా వస్తువు పూర్తి సమాచారాన్ని కళ్ళు అందిస్తాయి.



*ఆంధ్రప్రదేశ్ ఉపగ్రహ ఛాయచిత్రం*

## చారిత్రక నేపథ్యం


మొట్టమొదటిగా 1982 సంవత్సరంలో రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు అమెరికాలో ఉన్న నాసా సంస్థ అంతరిక్షంలో ప్రవేశపెట్టింది. దానిని ల్యాండ్‌సాట్ అంటారు. ఇది ముఖ్యంగా భూ ఉపరితలంపై వాతావరణంలో జరిగే మార్పులను పర్యవేక్షించటానికి ఉద్దేశించబడింది. భారతదేశంలో మొట్టమొదటిసారిగా 1988లో ఐ.ఆర్.ఎస్. ఎ1 (ఇండియన్ రిమోట్ సెన్సింగ్) అంతరిక్షంలో ప్రవేశ పెట్టారు. ఆ తరువాత ఐ.ఆర్.ఎస్. 1ఎ,1బి,1సి,1డి.మరియు పి సిరీస్ పి1,పి2,పి3, పి6, కార్టోసాట్-1,2,2బి.సిరీస్ ఉపగ్రహాలు భూ ఉపరితలంపై భూవినియోగం, భూమిపై జరిగే వైపరీత్యాలు పర్యవేక్షించటానికి ఉపయోగిస్తున్నారు.

### రిమోట్ సెన్సింగ్ ఉపయోగాలు

- ఎక్కువ విస్తీర్ణం గల ప్రదేశాన్ని ఒక ఛాయా చిత్రం ద్వారా చూపవచ్చు.
- టోపో షీట్లలో లభ్యంకాని సమాచారాన్ని ఛాయా చిత్రాల ద్వారా పొందవచ్చు.
- భూమి ఉపరితలంపై జరిగే మార్పులను కాలానుగుణంగా ఛాయా చిత్రాల ద్వారా పర్యవేక్షించవచ్చు. మాన్యువల్/సాంప్రదాయ బద్ధమైన సర్వేకన్నా అతి తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని ఛాయా చిత్రాల ద్వారా పొందవచ్చు.
- భూ సర్వేలు అనుకూల వాతావరణంలో చెయ్యబడతాయి గానీ వాతావరణ మార్పులు రిమోట్ సెన్సింగ్ సర్వేపై అతి తక్కువ ప్రభావం చూపుతాయి.
- రిమోట్ సెన్సింగ్ ద్వారా లభ్యమయ్యే ఛాయా చిత్రాలు పలు రకాల వ్యవస్థల్లో వాడవచ్చు. ఉదా: వ్యవసాయ శాస్త్రజ్ఞుల పంటల విశ్లేషణకు, అలాగే భూగర్భ జల సర్వే కొరకు, మృత్తిక సర్వే చేసేందుకు ఉపయోగిస్తారు.
- రిమోట్ సెన్సింగ్ మాధ్యమం ద్వారా వరదలు, తుపాన్లు, కరువు పీడిత ప్రాంతాలు, నిప్పుతో దగ్ధమయ్యే అడవులు, అగ్నిపర్వతాల విస్ఫోటాలు, భూ వినియోగంలో జరిగే మార్పులు, మొదలగు వాటిని కాలానుగుణంగా పర్యవేక్షించవచ్చు.
- రిమోట్ సెన్సింగ్ ద్వారా లభ్యమయ్యే ఛాయా చిత్రాలు విశ్లేషించడానికి జి.ఐ.యస్ సాఫ్ట్‌వేర్ ద్వారా చెయ్యవచ్చు.
- ఎక్కువ సమయం, ఖర్చు, మౌలిక సదుపాయాలతో కూడుకున్న భూ సర్వే కన్నా రిమోట్ సెన్సింగ్ సర్వేలు మిన్న.
- రిమోట్ సెన్సింగ్ ద్వారా పట్టణాభివృద్ధిలో కలిగే మార్పులను, వాతావరణంలో కలిగే మార్పులను పర్యవేక్షించవచ్చును.





*ఉపగ్రహ ఛాయా చిత్రాలు ద్వారా ఆకృతుల గుర్తింపు, విశ్లేషణ*




ఛాయా చిత్రాల ద్వారా ప్రదేశాలలో మార్పులు

## ఉపగ్రహ ఛాయా చిత్రాలు ద్వారా ఆకృతుల గుర్తింపు, విశ్లేషణ

- ఉపగ్రహ ఛాయా చిత్రాలలో వృక్షాలు ఎరుపురంగులో సూచించ బడతాయి (చెట్లు, పచ్చగడ్డి, గుబురుగా వున్న తుమ్మ, సీమ తంగేడి మొదలగునవి).
- వాగులు, వంకలు, చెరువులు, నదులు, కుంటలు, గాఢ నీలం రంగులలో సూచించబడతాయి.
- పట్టణ ఆవాస ప్రాంతంలోవున్న ఇళ్ళు బూడిద రంగులో సూచించబడతాయి.
- బీడు భూములు, ఇసుక నేలలు, తెలుపు రంగులో సూచించ బడతాయి.
- లోతైన నదులు, చెరువు, సముద్రాలు మరియు నల్ల రేగడి మృత్తికలు నలుపు రంగులో సూచించబడతాయి.




ఛాయా చిత్రాల ద్వారా ప్రదేశాలలో మార్పులు

- పాడిపంటలు గుబురుగా వున్న చెట్ల మధ్య ఆకృతుల ఆధారంగా గుర్తించవచ్చు.
- ఛాయా చిత్రాల ద్వారా పంట లక్షణాలు చాలా సులువుగా గుర్తించవచ్చు. మొక్కలు, పచ్చదనం ద్వారా ఉత్పన్నమైన కిరణాలు చాలా గాఢంగా ఉపగ్రహ ఛాయా చిత్రాలలో చిత్రీకరించ బడతాయి. దీనిద్వారా ఒక ప్రాంతం పచ్చదనం, పంట లక్షణాలు, అడవులు, క్షీణిత, కరువు వ్యాపించే ప్రక్రియను నివారించవచ్చు.

వివిధ సమయాలలో తీయబడిన ఛాయా చిత్రాల ద్వారా కరువు ప్రాంతాలు, పంట నష్టాలను నివారించవచ్చు.

ఈ విధంగా మనం రిమోట్ సెన్సింగ్ పద్ధతిని మన గ్రామీణ అభివృద్ధిలో ఉపయోగించుకోవచ్చు.





- డా॥ జి. శ్రీనివాస్, కన్సల్టెంట్
- వి. రాజేంద్ర, కన్సల్టెంట్
- యస్. శాంతి కుమార్, ఎనలిస్ట్
(జి.ఐ.యస్. సెంటర్, ఎ.ఎమ్.ఆర్. అపార్డ్)





# కామన్‌వెల్త్ క్రీడల్లో మన క్రీడాకారులు

న్యూఢిల్లీలో జరిగే కామన్‌వెల్త్ క్రీడలకు సర్వం సిద్ధమైంది. వైభవోపేతంగా జరిగే క్రీడల ప్రారంభోత్సవానికి వేదిక ముస్తాబయింది. వివాదాలు, ఆరోపణలు, ఆలస్యాలు, డోపింగ్ గొడవలు మొదలైన వాటినన్నిటిని వెనక్కు నెట్టి కామన్ వెల్త్ క్రీడల సంరంభం ముందుకు దూసుకొచ్చింది. ఇంతకు ముందే చెప్పుకున్నట్లు, 19వ కామన్‌వెల్త్ క్రీడలకు మన దేశం ఆతిథ్యం ఇచ్చిన స్థాయిలో, ఇంతకు ముందు ఏ క్రీడలనూ నిర్వహించలేదు.

కామన్ వెల్త్ క్రీడల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం ఎక్కడా రాజీపడటం లేదు. క్రీడల నిర్వహణ నాణ్యతను పెంచడానికి సర్వవిధాలా ప్రయత్నిస్తోంది. ఎందుకంటే, నూతనంగా ఆవిర్భవిస్తున్న ఆర్థికశక్తిగా భారతదేశ ప్రతిష్ఠను పెంచడానికి ఈ క్రీడలు ఉపయోగపడతాయి. క్రీడల నిర్వహణ బాగా విజయవంతం అయితే, దేశ కీర్తి పతాక సమున్నతంగా ఎగురుతుంది.

భారతదేశం తరపున 440 మంది క్రీడాకారులతో కూడిన బలమైన బృందం క్రీడల్లో పాల్గొనటానికి ఉరకలు వేస్తోంది. అన్ని క్రీడా విభాగాల్లో దాదాపు 800 పతకాలు ఉన్నాయి. మన దేశ క్రీడాకారులు మంచి అంతర్జాతీయ శిక్షణ పొందారని, విదేశీ కోచ్‌ల ద్వారా సుశిక్షితులయ్యారని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రీడా నిర్వహణకు మన దేశం కనీసం 10,000 కోట్ల రూపాయలను వ్యయం చేస్తోంది.

మన దేశ క్రీడాకారులు కామన్‌వెల్త్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని, పెద్ద సంఖ్యలో పతకాలను సొంతం చేసుకుంటారని క్రీడల ఆర్గనైజింగ్ కమిటీ ఆశిస్తోంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో






బంగారు పతకాన్ని పొందిన విలువిద్య క్రీడాకారులు అభినవ్ బింద్రా, కాంస్య పతకం పొందిన బాక్సర్ విజేందర్, బ్యాడ్మింటన్‌లో ప్రపంచ నెంబర్ 3 సైనా నెహ్వాల్, టెన్నిస్ గ్రాండ్ శ్లామ్ జంట విజేతలు లియాండర్ పేస్, మహేష్ భూపతి, సానియా మీర్జా, ఒలింపియన్ షూటర్ గగన్ నారంగ్ వంటి మేటి క్రీడాకారులు కూడా పాల్గొనటంలో కామన్ వెల్త్ క్రీడలు మనదేశంలో ఆసక్తికరంగా మారాయి. హైదరాబాద్ దత్తత తీసుకున్న గగన్ నారంగ్, ప్రపంచంలోనే నెంబర్ 2 ర్యాంకులో ఉన్నాడు. 2012 ఒలింపిక్స్‌కి ఎంపికైన మొదటి భారత క్రీడాకారుడాయన.

కామన్ వెల్త్ క్రీడల నేపథ్యంలో, తరుచుగా అడిగే ప్రశ్న ఏమిటంటే, మన గెలుపు అవకాశాలు ఎలా ఉండబోతున్నాయి? మన క్రీడాకారులెంత బాగా ఆడబోతున్నారు? మన ప్రస్తుత రికార్డులను మనం మెరుగు పరచుకుంటామా? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకునే ముందు, కామన్‌వెల్త్ క్రీడల్లో భారతదేశ క్రీడాకారులు ఇప్పటివరకు కనబరిచిన పనితీరును అంచనా వేయటం అవసరం.

1930లో కామన్‌వెల్త్ క్రీడలకు అంకురార్పణ జరిగింది. 14 సార్లు భారతదేశం ఈ క్రీడల్లో పాల్గొని, మొత్తం 271 పతకాలను సాధించింది. వీటిల్లో 102 బంగారు పతకాలు, 92 వెండి పతకాలు, 72 కాంస్య పతకాలు ఉన్నాయి. మొత్తం పతకాల్లో భారతదేశం ఐదవ స్థానంలో నిలిచింది.

1934లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో భారతదేశం తన మొట్టమొదటి కామన్‌వెల్త్ క్రీడల పతకాన్ని సాధించింది. రెండవ పతకాన్ని సాధించడానికి, దేశం దాదాపు పావు శతాబ్దం పాటు అంటే 25 సంవత్సరాల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. 1958లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో భారతదేశం తన రెండవ పతకాన్ని పొందింది.

మళ్లీ 1970లో జరిగిన క్రీడల్లో భారతదేశం 10 పైగా పతకాలు సాధించింది. ఆ తరువాత, మన క్రీడాకారుల ప్రతిభ క్రమంగా మెరుగుపడుతూ వచ్చింది. మాంచెస్టర్‌లో 2002లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడా పోటీల్లోనే మనకు ఎక్కువ పతకాలు వచ్చాయి. ఆ పోటీల్లో మనదేశ క్రీడాకారులు మొత్తం 69 పతకాలు సాధించగా, వాటిల్లో 30 బంగారు పతకాలు, 22 వెండి పతకాలు, 17 కాంస్య పతకాలు ఉన్నాయి.

మాంచెస్టర్ కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాల పట్టికలో మనది నాలుగవ స్థానం కాగా, 2006లో మెల్‌బోర్న్‌లో జరిగిన క్రీడల్లో 50 పతకాలు సాధించాం. అయినప్పటికీ, ఆ క్రీడల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడాల కంటే ఎంతో వెనుకబడి ఉన్నాం.

కామన్‌వెల్త్ క్రీడల్లో మనదేశం సాధించిన పతకాల్లో ఎక్కువభాగం షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ విభాగాల నుంచే వచ్చాయి. మెల్‌బోర్న్‌లో జరిగిన క్రీడల్లో 16 పతకాలు బింద్రా, నారంగ్, సమరేష్ జింగ్, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్‌ల నుంచే వచ్చాయి.

అన్ని క్రీడా విభాగాల్లో కెల్లా అథ్లెటిక్స్‌లో మన దేశం బలహీనంగా ఉంది. 70 సంవత్సరాలలో ఒకే ఒకసారి మనదేశం అథ్లెటిక్స్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. 1958లో యునైటెడ్ కింగ్‌డమ్‌లోని కార్టిఫ్‌లో జరిగిన 440 మీటర్ల పరుగు పందెంలో మిల్కాసింగ్ చారిత్రాత్మక విజయం సాధించారు.

ఈ సారి అథ్లెటిక్స్ విభాగంలోని 44 ఈవెంట్లలో పాల్గొనడానికి 90 మంది అథ్లెట్లను భారతదేశం పోటీలో దించుతోంది. కొద్దివారాల క్రితం క్రొయేషియాలో జరిగిన ఐఎఎఎఫ్ కాంటినెంటల్ కప్ టోర్నమెంట్‌లో 800 మీటర్ల పరుగు పందెంలో షైనీ విలియమ్స్ 15 సంవత్సరాల రికార్డును అధిగమించిన టింటూ లూకా కామన్‌వెల్త్ క్రీడల్లోనూ తన సత్తా చూపిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.







ఆనాటి మేటి క్రీడాకారిణి పి.టి ఉష శిష్యురాలైన టింటూ లూకా ప్రపంచంలో ఐదవ ర్యాంకులోను, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉత్తమ అథ్లెట్‌గానూ ఉన్నారు.

ఇక స్విమ్మింగ్ పోటీల్లో మన ఘనత ఏమీ లేదు. 2002 లోనూ, 2006 లోనూ జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో మనకు స్విమ్మింగ్ పోటీల్లో ఒక్క మెడల్ కూడా రాలేదు.

యువ షూటర్లయిన యాషర్ నోరియా (హైదరాబాద్), రంజన్ శోధి పతకాల సాధించగలరనే ఆశాభావం వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌కి చెందిన యాషర్ నోరియా ఇటీవల జర్మనీలోని మ్యూనిచ్‌లో జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఒక బంగారు పతకాన్ని గెలుచుకున్నారు.

బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్‌లలో భారతదేశ క్రీడాకారులు బాగా రాణించగలరని, మంచి ప్రతిభ కనబరచగలరని ఆశిస్తున్నారు. బ్యాడ్మింటన్‌లో భారతదేశమే ఆంధ్రప్రదేశ్. ఆంధ్రప్రదేశే భారతదేశం. బ్యాడ్మింటన్‌లో ప్రతిభ గల భారతదేశ క్రీడాకారులంతా ఈ దక్షిణాది రాష్ట్రం నుంచే ఉన్నారు.

సైనా నెహ్వాల్, జ్వాలా గుత్తా, చేతన్ ఆనంద్, కశ్యప్, మొదలైన వారంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారే. నిజానికి మెల్‌బోర్న్‌లో జరిగిన క్రీడా పోటీల్లో చేతన్ ఆనంద్ సింగిల్స్‌లలో కాంస్య పతకాన్ని గెలుపొందారు.



## కామన్ వెల్త్ క్రీడల్లో మన అభినవ క్రీడాకారుడు

అభినవ్ బింద్రా, గగన్‌నారంగ్ వంటి ఉన్నత శ్రేణి క్రీడాకారులపైనే అందరి దృష్టి ఉంటుంది. అయితే, హైదరాబాద్‌కి చెందిన యాషర్ నోరియాపై కూడా మనం దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

ఇటీవల జర్మనీలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో జరిగిన డబుల్ ట్రాప్ ఈవెంట్‌లో రెండు బంగారు పతకాలు సాధించిన యాషర్ నోరియా తీవ్రమైన కాలి మడమ నొప్పిని సైతం అధిగమించి సాధించిన విజయం గొప్ప మలుపువంటిదే.

9 సంవత్సరాల చిరుప్రాయంలోనే యాషర్ షూటింగ్ నేర్చుకోవటం ప్రారంభించాడు. ఆయన తండ్రి గుస్తి నోరియా కూడా షూటరే.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కి చెందిన ఈ కుర్రాడు రానున్న కామన్‌వెల్త్ క్రీడల్లో విజయాలు సాధించాలని కోరుకుందాం. ♦



బ్యాడ్మింటన్‌లో జాతీయ కోచ్‌గా ఉన్న పుల్లెల గోపిచంద్ ఇదివరకే ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్. ఈయన కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారే.

చెన్నైలో జన్మించిన తెలుగు క్రీడాకారుడు ఆచంట శరత్ కమల్ టేబుల్ టెన్నిస్‌లో సింగిల్స్ ఛాంపియన్ షిప్ సాధించారు. 2006లో మెల్‌బోర్న్ జరిగిన క్రీడల్లో పురుషుల జట్టు టైటిల్ సాధించటంలో ఈయన ప్రతిభ తోడ్పడింది. ఇదే మళ్లీ పునరావృతమవుతుందని ఆశించవచ్చు.

ఆర్చరీలో వరంగల్ జిల్లాకు చెందిన బాలిక వర్ధినేని ప్రణీత 2010 కామన్ వెల్త్ క్రీడలకు అర్హత సాధించలేకపోయింది. బీజింగ్ ఒలింపిక్స్‌లో కూడా పాల్గొనగలిగిన ఈమె ఇందులో అర్హత సాధించలేకపోవటం బాధాకరం. సెలక్షన్ ట్రయల్స్‌లో ఈమె ఏడవ స్థానానికే పరిమితమైంది. ఆసియా స్థాయిలో వ్యక్తిగత ఛాంపియన్‌గా నిలిచిన ఐసయ్య రాజేందర్ సనమ్ కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవాడే. ఇతను కూడా ఏడవ స్థానానికే పరిమితమయ్యారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సైనా నెహ్వాల్, జ్వాలా గుత్తా, చేతన్ ఆనంద్, సానియా మీర్జా, గగన్ నారంగ్ వంటి క్రీడాకారులే కాక, రాష్ట్రం నుంచి మరికొందరు కూడా కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొంటున్నారు. వీరిలో సత్తిగీత, సిహెచ్ శాంతి (400 మీటర్ల పరుగు పందెం), కె. మృదుల (4×400 మీటర్ల రిలే), అబ్దుల్ నజీబ్ ఖురేషి (100 మీటర్లు 200 మీటర్లు), వెయిట్ లిఫ్టర్ వి. శ్రీనివాసరావు (56 కె.జి) ఆర్చర్లు సిహెచ్. జిగినా, రిత్వల్ చక్రవర్తి మొదలైనవారు ఉన్నారు. అబ్దుల్ నజీబ్ ఖురేషి ప్రస్తుతం భారతదేశపు అత్యధిక వేగవంతమైన రన్నర్‌గా గుర్తింపు పొందారు. వి. శ్రీనివాసరావు విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారుడు.

పశ్చిమ గోదావరి జిల్లాలోని మారుటేరుకి చెందిన సత్తి గీత 100 మీటర్లు, 200 మీటర్లు, 4×100 సీనియర్ నేషనల్ అథ్లెటిక్ మీట్‌లో బంగారు పతకాలు సాధించింది. 2004లో ఏథెన్స్‌లోనూ, 2008లో బీజింగ్‌లోనూ జరిగిన ఒలింపిక్స్ పోటీల్లో సత్తిగీత భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది.

అర్జున అవార్డు తనకు దక్కనందుకు ఆందోళన చెందిన గీత ఈ సారి జరిగే కామన్‌వెల్త్ క్రీడల్లోనూ, తరువాత జరిగే ఆసియా క్రీడల్లోనూ తన ప్రతిభను నిరూపించుకోవాలనే పట్టుదలతో రంగంలోకి దిగనున్నది. అర్జున అవార్డు రానందుకు గగన్ నారంగ్ కూడా బాధపడ్డారు.

ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులతో సహా, భారతదేశ క్రీడాకారులంతా ఇదివరకటి ఈవెంట్లకంటే, ఇప్పుడు మరింత మెరుగ్గా ఆడతారని ఆశిద్దాం!

**- దాసు కేశవరావు**

*(అనువాదం : వై. సరోజ)*



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వరదాయిని. భారత ప్రభుత్వం అందించిన ఉపాధి హామీ చట్టం-2005 కృత నిశ్చయంతో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను పాటిస్తూ జాబ్ కార్డు ఉండి వని కోరిన కుటుంబానికి కనీసం 100 రోజుల భృతి కల్పిస్తుంది. వలసలు వెళ్లే వారికి ఉన్నఊరులోనే పని కల్పించడమే కాకుండా, సుస్థిరమైన ఆస్తులను పదికాలాల పాటు భాసిల్లే విధంగా చేస్తూ - జీవన ప్రమాణాన్ని మెరుగుపరచి తలసరి ఆదాయాన్ని పెంపొందించి - ఆర్థిక అసమానతలను తగ్గిస్తూ ఈ పథకాన్ని ప్రణాళిక బద్ధంగా కొనసాగించే విధంగా ప్రభుత్వం కంకణం కట్టుకుంది.

# పేదలకు వరం ఉపాధి హామీ పథకం

కనీస వేతన చట్టం - 1948 అమలుతో పాటు, స్త్రీ-పురుష సమానవేతన చట్టం -1976 అమలు చేస్తూ, ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా బడుగు, బలహీన వర్గాల వారికి గ్రామీణ అభివృద్ధిశాఖ 'నేనున్నాను' అని వెన్నుదన్ని నిలిచింది. భారతదేశంలో అమలవుతున్న ఈ ఉపాధి హామీ పథకం మూడవ ప్రపంచ రాజ్యాలకు (అభివృద్ధి చెందుతున్న దేశాలు-ఆసియా, ఆఫ్రికా) ఆదర్శవంతమైన కార్యక్రమంగా భాసిల్లుతున్నది.

కరీంనగర్ జిల్లా కొడిమ్యాల మండల పరిధిలోని తిర్మాలపూర్ గ్రామంలో ఉల్లెందుల హన్మయ్య ఉపాధి కూలీ కుటుంబం జాబ్ కార్డు నెం. 10015, బలహీన వర్గానికి చెందిన హన్మయ్య ఉపాధి హామీ పథకం ప్రారంభం నుండి ఇప్పటి వరకు దాదాపుగా 1000 పని దినాలు పూర్తి చేసి లక్ష రూపాయలఆదాయాన్ని పొందిన ఉపాధి కూలీ కుటుంబం. ఈ మొత్తాన్ని అతని మాటల్లో - వెచ్చించిన తీరు ఇది!

"సారూ! నేను, నా కుటుంబ సభ్యులు నలుగురు ఉపాధి పథకంలో మొదటి నుండి పని చేస్తున్నాము. మాకు వచ్చిన డబ్బుతో ఇల్లు కట్టుకున్నాము. 5 గుంటల భూమి కొనుక్కున్నాము, మాకున్న 1.5 ఎకరం భూమిలో 30 గుంటలలో ఈ పథకం ద్వారా మామిడి తోట పెట్టుకున్నాము. 30 గుంటలలో వరి పంట పండించుకుంటున్నాము. ఇంట్లో టివి, ఇతర సామానులను కొనుక్కున్నాము. కొడుకులను పై చదువులకు పంపిస్తున్నాము."

రాంసాగర్ గ్రామ పంచాయతీ, శనివారంపేటకు (మదిర) చెందిన శేర్ల గంగారాం జాబ్‌కార్డ్ నెం. 10008, 100 రోజులకు పైగా పని చేసిన ఉపాధి కూలీ కుటుంబం -3.5 ఎకరాల భూమి ఉన్నప్పటికీ సాగు నీటి వసతి లేక భూమి నిరుపయోగంగా ఉంది. కుటుంబ భారం అధికమవడంతో తన కొడుకు అశోక్‌ను గల్ఫ్ దేశానికి పంపించాడు. కాని అప్పులు, ఇల్లు గడవడం కష్టమైంది. ఉపాధి లేక దుర్భర జీవనం గడుపుతున్న గంగారాం కుటుంబానికి ఈ పథకం ద్వారా ఉపాధి భరోసా కల్పించబడింది. ఉపాధి కూలీ కుటుంబంగా పనిచేసుకుంటూ 2008-09 లో ఉపాధి హామీ పథకం ద్వారా సేద్యపు బావి మంజూరీ కావడంతో తనకున్న 2 ఎకరాలలో వరి పంట, 1.5 ఎకరాలలో మొక్కజొన్న పంట పండించుకుంటున్నారు. అతని కుటుంబ అవసరాల ను తీర్చుకుంటూ, ఉత్పాదక శక్తిని పెంపొందిస్తూ, ఆదాయాన్ని సంపాదిస్తూ రెండు పూటల భోజనం చేస్తున్నారు. 100 రోజుల పని పూర్తి చేసిన ఈ ఉపాధి కూలీ కుటుంబం ఈ పథకం ద్వారా ప్రతి ఆర్థిక సంవత్సరంలో రూ. 15,000 నుండి రూ. 20,000 ఆదాయాన్ని జీవన భృతిగా పొందుతున్నారు.

విశ్వవిఖ్యాత ఇంజనీరు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆకాంక్షించిన మాటలు: "సంపాదన శక్తిని, కర్తవ్య పాలనను, కార్యదీక్షతను ప్రజల్లో రేకెత్తించడం ప్రభుత్వ కర్తవ్యం" అన్న వ్యాఖ్యలు ఉపాధి హామీ పథకానికి నిలువెత్తు భాష్యాలు. కొడిమ్యాల మండల పరిధిలో దాదాపు 1000 వలస కుటుంబాలు వలసలు తగ్గించి ఉపాధి హామీతో పని చేసుకుంటూ సకాలంలో వేతనాలు పొందుతూ ఉన్న 'ఊరు కన్నతల్లి'గా జీవనం గడుపుతున్నారు.

## కొడిమ్యాల మండల పరిధిలోని లబ్ధిదారుల ఫలితాలు

మండల పరిధిలో 16 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. ఇందులో 8 వేలకు పైబడి ఉపాధి హామీ కూలీ కుటుంబాలు నమోదు కాబడి ఉన్నాయి.

| | | |
|---|---|---|
| ★ మంజూరైన పనుల సంఖ్య | : | 2975 |
| ★ పనుల విలువ | : | రూ. 46.29 కోట్లు |
| ★ జరుగుతున్న పనుల సంఖ్య | : | 1023 |
| ★ పనుల విలువ | : | రూ. 22.84 కోట్లు |



- ★ షెడ్యూల్డు తెగలకు చెందిన వారి సంఖ్య :566
- ★ వికలాంగుల సంఖ్య (పి.డబ్ల్యు.డి) :36
- ★ మొత్తం పని దినాలు : 9,65,227
- ★ దినసరి సగటు వేతనం :రూ. 97.18
- ★ 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాల సంఖ్య: 2439

| | |
|---|---|
| ★ పూర్తయిన పనుల సంఖ్య | : 1156 |
| ★ పనుల విలువ | : రూ. 10.09 కోట్లు |
| ★ వేతనాలకు వెచ్చించిన మొత్తం | : రూ. 9.37 కోట్లు |
| ★ సామాగ్రి కొరకు వెచ్చించిన మొత్తం | : రూ. 3.39 కోట్లు |
| ★ వేతనాలు పొందిన కుటుంబాల సంఖ్య | : 7,740 |
| ★ వ్యక్తుల సంఖ్య | : 17,279 |
| ★ పురుషులు | : 7,662 |
| ★ స్త్రీలు | : 9,617 |
| ★ షెడ్యూల్డు కులానికి చెందిన వారి సంఖ్య | : 5,427 |

ఇటీవల, ప్రభుత్వం విడుదల చేసిన జి.వో. ఎం.ఎస్.నెం. 244, 245 అమలు చేయడానికి మార్గదర్శకాలు జారీ చేసింది. ఫిక్స్‌డ్ లేబర్ గ్రూప్‌గా 20 మంది కూలీల కలిసి ఒక గ్రూపుగా అవడం లేదా శ్రమశక్తి సంఘాలుగా ఏర్పాటు చేయడం ఒకే తరహా సామాజిక హోదా లేదా పేదరికం ఆధారంగా శ్రమశక్తి సంఘాలను పటిష్ట పరచి ఉపాధి కల్పిస్తూ, బడుగు వర్గాల వనరుల అభివృద్ధికి ముందడుగు వేయడం హర్షించదగ్గ విషయం.

75% వ్యవసాయం మీద ఆధారపడిన గ్రామీణ ప్రాంత బడుగు, బలహీన వర్గాలకు భూమి ప్రాథమికమైనది, అత్యంత జీవనాధారమైంది.

రాబోయే రెండు సంవత్సరాలలోఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఎస్.సి., ఎస్.టి., ఎస్.ఎఫ్., ఎం.ఎఫ్.రైతుల భూమిని ఒక ప్రామాణిక ప్రాజెక్టుగా ఎన్నిక చేయడం, గ్రామ స్థాయిలో 'రైతు క్షేత్ర పాఠశాల' ఏర్పాటు చేయడంఉత్తమం, ప్రామాణికం.

ఈ నాలుగు నంవత్సరాలలో ఉపాధి హామీ పథకం అమలులో కొంతమంది అవినీతిమయంగా, మరికొంత మంది ఉత్తమ సాధనంగా అని వ్యాఖ్యానించటం సర్వసాధారణమైనప్పటికీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు సామాజిక తనిఖీ (సొసైటి ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబిలిటి ట్రాన్స్‌ఫరెసి) ద్వారా అవాంతరాలను నిరోధిస్తూ, పొరపాట్లను అధికమిస్తూ కార్యక్రమాన్ని పారదర్శకతతో అమలు చేస్తూ, గమ్యం వైపు దూసుకువెళ్తోతుంది.




మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అత్యంత ప్రజాదరణ పొందిన చరిత్రాత్మకమైన కార్యక్రమంగా అవతరించి అమలు అవుతున్నది. పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. గ్రామ స్థాయి సిబ్బంది క్షేత్ర, సహాయకుల నుండి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు నిరంతరం కృషి, పట్టుదల అంకిత భావంతో పని చేస్తున్నారనడంలో సందేహం లేదు.

*- శ్రీనివాస్ దుర్గం, అదనపు కార్యక్రమ అధికారి, కొడిమ్యాల మండలం, కరీంనగర్*
*Email ID: cnudurgam@gmail.com, Cell No. 8978775128*

# వలస దేవర

## సుంకోజి దేవేంద్రాచారి

**ఇదే నా చివరి ప్రయాణం. ఇక్కడ ఈ పగలు గడిపి సాయంత్రం బయలుదేరి హైదరాబాద్‌కు వెళ్లానంటే చాలు. అంతటితో నా జీవిత ప్రయాణం అయిపోతుంది. పాతికేళ్లకే నా ప్రయాణానికి ఫుల్‌స్టాప్.**

**నన్ను దింపిన బస్సు దుమ్మురేపుకుంటూ వెళ్లిపోయింది. నాతో పాటు ఐదారుమంది బస్సు దిగారు. పల్లెకు నడక మొదలు పెట్టాను. బస్సురోడ్డు దగ్గరనుంచి పల్లెకు కిలోమీటరు దూరం ఉంటుంది. ఇంకా పూర్తిగా వెలుగు పరచుకోలేదు. ఆగస్టు నెల అయినా వాతావరణం చల్లగా లేదు.**

పల్లెలో అమ్మమ్మ ఉంది. నాకీ పల్లెతో బాల్యస్మృతులు చాలా తక్కువ. అమ్మమ్మ వాళ్ళది వ్యవసాయ కుటుంబం. అమ్మను ఉద్యోగస్తునికి ఇవ్వడం, నాన్నకు ప్రమోషన్లతో స్థాయి పెరగడం, హైదరాబాదుకు చేరడంతో అమ్మమ్మ ఊరికి మా రాకపోకలు తగ్గిపోయాయి. దీనికి తోడు నా చదువు కూడా ఓ కారణం. నా పదేళ్ల వయసులో వచ్చాను. తర్వాత ఇప్పుడే రావడం. పదిహేనేళ్ల క్రితం చూసిన దారులు, పొలాలు, మనుషులు, చెరువులు, పశువులు.. అన్నీ నా కళ్లముందు కదలసాగాయి.

అయితే నా జ్ఞాపకాలను నేనే నమ్మని స్థితి. ఎందుకంటే దారిలో పొలాలన్నీ బీళ్లుగా ఉన్నాయి. ఎక్కడా పచ్చదనం కన్పించడం లేదు. మామూలుగా ఈ నెలలో వేరుశనగ చేలన్నీ పూతతో పసుపుపచ్చగా, ఆకులతో పచ్చగా కళకళలాడుతూ ఉండాలి. అయితే అదృశ్య హస్తం ఏదో గింజలను మొలకెత్తనీయకుండా చేసినట్టు ఒక్క మొక్క కూడా పొలాల్లో లేదు. గతంలో ఉన్న బండిబాట అలాగే ఉంది. దారికి ఇరుపక్కలా అక్కడక్కడా ఉండే పచ్చటి పెద్ద పెద్ద చెట్లుకూడా లేవు. ఏమయ్యాయి?



నాకు కాసేపేమీ అర్థం కాలేదు. అప్పుడప్పుడు పేపర్లలో, టీవీల్లో చూస్తుంటాను. కరువు... ఇదేనా కరువంటే? ఏమో నాకేం తెలుసు? మా ఐ.టీ. రంగంలో మాత్రం కరువు నెలకొంది. ఉన్న ఉద్యోగాలన్నీ పోయాయి. చాలామంది వీధిన పడ్డాం. ఆర్నెల్లయింది. ఇప్పటికీ నిలకడయిన ఉద్యోగం లేదు. ఉద్యోగం వచ్చినా ఉంటుందన్న గ్యారెంటీ లేదు. ఉన్నా మునుపున్నంత జీతం లేదు!

ఒక్కసారిగా జీవితం తలకిందులై పోయింది?

ఐ.టి. రంగాన్ని కలలు కని చదివిన చదువు.

లక్షల రూపాయలను జీతంగా ఆశించి చదివిన చదువు.

ఒక్కసారిగా ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఉద్యోగాలు లేవు..

జీతం లేదు.. జీవితం లేదు.. ఎలా జీవించాలి? ఎందుకు జీవించాలి? నెల రోజులుగా నాలో చెలరేగుతున్న ప్రశ్నలివి? నేను చనిపోవాలని నిర్ణయించుకున్నది కూడా ఇందుకే!

ఉద్యోగం లేనంత మాత్రాన నాకేం తిండికి లోటు లేదు. కానీ నాకే ఇలా ఖాళీగా బతకడానికి ఇష్టం లేదు. అందుకే ఒక్కసారి నా బాలమిత్రులను, బంధువులను అందర్నీ చూసేసి, ఈ లోకానికి గుడ్‌బై చెప్పాలనుకున్నాను. అందర్నీ చూసేశాను. ఇక మిగిలిన ఊరు ఇదొక్కటే.

ఇక్కడ అమ్మమ్మ, మామయ్య, అత్తమ్మ, గోపాల్, తులసి ఉన్నారు. తులసికి పెళ్లయి నాలుగేళ్లయింది. గోపాల్‌కు కూడా పెళ్లయింది. వాడూ నా వయసు వాడే.

దారి చెరువుకట్టపైకి మళ్లింది. చెర్లో కూడా చుక్కనీళ్లు లేవు. చెరువంతా ఏవో పిచ్చిమొక్కలు పెరిగాయి. చెరువుకింద మడికయ్యలన్నీ ఖాళీగాఉన్నాయి.

పల్లె ఇంకా కొంత దూరంలో ఉండగానే పలకల దరువు వినిపించింది. ఆ దరువేమై ఉంటుంది? ఎవరైనా చనిపోయారా? చనిపోవడం అనే

**గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

ఆలోచనే నాలో ఓ గమ్మత్తయిన అనుభూతిని కలిగిస్తోంది. కొన్ని గంటల్లో నా అనుభవంలోకి రాబోతున్న అనుభవం కదా అది.

పల్లెలోకి అడుగుపెట్టాను. పల్లె స్వరూపం ఏం మారలేదు. అప్పటి ఇళ్లే. కొన్ని ఇళ్లకు తాళాలు వేశారు. కొన్ని ఇళ్లు పాతబడ్డాయి.

పల్లె అంతా కోలాహలంగా ఉంది. చాలామంది తమ ఇళ్లముందు తట్టాబుట్టా సర్దుకుని ఉన్నారు. ప్రతి ఇంటిముందూ ఓ గంప ఉంది. దానికి పసుపు కుంకుమ రాశారు. అందులో ఏవో వస్తువులున్నాయి. ఆడవాళ్లందరూ తలస్నానం చేసి, మంచి చీరలు కట్టుకోనున్నారు. ముఖాలకు, చేతులు, కాళ్లకు పసుపు రాశారు. రెండు చేతులనిండుకూ గాజులున్నాయి. నుదుటన పెద్ద కుంకుమబొట్టు. మగవాళ్లు కూడా మంచి బట్టలేసుకుని ఉన్నారు.

ఎవరింట్లోనన్నా శుభకార్యం జరుగుతుందేమో! అయితే అందరూ ఇలా తయారయ్యారా! నాకేం అర్థం కావడం లేదు. పిల్లలు పలకలు కొడుతున్న చోట చేరి ఎగురుతున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారు.

కొందరు నాకు ఎదురు పడ్డారు. నాకయితే వారెవరూ గుర్తు లేరు. వాళ్లకూ నేను గుర్తున్నట్లు లేదు. నావైపు చాలామంది ఆశ్చర్యంగా చూశారు.

బహుశా వాళ్లకు నా వేషధారణ ఆశ్చర్యం కల్గించి ఉంటుంది. నా ఫ్రెంచ్ కట్ గడ్డమూ, త్రీ బై ఫోర్త్ ఫేంటూ, స్లీవ్ లెస్ టీషర్టూ. ఇదీ నా రూపం.

సూర్యోదయమవుతోంది.

''బిన్నే ఇండ్లల్లోనించి ఎలబారండి. పొద్దు పుడతాంది'' ఒకతను అరిచాడు. పలక చప్పుడులో అతని అరుపు కీచుగా ధ్వనించింది.

అమ్మమ్మ ఇంటిముందు కూడా కోలాహలంగా ఉంది. రెండు జెర్సీ ఆవులను పగ్గాలతో పట్టుకుని నిలబడుకుని ఉన్నాడు మామయ్య. మామయ్య కూతురు తులసి కూడా తన భర్త శివతో వచ్చినట్టుంది. గోపాల్ నన్ను గుర్తుపట్టాడు. వాడి కళ్లలో మెరుపు. పరుగున వచ్చి నన్ను కౌగిలించుకున్నంత పని చేశాడు.

''బాగుండావా.?'' అంటూ పలకరించాడు, నా చేతిలోని బ్యాగును తీసుకుంటూ.

మేము రాకపోయినా నాలుగైదేళ్లకోసారయినా వీళ్లొస్తుండటంతో అందరూ నాకు బాగా గుర్తున్నారు. అత్తయ్య, మామయ్య, తులసి, శివ అందరూ పలకరించారు. అమ్మమ్మయితే కళ్ల నీళ్లు పెట్టుకుంది. అమ్మానాన్నల క్షేమసమాచారాలడిగారు.

ఊర్లో వాళ్లందరూ గంపలు నెత్తిన పెట్టుకుని, చాటలు, పరకలు, రోకళ్లు చేతుల్లో పట్టుకుని ఊరుకు తూర్పుగా పోతున్నారు.

''ఏం చేస్తున్నారు?'' అడిగాను గోపాల్‌ను.

''వలసదేవరలే.. బేగు లోపల పెట్టిరా పోదాం'' అన్నాడు మామయ్య.

''స్నానం చేసొస్తాను మామయ్యా. రాత్రంతా బస్సులో వచ్చాను. అనీజీగా ఉంది'' అన్నాను.

''ఆడే చేయచ్చులే రా.. మల్లా రావుకాలం వస్తాదంట... ఒగ జత గుడ్డలు తీసి సంచిలో పెట్టుకో'' అంది అత్తమ్మ.

వాళ్ళు చెప్పినట్టే ఒక జత బట్టలు తీసి ఓ కవర్‌లో ఉంచాను. ఆ కవర్‌ను గోపాల్ చేతిలో పట్టుకున్నాడు. మేం కూడా అందరితోపాటు నడుస్తున్నాం. అందరూ వాళ్లవాళ్ల పశువులను తోలుకుని, సామాన్లు ఎత్తుకుని పోతున్నారు. కొందరివెంట ఒకటి రెండు పొట్టేళ్లున్నాయి. వాటి మెడల్లో వేపాకులున్నాయి. వాటి నుదుటన పసుపుకుంకుమలున్నాయి. కొందరు మగవాళ్ల సంకల్లో కోళ్లున్నాయి.

''ఏంది గోపాలా ఇది'' అన్నాను.

''వానలు పళ్లా కదా.. వలసదేవర చేస్తాండాం'' అన్నాడు గట్టిగా గోపాల్. పలకల చప్పుడులో మాటలు అస్పష్టంగా విన్పిస్తున్నాయి. ముందు వెళుతున్న పలకల బృందంతో పాటు యువకులు కొందరు సినిమా స్టెప్పులేస్తూ పోతున్నారు. మాటలు సరిగా విన్పించడం లేదని మౌనంగా ఉండిపోయాను. గోపాల్ నా చేతిని గట్టిగా పట్టుకుని నడుస్తున్నాడు. వాడి చేయి ఉక్కు కడ్డీలా గట్టిగా ఉంది. పొలం పనులు చేసీ చేసీ అలా ఉందేమో.

ఊరుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే మామిడితోపు వద్దకు పోయి ఆగారందరూ. మేమూ ఒక మామిడిచెట్టుకింద కూర్చున్నాం.

మామిడి తోపు మధ్యలో, ఒక నల్లరాయిని పెట్టారు. దానికి పసుపు కుంకుమలతో బొట్లు పెట్టారు. అక్కడ పొట్టేళ్లను బలి ఇస్తున్నారు. కోళ్లను కోస్తున్నారు.

ఆ పల్లెలో వంద ఇళ్లుంటాయి. దాదాపు అందరి ఇళ్లకు బంధువులు వచ్చారు. బంధువులు ఎక్కువమంది వచ్చిన వారు పొట్టేళ్లను కోస్తున్నారు.

గోపాల్, శివ చెరొక కోడిని తీసుకుని అక్కడకు వెళ్లారు. కోసిన కోళ్లను తీసుకుని ముగ్గురం తోపు చివరకు వచ్చాం. అక్కడున్న బండమీద అప్పటికే కొందరు కోళ్లకు ఈకలు పీకుతున్నారు.

''అక్కడ ఉండేది ఏం దేవుడు'' అడిగాను గోపాల్‌ను.

''వాన దేవుడు'' చెప్పాడు శివ.

''వానలు పళ్లా.. చుట్టూ చూడూ. యాడన్నా పంటలుండాయా? కరువు.. పోయినవారం కప్పదేవర చేసినాం. అయినా వానలు పళ్లా. నిరుడు గూడా కరువే. ఈసారన్నా వానలు బాగా పడాలని వలసదేవర చేస్తాండాం'' అన్నాడు గోపాల్.

మూడేండ్ల ముందు మామయ్య మా ఇంటికొచ్చి, కరువని చెప్పి అమ్మనడిగి పదివేలు డబ్బు తెచ్చుకున్నాడు. ఆ విషయం గుర్తొచ్చింది.

''ఇట్ల చేస్తే వానలు పడతాయా?'' అడిగాను.

''తాత ముత్తాతల కాలంనించీ ఇట్లే చేస్తాండారంట. పెద్దోళ్లు ఏదిగానీ ఊరికే చేయరు. వాళ్లొగ ఆచారం పెట్టిండారంటే దాని ఎనక ఎన్నో అలోచించే ఉంటారు. మా దిక్కు గూడా వానల్లేవు. వచ్చేవోరం వలస దేవర చేయాలంటాన్నేరు. నువ్వూ రావాల్ల. చెప్తాం'' అన్నాడు శివ.

''నేనా.. వస్తాలే'' అన్నాను నవ్వుతూ.

''నవ్వడం కాదబ్బా.. మా పెండ్లయినాంక ఒగసారి కూడా రాలా కదా. ఎప్పుడూ మీ గురించి చెప్తాంటింది తులసి. మేం మట్టి పిసుక్కునేటోళ్లమే అయినా, మాకున్నేకాడికి అరువుగానే పెడతాంలే'' అన్నాడు శివ.

"అయ్యయ్యో. అలా అని ఏం కాదు. మాకు సెలవులుండవని అంతే.. ఈ సారి తప్పకుండా వస్తాలే" మాటిచ్చాను.

రేపు చనిపోతాను.. బతికుంటే కదా, ఇచ్చిన మాట నిలుపుకోవడానికి! మామయ్య ఒక వేపపుల్ల ఇచ్చి "పండ్లు తోము.. పక్కనే రెడ్డేరి బాయి ఉండాది. ఆడ మిషను పోతాండాది. నీళ్లు పోసుకోని వద్దువు" అన్నాడు.




ఎప్పుడో చిన్నప్పుడు ఒకటి రెండు సార్లు వేపపుల్లతో పండ్లు తోమాను. తర్వాత ఎప్పుడూ పుల్లతో పండ్లు తోమే అవకాశం రాలేదు. మామయ్య కూడా వాళ్లతో జతకలిశాడు. కోళ్లకు ఈకలు పెరికారు. పక్కనే ఉండే కొన్ని ఎండుపుల్లలు, ఎండిపోయిన మామిడి ఆకులు తెచ్చి నిప్పు పెట్టారు. ఆ మంటలో కోళ్లను కాసేపు కాల్చారు. తర్వాత వాటిని ముక్కలుగా కోసి అత్తమ్మ దగ్గరకు తీసుకు పోయారు. అంతవరకూ గోపాల్, శివ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నారు.

గోపాల్ ఒక టవల్, సోప్ బాక్స్ తీసుకుని "పోదాం పాండి" అన్నాడు. "రాకరాక వచ్చినాడు... మిసను కాడికి తీసకపోయి సన్నీళ్ల తానం చేపిస్తారా.. కొంచేవుండు నాయనా.. ఈన్నే మీ అత్త ఉడుకుడుకు నీళ్లు పోస్తాది" అంది అమ్మమ్మ.

చుట్టూ ఒకసారి చూశాను. సుమారు ఐదారువందల మంది ఉన్నారు. కొందరు మగవాళ్లు అక్కడే స్నానం చేస్తున్నారు. అంతమంది ముందు స్నానం చేయడమా.. ఓహ్.. తల్చుకుంటేనే ఏదోగా అనిపించింది.

"పర్లేదులే అమ్మమ్మా.. మిషను దగ్గర ఎప్పుడూ స్నానం చేయలా కదా.. అక్కడికే వెళతాను" అన్నాను.

"చన్నీళ్ల స్నానం చేస్తే నీ మనవడికేం కాదులేవ్వా" నవ్వుతూ చెప్పి నా చేయి పట్టుకుని ముందుకు దారితీశాడు గోపాల్. నా బట్టలున్న కవరు తీసుకోవడం మరచిపోలేదు.

మామయ్యవాళ్లకు పదెకరాల చేనుంది. రెండెకరాలు మడి ఉంది. చెరువులో నీళ్లుంటే మడి సాగవుతాది. బావిలో నీళ్లు లేవు. నాలుగు బోర్లేసి అప్పులయిపోయారు. చేన్లో వేరుశనగ పంట పెడతారు. అదీ వర్షం వస్తేనే. సేద్యం చేయాలంటే నీళ్లుండాల. ఎలాంటి నదుల వసతిలేని చిత్తూరు జిల్లాలోని ఓ పల్లె అది. ఇక వర్షం ఒక్కటే దిక్కు. వర్షం సకాలంలో కురవకపోవడంతో పంటల్లేక బాగా అప్పులయిపోయారు.

ఈ వివరాలన్నీ దార్లో చెప్పాడు గోపాల్.

"వర్షం కురిసి, పంటలు బాగా పండింటే నేనూ నీ మాదిరిగా ఇంజనీర్‌ను అయ్యుండు" అన్నాడు.

ఆ మాటలంటున్నప్పుడు గోపాల్ ముఖంలో నవ్వు కనిపించిందేగాని బాధ కనిపించలేదు. ఆశ్చర్యమేసింది.

నేను నవ్వి మౌనంగా ఉండిపోయాను.

"ఊర్లో సుమారుగా పదిండ్లలో వోళ్లు తిరుపతికి, బెంగుళూరుకు ఎళ్లిపోయినారు. అక్కడయితేపేదో ఒగపని చేసుకోని బతుక్కోవచ్చు కదా. అంతో ఇంతో పొలం ఉండేటోళ్లం ఎటూగాకుండా ఈన్నే ఉండాం" అన్నాడు తిరిగి గోపాల్.

"నిజమే... ఈ మధ్యే టీవీలో చూశా.. హైదరాబాద్‌లో కూడా వలస కూలీలు పెరిగిపోయారంట" అన్నాను.

అందరం రెడ్డేరి బాయి దగ్గరకు చేరుకున్నాం. అక్కడ అప్పటికే ఇద్దరు ముగ్గురు మగవాళ్ళు నీళ్లదగ్గర స్నానం చేస్తున్నారు. నేనూ పోయి వాళ్లతో జతకలిశాను. ఎప్పుడూ బాత్‌రూంలో స్నానం చేసే నాకు ఈ అనుభవం కొత్తగా, వింతగా ఉంది, తొమ్మిది గంటలు దాటినట్టుంది. ఎండ చురుగ్గా ఉంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులున్నాయి.

స్నానం చేసి, అక్కడే బట్టలు మార్చుకున్నారు.

రాత్రంతా సరిగా నిద్రపట్టకపోవడం, పైపు దగ్గర నీళ్లలో స్నానం చేయడంతో ఆకలిగా, మత్తుగా ఉంది. తిరిగి మామిడితోపు వద్దకు వెళ్తున్నాం.

"ఎంతసేపూ మా గురించే చెప్తాండా.. ఇయ్యన్నీ మామూలుగా ఉండేటియేలే.. నీ గురించేం చెప్పటేదు.. ఏం చేస్తాండావు.. ఐటీవోళ్లకేం బాగలేదని చెప్తాండారు. చానామందికి ఉద్యోగాలు తీసేస్తాండారంట" అన్నాడు గోపాల్.

"మా వూర్లో 'పిల్లోడు గూడా ఒగడు ఉద్యోగం పోయిందని ఇంటికొచ్చేసినాడు" అంతవరకూ మౌనంగా ఉన్న శివ కలగజేసుకున్నాడు.

మా ఉద్యోగాలు పోతున్న సంగతి అప్పుడే గ్రామాల దాకా పాకిందా అని ఆశ్చర్యపోయాను.

"అవును.. నాక్కూడా ఉద్యోగం పోయింది" అన్నాను మెల్లగా.

"ఆఁ.. చదువుకున్నోళ్లకు ఒగుద్యోగం పోయినా ఇంగో ఉద్యోగం దొరకతాదిలే. బయమేముండాది. మాకట్ల కాదు గదా.. ఈ సేద్యం లేకపోతే. ఇంగేం చేస్తాం మేము?" ప్రశ్నించాడు గోపాల్.

నాకు ఉద్యోగం పోవడం అన్నది వాళ్ల దృష్టిలో పెద్ద సమస్యేకాదు. నిజమే కదా.. వీళ్లకు సేద్యం తప్ప మరో పనేం తెలుసు?

ముగ్గురం మౌనంగా నడుస్తున్నాం. మామిడితోపులోంచి పిల్లల అరుపులు వినిపిస్తున్నాయి. మేమక్కడికి వెళ్లేటప్పటికి కోడికూర చేసి, దోసెలు పోశారు. అందరం తింటుంటే అత్తమ్మ, తులసి వడ్డిస్తున్నారు.

చెట్లకు ఊయలలేశారు. పిల్లలు చాలామంది ఊయలలూగుతున్నారు. కొందరు కోతుల్లాగా చెట్లెక్కి ఆడుకుంటున్నారు. పిల్లలతోపాటు పెద్దవాళ్లు కూడా కొందరు ఊగుతున్నారు. ఆడవాళ్లు పాటలు పాడుతున్నారు. మగవాళ్లు కొందరు మామిడితోపులో ఓ మూల చేరి పులిజూదం ఆడుతున్నారు.

ఇంత కరువుతో..

ఏమీ పండని నేలలో..

వీరందరూ ఇంత ఆనందంగా ఎలా జీవిస్తున్నారు?

అసలు, తమకే తిండికి జరగక ఇబ్బంది పడుతుంటే బంధువులందరినీ ఎందుకు పిలిపించారు? అదే విషయాన్ని అమ్మమ్మతో అన్నాను.

అమ్మమ్మ పకపకా నవ్వింది.

"కష్టాలుండాయని ఏడస్తా కుచ్చోమంటావురా" అంది.

"అదికాదు అమ్మమ్మా.. అసలు ఎలా బతుకుతారు?" అన్నాను.

"ఎట్ల బతికేదేముండాది.. అందరూ ఎట్ల బతకతారో మేమూ అట్లే బతకతాం. వాన నీ చేన్లో కురిసి నా చేన్లో కురవకుండా పోదు కదా.. కురిస్తే ఊర్లో అందరి చేన్లన్లో కురస్తాది. లేకుంటే ఎవురి చేన్లో కురరదు. ఒగూరనే కాదులే నాయనా, మన బందువర్గముండే ఊర్లన్నీ ఇట్లే ఉండాయి. కడప, అనంతపురం దిక్కుగూడా వానల్లేవు.. ఆడా ఇదే బాదలే.. ఇట్లా దేవర్లు చేసుకున్నెప్పుడు అందరికీ చెప్పేది అందుకే.. ఇట్లాటప్పుడు అందరం కలస్తాం కదా.. కష్టసుఖాలు చెప్పుకుంటాం. గుండెల్లో బారం దిగిపోతాది. ఉండేవోడు లేనోడికి సాయం చేస్తాడు. లేనోడు లేనోన్ని చూసి అందరూ నా మాదిరిగానే ఉండార్లే అని బాదపడకుండా ఉంటాడు.. ఇప్పుడు ఈడ తెగతాండే పొట్టేండ్లు, కోస్తాండే కోళ్లు అన్నీ వోళ్ల డబ్బులతో కొన్నోటియనుకుంటా ఉండావా...? కాదు.. నీ యట్లా డబ్బుంటే దయగల మారాజులు అప్పో సప్పో ఇస్తే, తెచ్చుకున్నోటియి" అంది అమ్మమ్మ.



"ఒగసారి సుట్టకారం పొరజూడు" అన్నాడు మామయ్య.

చుట్టూ ఉన్న మనుషులందరినీ ఒకసారి పరిశీలనగా చూశాను. వందల మంది ఉన్నారక్కడ. వర్షంలేదని, పంటల్లేవని, కరువని వలస దేవర వచ్చారు. అయితే ఎవ్వరిలోనూ ఆ దిగుల్లేదు. అందరూ కేరింతలతో గడుపుతున్నారు. వర్షం పడుతుందనే ధీమాతో ఉన్నారు.

మరి నేను-

ఉద్యోగం పోయిందని జీవితంపై విరక్తి పుట్టింది. చనిపోవాలనే నిర్ణయం తీసుకున్నాను. నేను చదివిన చదువుకు ఎక్కడో ఒకచోట కనీసం పదివేలకు తక్కువ కాకుండా జీతంలో ఉద్యోగం వస్తుంది. అసలు నేను ఉద్యోగం చేయకపోయినా నా జీవితానికి సరిపడా అమ్మానాన్న సంపాదించారు.

ఆశించిన ఉద్యోగం దొరికినట్టే దొరికి పోయిందని, సమీప భవిష్యత్తులో కూడా ఆ రంగం ఆశించినట్టు ఉండదని, ఇక జీవించడం వృథా అనుకున్నాను. అమ్మానాన్న కూడా చాలా దిగులు పడ్డారు. నేను అమెరికా ఇప్పట్లో పోలేకపోతున్నందుకు బాధపడ్డారు.

కానీ వీళ్లు..

వీళ్ల పుట్టుక మొదలు మరణించేదాకా, మనిషిలోని అన్ని దశలూ, అన్ని కార్యాలూ సేద్యంపైనే ఆధారపడి ఉన్నాయి. అయినా ఎవ్వరిలోనూ కొంచెం కూడా నిరాశలేదు.

వీళ్లలో ఉన్నది.. ఆశ.. పోరాటం.. రాజీ..!

వర్షం వస్తుందని ఆశతో ఉంటారు.

రాకపోతే వర్షం కోసం తమకు చేతనయినవి చేస్తారు.

వర్షం కురిసినా, కురవకపోయినా..

సకాలంలో కురిసినా, అకాలంలో కురిసినా బెదిరి పోకుండా రాజీ పడిపోతారు.

ఏ మనిషయిన ఆనందంగా జీవించడానికి కావలసింది ఆశ.. పోరాటం..రాజీ..! ప్రతి మనిషిలోనూ ఇవి ఉంటాయి.

మరి నాలో..! ఆ మూడు లక్షణాలు లేనట్టున్నాయి. లేదు లేదు.. ఉన్నాయి. నేనే గుర్తించలేదు..!

తినడం అవుతూనే గోపాల్ మిత్ర బృందంతో కలిసిపోయాను. ఆడాను. పాడాను. రెండు రోజులున్నాను. రెండోరోజు పెద్ద వర్షం కురిసింది. చెట్టూచేమా, కొండాగుట్టా, మనిషీపశువూ తడిసి ముద్దయ్యారు. నేనూ తడిసి ముద్దయ్యాను.

ఆ పల్లె వాసుల్లో ఆనందం రెట్టింపయింది.

వారు రెట్టించిన ఉత్సాహంతో సేద్యం పనుల్లో మునిగి పోయారు. వర్షంలో తడిసి, పిరికితనం కొట్టుకుపోగా మిగిలిన నేను..., మళ్లీ కొత్తగా నా ప్రయాణం మొదలు పెట్టాను. ఇంకా ఎన్నెన్ని అధిగమించాలో, ఎంతదూరం ప్రయాణించాలో!

☆

# రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు

రాష్ట్ర సచివాలయంలో ఆగస్టు 19వ తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య అధ్యక్షతన మంత్రి వర్గ సమావేశం జరిగింది. సమావేశ నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాలు, పర్యాటక శాఖమంత్రి డాక్టర్ శ్రీమతి జె. గీతారెడ్డి మీడియాకు వెల్లడించారు.

తిరుమల తిరుమల దేవస్థానానికి ప్రస్తుతం ఉన్న పాలక మండలి పదవీ కాలం ముగుస్తున్నందున "స్పెసిఫైడ్ అధారిటీ" ప్రత్యేక సాధికార సంస్థ ఏర్పాటు, ప్రతిభావంతులైన 5500 మంది పేద విద్యార్థులకు కార్పోరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కల్పించడం వంటి ప్రధాన నిర్ణయాలు ఈ సమావేశంలో జరిగాయి.

### ఉద్యోగాలు - జనగణన

* సెన్సస్ ఆఫ్ ఇండియా 2011కు సంబంధించి జాతీయ జనాభా రిజిష్టర్లు రూపొందించడానికి వీలుగా అన్ని జిల్లాల్లో 30.6.2011 వరకు 1295 ఉద్యోగ నియామక ఉత్తర్వుల రాటిఫికేషన్
* 26-5-2010న పై తాత్కాలిక ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో 68 సీనియర్ అసిస్టెంట్లు. 1202 జూనియర్ అసిస్టెంట్లు 25 కార్యాలయం సబార్డినేట్స్ / మెసెంజర్ల ఉద్యోగాలు ఉన్నాయి.
* ఇతర శాఖల ఉంచి డెప్యూటేషన్ పై నియామకాలు జరిగాయి.

### ఆర్థిక శాఖ

* ఆర్థిక శాఖలో క్యాష్ మేనేజ్‌మెంట్ సెక్షన్ ఏర్పాటు ప్రతిపాదన ఆమోదం.
* ఒక సెక్షన్ ఆఫీసర్, ఇద్దరు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లను నియమిస్తారు.
* సాలీనా రికరింగ్ వ్యయం రూ. 6.68 లక్షలు

### తిరుమల తిరుపతి దేవస్థానాలు


* తిరుమల తిరుపతి దేవస్థానంలో 7గురు వేద పండితుల నియామక ప్రతిపాదనలు ఆమోదం.
* సాలీనా ఖర్చు రూ. 6.75 లక్షలు

### గిరిజన ఆర్థిక సంస్థ

* రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలోని, 'ట్రైకార్' లో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు ప్రతిపాదనలు ఆమోదం.
* ఈ యూనిట్‌లో ఒక జాయింట్ డైరెక్టర్, ముగ్గురు డైప్యూటీ డైరెక్టర్ల డెప్యుటేషన్ ప్రాతిపదికన నియమిస్తారు.
* సాలీనా ఖర్చు : రూ.20 లక్షలు

### నిఘా విభాగం

* జిఎడి అధీనంలోని విజిలెన్స్ - ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో టాస్క్‌ఫోర్స్‌ను Strenghten చేయడానికి 16 మంది ఇంజనీర్ ఉద్యోగ నియామక ప్రతిపాదనలు ఆమోదం.
* వీరిలో 15 మంది, ఎఇఇలు, ఒక జిఇఇ ఉంటారు.
* సాలీనా ఖర్చు : రూ. 6187 లక్షలు




### వ్యవసాయశాఖ

* రాష్ట్రంలోని 12 జిల్లాల్లో గల జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయాల్లో 12 మంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉద్యోగాల నియామక ప్రతిపాదన ఆమోదం.
* శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, నల్గొండ, ఖమ్మం, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో వీరిని నియమిస్తారు.
* సాలీనా ఖర్చు రూ. 13.64 లక్షలు

### వుడా

* విశాఖపట్టణం అర్బన్ డెవలప్‌మెంట్

ఆధారిటీలో 7గురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ల నియామక ప్రతిపాదన ఆమోదం.

* సాలీనా ఖర్చు : రూ.1.97 లక్షలు

### న్యాయ సేవాధికార సంస్థ


స్టేట్ లీగల్ సర్వీస్ ఆధారిటీలో ఐదు అటెండర్ పోస్టులను డ్రైవర్ పోస్టులుగా మార్పుచేసే ప్రతిపాదనలు ఆమోదం.

### ఫీజుల పునర్వ్యవస్థీకరణ

* రాష్ట్రంలోని ప్రయివేటు అన్‌ఎయిడెడ్ మెడికల్, డెంటల్ అండర్ గ్రాడుయేట్ కోర్సులకు ఫీజ్ రివిజన్ చేస్తూ జారీ అయిన ఉత్తర్వుల రాటిఫికేషన్.
* వివిధ కేటరిరీలలో జరిగిన ఈ ఫీజ్ రివిజన్ 2010 -11, 2011 -12,2012 -13 సంవత్సరాల వరకు అమలులో ఉంటుంది. ఈ మేరకు 20.7.10న ఉత్తర్వులు జారీ చేశారు.
* ప్రతిపాదిత పెంపుదల వల్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఏటా దాదాపు రూ. 3 కోట్ల ఆర్థిక భారం ప్రభుత్వం పై ఉంటుంది.

### న్యాయాధికారులు

* శ్రీ జస్టిస్ ఇ. పద్మభూషణ్ (రిటైర్డ్), రాష్ట్ర న్యాయసేవల ఏకసభ్య కమిషన్ కు సిఫారసు చేసిన వేతన సవరణ, ఫించన్ల ఉత్తర్వులు ఆమోదించడమైంది.
  సివిల్ జడ్జీలు (జూనియర్ డివిజన్), సివిల్ జడ్జీలు (సీనియర్ డివిజన్), జిల్లా జడ్జీల వేతనాలు ఫించన్లకు ఈ సవరణ వర్తిస్తుంది.
* సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు 1.1.2006 నుంచి దీన్ని అమలు చేయాల్సి వుంటుంది.
* దీని వల్ల సాలీనా రూ. 28.15 కోట్లు ఖర్చు అవుతుంది.
* మెట్రిక్ అనంతర స్కాలర్ షిప్‌లు
* బలహీన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రైవేట/ రంగంలోని మంచి కళాశాలలో చేరివించే కొనిసాగించాలి మంత్రుల బృందం చేసిన సిఫారసులు ఆమోదం.
* దీనిలో పాటు ప్రైవేటు రంగ కళాశాలలో పోటీ పడే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రుల బృందం చేసిన సిఫారసుకు ఆమోదం.
* ఈ రెండు అంశాలను "Twin Track approach" గా అమలు చేస్తారు.




* ప్రవేశాలకోసం ఎంపిక చేసే విద్యార్థుల్లో 60 శాతం బాలికలు, 40 శాతం బాలురు ఉంటారు.
* ప్రతి కోటాలో 3 శాతం భౌతికంగా వికలాంగులైన విద్యార్థులకు కేటాయిస్తారు.
* వెల్ఫేర్ హాస్టల్స్, ఆశ్రమ స్కూలు, కెజిబివియస్ నుంచి 50% మందిని; ఏడాదికి రూ. లక్షలోపు తల్లిదండ్రుల ఆదాయం గల ప్రభుత్వ/మున్సిపల్/జిల్లాపరిషత్/ఎయిడెడ్ హైస్కూల్స్ నుంచి 25% మందిని,
* ప్రభుత్వ/వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్స్/జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి 20% శాతం మందిని,
* ట్రైబల్స్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్స్‌లోని ఉత్తమ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన విద్యార్థుల నుంచి 5% విద్యార్థులను ఎంపిక చేస్తారు.
* యస్.సి, యస్.టి, బి.సి, మైనారిటీ వర్గాలకు చెందిన ఈ విద్యార్థులకు అవసరమయ్యే మెట్రిక్ అనంతర స్కాలర్‌షిప్‌ల మంజూరు ప్రతిపాదనలు ఆమోదం.

### డాక్టర్ వై.యస్.ఆర్ మెమోరియల్

* కడప జిల్లాలోని ఇడుపుల పాయ వద్దగల రాజీవ్ విజ్ఞాన్ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి మెమోరియలకు 16.55 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూమిని అభివృద్ధి చేయడానికి రూ. 26 కోట్లు మంజూరు ఆమోదం.
* 16.55 రిజర్వ్ ఫారెస్ట్ భూమికు బదులుగా అడవుల పెంపకానికి అంతే ప్రభుత్వం భూమి కేటాయింపు ప్రతిపాదనల ఆమోదం.

**- అదపాక సత్యారావు**

సమాచార శాఖ అదనపు సంచాలకులు

# పంచాయతీరాజ్ వ్యవస్థ - సేవల వికేంద్రీకరణ

## గుజరాత్ ప్రయోగంపై అధ్యయనం

**గ్రామ స్వరాజ్ ప్రాముఖ్యాన్ని దేశ ప్రజలకు స్పష్టంగా గుర్తు చేసిన వ్యక్తి మహాత్మాగాంధీ. ఆయన గుజరాత్‌లోనే జన్మించిన విషయం తెలిసిందే. బహుశా అందువల్లే కావచ్చు పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులో గుజరాత్ రాష్ట్రం చాలా కాలంగా ప్రథమ స్థానంలో నిలబడుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను రాజ్యాంగబద్ధం చేయడంలో చురుకైన పాత్ర పోషించిన గుజరాత్ సొంతంగా 1993లోనే రాష్ట్ర స్థాయి పంచాయతీరాజ్ వ్యవస్థను చట్టబద్ధంగా స్వీకరించింది.**

అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడానికి, ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడానికీ 29 అంశాలను పంచాయతీరాజ్ సంస్థల పరిధిలోకి తీసుకురావాలని ఆ చట్టంలో స్పష్టంగా నిర్దేశించింది. చట్టంలో ఆశించిన విధంగా 15 అంశాలను పూర్తిగానూ, అయిదు అంశాలను పాక్షికంగానూ పంచాయతీరాజ్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. మిగిలిన తొమ్మిది అంశాల విషయంలో అధికార వికేంద్రీకరణను చేపట్టవలసి వుంది.

ప్రజారోగ్యానికి సంబంధించిన బాధ్యతను పూర్తిగానూ, విద్యకు సంబంధించి పాక్షికంగానూ పంచాయతీరాజ్ సంస్థలకు అప్పగించారు.

విద్యా, వైద్య రంగాలకు సంబంధించిన సేవలను రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పర్యవేక్షించే బాధ్యతను జిల్లా, గ్రామ స్థాయి స్థాయీ సంఘాలు (Standing Commities) నిర్వహిస్తున్నాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అభివృద్ధి, సేవా రంగాలకు అవసరమైన ప్రణాళికలను కూడా జిల్లా/బ్లాకు/గ్రామ సభల స్థాయిలోనే రూపొందిస్తున్నట్లు వారు తెలిపారు. వాటిని అమలు చేయడంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. వాటిని అవగాహన చేసుకోవడానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా సేవారంగాల వికేంద్రీకరణ గురించి కొన్ని అధ్యయనాలు జరిగాయి. వాటిలో కొన్ని ఇక్కడ తప్పక ప్రస్తావించాలి.

### పరిశీలనల సమీక్ష

రెండు అంశాల మీద అధ్యయనం ప్రధానంగా జరిగింది. (1) ప్రాథమిక విద్య (2) మరొకటి సేవరంగాల వికేంద్రీకరణ

ఈ అధ్యయనాల ద్వారా క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి, విద్యా, వైద్య రంగాలలో సేవలను మెరుగుపరచడానికి అనేక సూచనలు అందించడానికి ప్రయత్నించాం. ఈ సూచనల పర్యవసానంగా వచ్చిన మార్పులు, లోటుపాట్లు తెలుసుకోవడానికి తాజా అధ్యయనం చేపట్టాం.

### అధ్యయన లక్ష్యాలు

- ★ గ్రామీణ ప్రజల ఆరోగ్యం, విద్యారంగాల్లో ప్రస్తుత విధానాలు, కార్యక్రమాలు, సంస్థాగత ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించడం.
- ★ ఈ రెండు రంగాల్లో సేవల విస్తరణలో పంచాయతీలు నిర్వహించవలసిన కీలకపాత్రను గుర్తించడం.
- ★ వివిధ స్థాయిల్లో సేవలను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలను సూచించడం.

### పరిశీలించిన అంశాలు

1. వికేంద్రీకరించిన అంశాల గురించిన అవగాహన.
2. ఈ రంగాలలో కీలకపాత్ర పోషించవలసిన గ్రామస్థాయి, స్థాయీ సంఘాల సభ్యులకు, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల అసోసియేషన్ సభ్యులకు అవసరమైన శిక్షణనివ్వడం.
3. ఆయా రంగాలకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పన ప్రక్రియ.
4. ఆయా కమిటీలు, అసోసియేషన్‌లలోని సభ్యుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వివరాలు.
5. అందుబాటులో ఉన్న మౌలిక వసతులు
6. గ్రామీణ ప్రాంతాల్లో వాటి నిర్వహణ గురించిన విధివిధానాలు, కార్యక్రమాలు

### అధ్యయన పరిధి

సామాజిక, మానవ వనరులలో అభివృద్ధి లేదా వెనుకబాటుతనం ఆధారంగా రెండు జిల్లాలను ఎంపిక చేశాం. 252 జిల్లాల్లో రెండు బ్లాకులను, వాటిలో ఒక్కొక్క దానిలో రెండేసి గ్రామపంచాయతీలను గుర్తించాం.

*అనుసరించిన విధానం*

1. ప్రాథమిక సమాచార సేకరణకు మూడు రకాల ప్రశ్నపత్రాలను తయారు చేశాం. జిల్లా పరిషత్‌లు, తాలూకా పంచాయతీల ఛైర్‌పర్సన్‌లు, గ్రామపంచాయతీల అధ్యక్షులు, స్థాయీ సంఘాల అధ్యక్షులు, సభ్యులతో జరిపిన ఇంటర్వ్యూల ద్వారా సమాధానాలు రాబట్టాం. తాలుకా పంచాయతీల స్థాయిలోని స్థాయీ సంఘాలకు ఛైర్‌పర్సన్‌లు లేని కారణంగా వాటిని ప్రశ్నించలేదు. సభ్యుల అభిప్రాయాలు మాత్రమే తీసుకున్నాం. వీరి కోసం ఒకరకం

ప్రశ్నపత్రాన్ని ఉపయోగించాం. మరొకదాన్ని ఆధారం చేసుకుని పంచాయతీరాజ్, విద్యా, ఆరోగ్యం, ఐసీడిఎస్, గ్రామీణనీటి సరఫరా, పారిశుధ్యం శాఖల అధికారుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఉపయోగించాం. గ్రామస్థాయి ప్రజలకోసం మూడు ప్రశ్నపత్రాలు రూపొందించాం. సాధ్యమైన చోట్ల సాధ్యమైనంత వాటిని ఒకచోట చేర్చి వారి ఆలోచనలు గమనించాం.

2. ప్రణాళికా పత్రాలు, నిర్వహణ తీరును సూచించే వివరాలు, ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్లు, ఉత్తర్వులు, ఇంకా ఇతర అధ్యయన నివేదికల సాయంతో మరికొంత సమాచారాన్ని సేకరించాం.




## క్షేత్రస్థాయి సమాచార విశ్లేషణ

సామాన్య ప్రజానీకం, ప్రజా ప్రతినిధులు, పంచాయతీరాజ్, వైద్యరంగాలు, ఐసిడిఎస్, మధ్యాహ్న భోజన పథకం, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రూపొందించుకున్న ఆలోచనలకు దర్పణం ప్రస్తుత అధ్యయనం.

మొత్తం స్పందించిన వారి సంఖ్య 157. వీరిలో ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు, అధికారులు, ఎన్‌జీవోలు కూడా ఉన్నారని తెలుస్తుంది. వీరిలో 28 మంది ఎస్.సిలు, ఒకరు ఎస్.టి, మరో 26 మంది బి.సిలు, 31 మంది ఓసీలు ఉన్నారు. వారి విద్యార్హతలు గమనిస్తే 12 మంది నిరక్షరాస్యులు, 60 మంది ప్రాథమిక స్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు మాత్రమే చదువుకున్న వారు, 36 మంది ఇంటర్మీడియట్ స్థాయి వారు కాగా, డిగ్రీ ఆపై విద్యాభ్యాసం చేసిన వారు 49 మంది ఉన్నారు. వీరిలో ప్రత్యేక నైపుణ్యం ఉన్నవారు కూడా ఉన్నారు.

### *1) ఐసీడిఎస్*

గర్భిణీలకు, అయిదేళ్ళ లోపు పిల్లలకు ప్రీ-స్కూలు సేవలను అందిస్తున్నది. వీటిలో ఆరోగ్య సంరక్షణ, పోషకాహార విలువలపై అవగాహన, విద్యావ్యాప్తి ప్రధాన అంశాలు. పోషకాహారం అందించడంతోపాటు ఆర్థికంగా చేయూతను అందించడానికి వీలుగా మరో రెండు పథకాలను కిషోర్ శక్తి యోజన, బాలికా సమృద్ధి యోచన పేరుతో ఐసీడిఎస్ నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమాల కింద ప్రీస్కూల్ కిట్‌లను అందచేస్తున్నది. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నది. ఆహార పదార్థాలు, వంట సామాగ్రిని సమకూరుస్తున్నది. టాయ్‌లెట్ (మరుగుదొడ్లు) వాడకాన్ని ప్రోత్సహిస్తున్నది. సర్వే రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు సరిచేయడం, వృద్ధి చార్టులను తయారు చేయడం, వెయింగ్ మెషీన్‌లు (తూకపు సామాగ్రిని) అందించడం, కిశోర్ బాలికలకు పుష్టికరమైన ఆహారాన్ని అందించడం వంటి బాధ్యతలను కూడా ఐసీడిస్ నిర్వహిస్తున్నది.

ఐసీడిఎస్ చేపడుతున్న ఈ బాధ్యతల విషయంలో కొన్ని లోటుపాట్లు గమనించవచ్చును. అవి -

- ✯ ప్రజల భాగస్వామ్యం లేదు. పేద ప్రజలు తమ పిల్లలను తమతో పాటే పనిచేసే ప్రాంతాలకు తీసుకెళ్ళిపోవడం ఇందుకు ప్రధాన కారణం.
- ✯ సిబ్బంది కోత
- ✯ సంబంధం లేని విభాగాల నుంచి సిబ్బందిని తరలించడం - ఈ కారణంగా వారిలో ఉత్సాహం, ఆసక్తి కనిపించడం లేదు.
- ✯ కార్యాలయ వసతి లేకపోవడం
- ✯ టాయ్‌లెట్‌ల డిజైన్ ప్రజలకు ఆమోదయోగ్యంగా లేదు. పైగా అద్దెకు తీసుకున్న ఇళ్ళలో వాటి నిర్మాణం సాధ్యం కాదు.
- ✯ బ్యాంకులలో ఖాతాలను సర్పంచ్, సీడీపీవోల ఇద్దరి పేర్ల మీద తీయడం అవసరం. కానీ చాలా గ్రామాలలో బ్యాంకులే లేవు.

### *2) ప్రాథమిక విద్య*

లబ్ధిదారులు/భాగస్వాములు అందించిన సమాచారం ప్రకారం వారి స్వస్థలాలోనే ప్రాథమిక విద్యావకాశాలు ఉన్నాయని 88 శాతం అభిప్రాయపడ్డారు. ఏడు శాతం మంది పాఠశాల చదువుల కోసం తమ నివాస స్థలం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి వస్తోంది. అయిదు శాతం మందికి మూడు కిలోమీటర్ల దూరంలో పాఠశాల సదుపాయం ఉంది. ఇక వైద్య-ఆరోగ్య సేవలు అందించే ఉపకేంద్రం కాని, ప్రజారోగ్య కేంద్రం కాని, వారి స్వగ్రామాలకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. 3.4 శాతం మంది వైద్య ఆరోగ్య సేవల కోసం 39 కిలోమీటర్ల దూరం ప్రయత్నించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలు మధ్యాహ్న భోజన పథకం ద్వారా మాత్రమే భోజన పథకం ద్వారా మాత్రమే తమకు పోషకాహారం లభిస్తున్నదని ప్రతి ఒక్కరూ తెలిపారు. ఉచితంగా పుస్తకాల సరఫరా, ఉపకారవేతనాల ద్వారా విద్యావ్యాప్తికి కొంత ప్రోత్సాహం లభిస్తున్నదని వారంతా అంగీకరించారు. అదే విధంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిలో సాంఘిక సంక్షేమ హాస్టల్ సదుపాయం లేదని ప్రతి ఒక్కరూ అంగీకరించారు. ఫీజుల మినహాయింపు సదుపాయం గురించి తమకు తెలుసునని,

దానిని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నామని 48 శాతం మంది అభిప్రాయపడ్డారు.

గ్రామ ప్రాంతాలలో ఉపాధ్యాయుల శ్రద్ధా, కృషి, సంతృప్తికరంగా ఉంటుంది. నాణ్యమైన విద్యాబోధనను వారు అందిస్తున్నారు. చిన్న పిల్లలకు పోషకాహారం లభిస్తోంది. ఆటపాటలతో వారిలో స్ఫూర్తిని కలిగించగలుగుతున్నారు. ఉపాధ్యాయుల చొరవ కారణంగా గ్రామీణ విద్యార్థులలో అత్యధికులు పంచాయతీరాజ్ పాఠశాలల్లోనే చదువుకుంటున్నారు. తల్లిదండ్రులలో 80 శాతం మంది మాత్రమే తరచు పాఠశాలను సందర్శిస్తున్నారు. ఉపాధ్యాయుల సంఖ్య గురించిన స్పష్టమైన అవగాహన 89 శాతం మందికి ఉంది. టీచర్ల హాజరు సంతృప్తికరంగా ఉందని 93 శాతం మంది అభిప్రాయపడుతున్నారు. బాలికలకు టాయ్‌లెట్ సదుపాయం ఉందని 100 శాతం అంగీకరిస్తుండగా, తాగునీటి సదుపాయం విషయంలో 81.4 శాతం సంతృప్తి వ్యకం చేశారు.

తమ గ్రామాల్లోని పాఠశాలల భవనాలు సురక్షితమైనవేనని 100 శాతం విశ్వసిస్తున్నారు. ప్రతి పాఠశాలలోను తల్లిదండ్రులు, టీచర్ల సంయుక్త అసోసియేషన్‌లు నిర్వహిస్తున్నారని వారంతా అంగీకరించారు. ఈ అసోసియేషన్ చేపట్టే కార్యక్రమాల గురించి 85 శాతం మందికి పూర్తి అవగాహన ఉంది. విద్యార్థులను బడి బాట పట్టించడంలోను, మధ్యాహ్న భోజన పథకం వైపు, విద్యార్థులను ఆకర్షించడంలోను ఈ అసోసియేషన్‌లు చురుకైన పాత్ర నిర్వహిస్తున్నాయి. గ్రామసభలకు నిత్యం వారి శాతం 79గా నిర్ధారణ అయింది.

## విద్యా కమిటీలు - అసోసియేషన్‌లు

గ్రామ సభలలోను, పాఠశాలలోనూ కూడా తల్లిదండ్రులు, టీచర్ల అసోసియేషన్‌లు,

తల్లి - టీచర్ల అసోసియేషన్ (Mother Teachers Association - MTA), తల్లిదండ్రులు్ టీచర్ల అసోసియేషన్ (Parent Teachers Association - PTA) ఇతర ప్రజలు కూడా ప్రాథమికరంగ సమస్యల గురించి, వాటి పరిష్కారాల గురించి విస్తృతంగా చర్చిస్తూనే ఉంటారని గ్రామ విద్యా కమిటీలు (Village Education Committee - VEC) తెలిపాయి. ఈ కమిటీలు నిర్వహించే ప్రధాన కార్యక్రమాలలో ముఖ్యమైనవి కొన్ని. ఇంటింటికీ వెళ్ళి ప్రజలలో చైతన్యం, అవగాహన కలిగించడం, గ్రామాలలోని ప్రతి బాలుడు, బాలిక పాఠశాలలకు వెళ్ళడానికి వీలుగా ప్రవేశ ఉత్సవాలు నిర్వహించడం, సంపూర్ణ అక్షరాస్యత సాధించడం, బాలికల విద్యా ప్రాముఖ్యాన్ని గ్రామంలోని వారందరికీ తెలియచేయడం, విద్యాలక్ష్మి బాండ్లు అందచేయడం ద్వారా వారిని ప్రోత్సాహించడం, అక్షరదీప్ వంటి కార్యక్రమాలపై వారికి అవగాహన కలిగించడం, ఈ కమిటీలలోని సభ్యులకు అంతర్గత సమావేశాలు, సమీక్షా సమావేశాల ద్వారా అవగాహన కలిగించడం తప్ప విడిగా ప్రత్యేక శిక్షణ అంటూ ఏమీ ఇవ్వరు. అందువల్ల వారిలో ప్రత్యేక నైపుణ్యం ఏమీ కనపడడం లేదు. నిర్వహణ పర్యవేక్షణ విషయంలో వారికి తమ బాధ్యతల గురించిన స్పష్టమైన అవగాహన కూడా లేదు. సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) మార్గదర్శకాల ప్రకారం సామాజిక సామర్థ్యం పెంపు అన్నిటికన్న ముఖ్యమని తెలుస్తుంది.

## జిల్లా విద్యా కమిటటీ - అవగాహన

ప్రాథమిక విద్యకు సంబంధించినంత వరకు జిల్లా పంచాయతీకాని, జిల్లా విద్యా కమిటీల (డిఇసి)కు పరిస్థితిని ఎదుర్కొవడానికి అవసరమైన నిర్వహణా పరమైన లేక పాలనాపరమైన అధికారాలు లేవు. తప్పుదారిలో నడుస్తున్న ప్రాథమిక టీచర్‌ను శిక్షించడానికి కాని, వారిని బదిలీ చేయడానికి కానీ వారిక ఎలాంటి అధికారాలు లేవు. జిల్లాలో టీచర్ పోస్టులు చాలా ఉన్నాయి. అవన్నీ ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయడానికి కూడా డిఇసిలకు అధికారం లేదు. టీచర్ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రక్రియలో వారి ప్రమేయం ఏమీ ఉండదు. అంతేకాదు, జిల్లా ప్రాథమిక విద్యాధికారి (డిపిఇవో) పై వారికి ఎలాంటి పర్యవేక్షణాధికారం ఉండదు.

ప్రాథమిక విద్యారంగంలో పంచాయతీలకు అధికార వికేంద్రీకరణ విషయంలో అహ్మదాబాద్ డిఇసి మాజీ చైర్మన్ డాక్టర్ మఫత్‌లాల్ పటేల్ ఈ విధమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

"పాలనాపరమైన బాధ్యతలన్నీ రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండడం, ఎన్నికైన పంచాయతీ సంస్థలకున్న పరిమితి పాత్ర కారణంగా ఈ జిల్లా విద్యాకమిటీలను రద్దు చేసేయడం లేదా, వాటికి అవసరమైన అధికారాలు, అప్పగించడమో చాలా అవసరం. ప్రాథమిక విద్యకు సంబంధించిన అధికారాలను జిల్లా పంచాయతీలకు అప్పగించినప్పుడే వినూత్నమైన మార్పులు చోటు చేసుకుంటాయి. తాలూకా, బ్లాక్, జిల్లా స్థాయిలో ఉన్న పంచాయతీలకు రాష్ట్ర స్థాయి విద్యాకమిటీ (ఎస్ఇసి) కార్యకలాపాలలో ఎలాంటి భాగస్వామ్యం ఉండదు."

## ప్రాథమిక విద్యా శాఖ అధికారుల అభిప్రాయం

సర్వశిక్షా అభియాన్, బాలికల ప్రాథమిక విద్యావ్యాప్తి జాతీయ కార్యక్రమం (National Programme for Education of Girls at Elementary Level - NPEGEL), కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పరిధిలో ఉండే ప్రాథమిక విద్యాశాఖకు చెందిన రాష్ట్ర, జిల్లా, బ్లాక్, గ్రామస్థాయి అధికారుల అభిప్రాయం ఇలా ఉంది. ప్రస్తుతం బాలికల విద్యావ్యాప్తికిఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేయడం, ఉపకార వేతనాలు, యూనిఫారంల ను ఎస్‌సీ, ఎస్టీ, బిసీ విద్యార్థులకు అందించడం, మధ్యాహ్న భోజన సదుపాయం సమకూర్చడం, బ్రిడ్జి స్కూళ్ళు, విద్యాదీప్ పేరుతో వారికి బీమా సౌకర్యం ఇవ్వడం, ఆడపిల్లలకు విద్యాలక్ష్మి బాండ్లు మంజూరు చేయడం, పాఠశాలలకు వెలుపల ఉన్న 14 ఏళ్ళ లోపు వారి కోసం ప్రత్యామ్నాయ స్కూళ్ళు ఏర్పాటు చేయడం వంటివి అమలు చేస్తున్నాం. ఈ ప్రత్యామ్నాయ పాఠశాలల కార్యక్రమాల కింద పాఠశాలల్లో కొత్త వారిని చేర్చడంతో పాటు బడులను మధ్యలోనే వదిలివేసిన వారికి అవకాశం కల్పిస్తారు.

పరీక్షల్లో ఫెయిలైన వారికోసం బ్రిడ్జి స్కూళ్ళు ఏర్పాటవుతున్నాయి. ప్రత్యామ్నాయ పాఠశాలలకు నియమించే ఉపాధ్యాయులకు 1000 రూపాయల నెలసరి వేతనం చెల్లిస్తున్నారు. విద్యార్థులకు బ్రిడ్జి కోర్సును బోధించడంతో పాటు కంప్యూటర్ విద్యను బోధిస్తారు. ఇది కాక, సర్వ శిక్షా అభియాన్ కింద బాలికలకు, తల్లులకు, వికలాంగులకు

కూడా వారికి అవసరమైన అంశాలను బోధించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కొత్తగా తరగతి గదులను నిర్మించడం, ఇప్పుడున్న తరగతి గదులకు మరమ్మతులు చేయడం, టాయిలెట్లు, ప్రహరీ గోడల నిర్మాణం, ఎండిఎం గదులను నిర్మించడం, తాగునీటి వసతిని మెరుగుపరచడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

విస్తృత ప్రాతిపదికన సామాజిక చైతన్యం కలిగించడానికి కూడా అనేక రకాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పిల్లలను, వారి తల్లులను కూడా పర్యటనలకు తీసుకువెళ్ళడం, ప్రవేశ్ ఉత్సవ్ (విద్యాభ్యాస ఆరంభం) కార్యక్రమాలను ప్రోత్సహించడానికి రథయాత్రలు నిర్వహించడం, పిల్లలను పాఠశాలల వైపు ఆకర్షించడానికి గాలిపటాలను ఎగురవేసే పోటీలు నిర్వహించడం, గ్రామ సభలలో ఈ అంశాన్ని చర్చించడం, అసోసియేషన్‌లు, కమిటీల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ జరపడం వంటివి కొన్ని. ఇవికాక, గ్రామ ప్రాంతాలలో తోలు బొమ్మలాటలు, తల్లిదండ్రులకు పిల్లలే చదువు నేర్పడం, కన్యాకేలావని యాత్ర కార్యక్రమం చేపట్టడం నిత్య కార్యక్రమాలుగా మారాయి. ఈ కార్యక్రమాల ద్వారా మూడు రోజుల వ్యవధిలో 15 గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలను, బాలికలను కలిసి నచ్చ చెప్పాల్సి ఉంటుంది. ఇందులో రాష్ట్ర స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొంటారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నుంచి గ్రామస్థాయి కార్యదర్శి వరకు అందరు అధికారులు భాగస్వాములవుతారు. సహజంగా ఇలాంటి కార్యక్రమాలను విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయంలో నిర్వహిస్తూ ఉంటారు. ఆ రకంగా తమ పిల్లలను పాఠశాలకు పంపించేలా తల్లిదండ్రులను వారు ప్రోత్సహిస్తామన్నారు.

ఈ కార్యక్రమాలన్నిటి నిర్వహణకు సంబంధించిన ప్రణాళికను వికేంద్రీకరించడానికి ప్రజలను, ప్రజాప్రతినిధులను, అసోసియేషన్‌లను భాగస్థులను చేస్తున్నారు. ప్రాథమిక విద్యాశాఖ అధికారులు, టీచర్లు, జిల్లాపరిషత్ పరిధిలోకి వస్తారు. వాస్తవానికి వారి నియామక అధికారాలు రాష్ట్ర విద్యాశాఖ అధీనంలో ఉంటుంది. వారి వేతనాలను జిల్లా పరిషత్ చెల్లిస్తుంది. అందువల్ల వారు జిల్లా పరిషత్‌ల బాధ్యత వహించాల్సి ఉంటుంది. వారి గురించి కాన్ఫిడెన్షియల్ రిపోర్టులను జిల్లా విస్తరణాధికారి (District Development Officer) ఇస్తారు.

అధికారుల అభిప్రాయంలో ప్రాథమిక స్థాయి విద్యా పర్యవేక్షణకు సమర్థమైన వ్యవస్థే ఏర్పాటయింది. ఈ వ్యవస్థలో గ్రామస్థాయి విద్యాకమిటీలు, తల్లిదండ్రులు - టీచర్ల అసోసియేషన్ పర్యవేక్షిస్తాయి. ఇవికాక క్లస్టర్ రిసోర్స్ కోఆర్డినేటర్లు పదేసి పాఠశాలలపై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు. బ్లాక్‌స్థాయిలో బ్లాక్ రిసోర్స్ కోఆర్డినేటర్, జిల్లా ప్రాథమిక విద్యా అధికారి, రాష్ట్రస్థాయి రిసోర్స్ గ్రూప్ సభ్యులు, రాష్ట్ర ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌లు కూడా పర్యవేక్షణ చేస్తారు.

*ప్రాథమిక విద్యావ్యాప్తి కార్యక్రమాలలో ముఖ్యమైన అంశాలు:*

- ✯ ఆరంభంలో సామాజిక చైతన్యం కలిగించడం పెద్ద సమస్యగా ఉండేది. క్రమంగా రాజకీయ నాయకులు, అధికారులు, రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు బాధ్యత తీసుకోవడంతో ఈ సమస్య పరిష్కారమైంది. నూటికి నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ సాధనకు (విద్యార్థులను బడుల్లో చేర్చడం), రిటెన్షన్ (పాఠశాలల నుంచి మధ్యలో విద్యార్థులు చదువులు ఆపివేయకుండా) కాపాడడంలోను ఫలితాలు సాధించగలిగారు.
- ✯ ఉపాధ్యాయులను విద్యాబోధన విధులకు మాత్రమే కాకుండా ఇతర విధులను నిర్వహించడానికి వినియోగించడం మరో సమస్య.
- ✯ క్లస్టర్ రిసోర్స్ సెంటర్‌లు, బ్లాక్ రిసోర్స్ సెంటర్‌లకు భవనవసతి కొరత.
- ✯ సిబ్బందికి శిక్షణ సదుపాయం లేకపోవడం, జిల్లాస్థాయిలో వారికి నిర్వహించే పునశ్చరణ తరగతులు, రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయిలోని సర్వశిక్షా అభియాన్ అధికారుల మార్గదర్శకాలు మాత్రమే వారికి ఆధారంగా నిలిచాయి.



- ✯ సర్వ శిక్షా అభియాన్ నిర్వహణలో కార్యక్రమాల గురించి సరైన సమాచారం లేకపోవడం.
- ✯ వజ్రాల నగిషీ పరిశ్రమలలో చిన్నపిల్లలకు అవకాశాలు ఎక్కువగా ఉండడంతో వారిని అటు నుంచి ఆదాయ వనరుగా కాకుండా బడికేసి మళ్ళించడం సమస్యగా తయారైంది.

## మధ్యాహ్న భోజన పథకం

ఈ కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర స్థాయి అసిస్టెంట్ కమీషనర్‌ను, సురేంద్రనగర్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ (ఈ పథకం పర్యవేక్షణ)ను సంప్రదించాము. వారు పంచాయతీరాజ్ పరిధిలోకి రారు. రెవెన్యూ విభాగం పరిధిలో ఉంటారు.

వారి పర్యవేక్షణలో మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాల విద్యార్థులకు వర్తింప చేయటం, అలాగే ఎస్‌టి తల్లిదండ్రులకు పిల్లల కోసం ఆహారపదార్థాలు అందించడం అన్న రెండు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. నిజానికి వారికి మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. సెమినార్లు, సమీక్ష సమావేశాలు, అంతర్గత సమావేశాలకు హాజరయ్యే వారు అంతే. అయినా ఈ కార్యక్రమం గురించి మధ్యాహ్న భోజన కేంద్రాల వద్ద నిర్వహించే సమావేశాలలో తల్లిదండ్రులను చైతన్య పరచడానికి వారు ప్రయత్నిస్తున్నారు. ఈ సమావేశాలకు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారు.

ఈ కార్యక్రమం పర్యవేక్షణ బాధ్యతలను రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖ అధికారులతో పాటు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ చేపడుతున్నారు. ముఖ్యంగా పరిశుభ్రత, నాణ్యత, పుష్టికరమైన ఆహారాన్ని అందించే విషయంలో వారు శ్రద్ధ తీసుకుంటున్నారు. వడ్డన బాధ్యతలను ఉపాధ్యాయుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆయన ఇచ్చే ధృవీకరణ ఆధారంగానే పిల్లలకు అందించిన ఆహారానికి చెల్లింపులు జరుగుతాయి.

దీని నిర్వహణలో ఎదురైన సమస్యలు ప్రధానంగా... విద్యాశాఖ భాగస్వామ్యం సంతృప్తికరంగా లేదు. అందుకు కారణం ఈ పథకం బాధ్యత రెవెన్యూ అధికారులదేనని వారి ఉద్దేశ్యం. అదే సమయంలో రెవెన్యూ శాఖ కూడా పూర్తి బాధ్యతలు తీసుకోలేకపోతోంది. ఎందుకంటే రెవెన్యూ వసూళ్ళు, వైపరీత్యాల వల్ల ఎదురయ్యే సమస్యలు, ఎన్నికలు వంటి ఇతర బాధ్యతలను వారే నిర్వహించాల్సి ఉంటుంది. 2) వంటశాలలు లేకపోవడం మరో సమస్య. 900 పాఠశాలలు జిల్లాలో ఉండగా, వాటిలో 400 పాఠశాలలకు మాత్రమే వంటశాలలు ఉన్నాయని సురేంద్రనగర్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ తెలియచేశారు. మిగిలిన 500 పాఠశాలలకు వంటశాలల సదుపాయం కల్పించాల్సి ఉంది. 3) మధ్యాహ్న భోజనం తయారుచేసే వంటవారికి చెల్లించే వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఆర్గనైజర్‌కు 500 రూపాయలు, వంట వారికి 250 రూపాయలు, సహాయకుడికి 175 రూపాయలు లభిస్తాయి. ఇవి కనీస వేతనం కంటే తక్కువే.

ఈ సమస్యలను పరిష్కరించడానికి కొన్ని సూచనలు. 1) విద్యాశాఖ పర్యవేక్షణ బాధ్యత చేపట్టాలి 2) వంట చేసే వారికి వేతనాలు పెంచాలి.

## గ్రామీణ ఆరోగ్యం - పారిశుద్ధ్య కమిటీ

గ్రామ సభలకు హాజరయ్యే 79 శాతం ప్రజలలో 74.4 శాతం మంది మాత్రమే ఈ రెండు సమస్యలను ప్రస్తావిస్తుంటారు. గ్రామ పంచాయతీలలో 44 శాతం మంది తమ పిల్లలను సార్వత్రిక ప్రాథమిక విద్యావ్యాప్తికి ప్రోత్సహిస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, (PHC) సబ్ సెంటర్ (ఆరోగ్య)ల గురించి అందరికీ తెలుసు. కాని వారిలో 63 శాతం మాత్రమే గడచిన మూడు నెలల కాలంలో వాటిని సందర్శించి అక్కడ లభించే వైద్య సేవల ప్రయోజనాలను అందుకున్నారు. చిన్న చిన్న వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక చికిత్స, ఆరోగ్య సంరక్షణపై అవగాహన, కుటుంబ సంక్షేమ సలహా సూచనలు, చికిత్సలు సాధారణంగా ఈ కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయి. గడచిన మూడు నెలల కాలంలో కేవలం అయిదుగురు మాత్రమే జ్వరం తగ్గించుకోవడానికి ఈ కేంద్రాలను సందర్శించారు.

డయేరియా చికిత్స కోసం 28 మంది, చిన్నచిన్న గ్రామాలలో ఉన్న వాళ్ళు 19 మంది, విరేచనాల (Dysentry) చికిత్స కోసం 9 మంది, టిబి (క్షయ) చికిత్స కోసం అయిదుగురు, నొప్పుల నివారణ కోసం ఎనిమిది మంది, చెవి, గొంతు, ముక్కు వ్యాధుల బాధితులు ఎనిమిది మంది, మలేరియా బాధితులు 31 మంది, చర్మ వ్యాధులలో నలుగురు, ఆర్‌సిహెచ్ సేవల కోసం నలుగురు వచ్చారు. ఈ కేంద్రాలను అధికారులు, ముఖ్యంగా ఎంపీహెచ్ డబ్ల్యు, మహిళా ఆరోగ్య పర్యవేక్షకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేటర్ గడచిన మూడు నెలల్లో ఒక్కసారి కూడా సందర్శించలేదని 88 శాతం మంది చెప్పారు. మెడికల్ ఆఫీసర్ వచ్చినట్లు చెప్పిన వారు 23 శాతం మాత్రమే. ఈ వైద్య కేంద్రాలకు వెళ్ళకపోవడానికి అత్యధికులు చెప్పిన కారణాలు: డాక్టర్‌లను నియమించలేదు. మహిళా డాక్టర్‌లు లేరు. నియమించిన వైద్యులు కూడా ఎప్పుడూ అందుబాటులో ఉండడం లేదు. ఎప్పుడు వస్తారో తెలియదు. మందులు ఉండవు. వైద్య కేంద్రాలలో పరిస్థితులు అధ్వానంగా ఉంటాయి. అవి పనిచేసే వేళలు తమకు అనువుగా ఉండడం లేదు. నర్సింగ్ సిబ్బంది ఉండరు. అక్కడికి వెళ్ళడానికి సరైన రవాణా సదుపాయం లేదు. లాబ్ టెక్నీషియన్ ఉండడం లేదని 95 శాతం మంది చెప్పారు. ఎఎన్‌ఎం అందుబాటుపై 47 శాతం మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరు అంగీకరించిన మరో విషయం... ఫార్మసిస్టులు లేరు. 77 శాతం మంది మందులు అక్కడ లభించవని చెప్పారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (National Rural Health Mission - NHRM) కింద ప్రతి గ్రామపంచాయతీకి ఏటా రూ. 10,000ను గ్రామీణ గర్భిణీల అత్యవసర సేవల కోసం సమకూరుస్తున్నది. గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్త (Accredited social Health Activist - ASHA) లు లేరని 93 శాతం మంది తెలిపారు. జాతీయ స్థాయిలో గ్రామీణ ఆరోగ్య సంరక్షణకు ఒక కార్యక్రమం ఉన్నట్లు తమకు తెలియదని 95 శాతం మంది అంగీకరించారు.

పారిశుద్ధ్య సేవల గురించి ప్రశ్నిస్తే 92 శాతం మంది గ్రామపంచాయతీలే తాగునీటిని శుద్ధి చేయడానికి క్లోరిన్ ఉపయోగిస్తున్నామని చెప్పారు. 85 శాతం మంది డిడిటి పౌడర్ చల్లుతున్నారన్నారు. మరో 95 శాతం మంది రోడ్లను శుభ్రం చేస్తున్న తీరుపై, చెత్త తొలగింపుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మురికి కాలువలను గ్రామపంచాయతీలు శుభ్రం చేస్తున్నాయని 95 శాతం గుర్తించారు. కమిటీల సహాయంతో, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని జాగ్రత్తగానే కాపాడుతున్నారని 83 శాతం మంది అభిప్రాయపడ్డారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ ఆరోగ్య పర్యవేక్షణ కమిటీ పని చేస్తున్న విషయాన్ని 93 శాతం మంది గమనించారు. ఈ కమిటీలు నెలకోసారి సమావేశమవుతున్నాయి. సబ్‌సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య

కేంద్రాలలో వ్యాధి నివారణ చర్యలను చేపడుతున్నాయా లేదా, గ్రామంలో పారిశుద్ధ్యం సంతృప్తికరంగా ఉందా లేదా అన్న అంశాలను కమిటీ పర్యవేక్షించాలి. ఇలాంటి కమిటీ ఒకటి ఉందని తెలుసునని 80 శాతం అంగీకరించారు. వాటి ఏర్పాటు గురించి కూడా తెలుసునని వారు ఒప్పుకున్నారు. ఆ కమిటీలు సమావేశమవుతున్న విషయం 69 శాతం మందికి తెలుసు. అలాగే ఆ కమిటీల కార్యకలాపాల గురించిన అవగాహన 47 శాతం మందికి మాత్రమేఉంది.

### ఆరోగ్యం -పారిశుద్ధ్యం కమిటీ స్వరూపం

ఈ విషయంపై స్పందించిన ఎనిమిది మంది అభిప్రాయాలలోనూ ఇవి పంచాయతీరాజ్ సంస్థల పరిధిలోనే వస్తాయని వ్యక్తమయింది. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి సదుపాయం ఉందని, మొక్కలు, చెట్లు సమృద్ధిగా ప్రతి ఇంట్లో ఉండాలని వారంతా ఆశిస్తున్నారు. కుటుంబ సంక్షేమం, వ్యాధి నిరోధక కార్యక్రమాలు, కుటుంబ సంక్షేమ పథకాలు, పారిశుద్ధ్యం, మురికినీటి పారుదల వంటివి ఈ కమిటీల పర్యవేక్షణలో ఉండాలని వారు భావిస్తున్నారు. నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించుకోవడానికి కమిటీ మూడు నెలకొకసారి సమావేశమవుతుంది. ఈ సమావేశాలతో పాటు గ్రామ సభలలో కూడా వాటిపై సమగ్రంగా చర్చిస్తుంది. ప్రజలను చైతన్యపరచి, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వ్యాధుల వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగస్వాములను చేయడానికి పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తుంది.

ప్రభుత్వ ఆర్థిక సహాయంతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుంది. గ్రామంలో అపరిశుభ్రతకు, పారిశుద్ధ్య లోపానికి కారకులైన వారికి నోటీసులు జారీ చేస్తుంది. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం వాస్తవానికి ఏ మూలకూ సరిపోదు. అందువల్ల ప్రజల నుంచి కూడా ఆర్థిక చేయూతను స్వీకరిస్తుంది.

ఆరోగ్యం, పారిశుధ్యం గురించి జిల్లా పరిషత్‌లు, తాలుకా పంచాయతీలు కూడా పర్యవేక్షిస్తూ ఉంటాయి. ఈ సందర్భంలో వెల్లడైన సమస్యల్లో ముఖ్యమైనది... ఆసుపత్రులకు వెళ్ళడానికి మూఢనమ్మకాలు అడ్డంకిగా మారుతున్నాయి. ఆ కారణంగానే మరుగుదొడ్ల నిర్మాణానికి కూడా ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపడం లేదు. నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రజల సహకారం పూర్తిగా లభించడం లేదు. వీటి పరిష్కారానికిగాను ఆసుపత్రులకు ఆధునిక పరికరాలను అందించాలి. సెప్టిక్‌ట్యాంకుల నిర్మాణం చేపట్టాలి.

### ప్రాథమిక ఆరోగ్యశాఖ అధికారులు

ప్రాథమిక స్థాయి ఆరోగ్య పరిరక్షణ ప్రధానంగా జిల్లాపరిషత్ పరిధిలోకి వస్తుంది. వారికి జిల్లా హెల్త్ సొసైటీ సలహాలు, సూచనలిస్తుంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ వారిని నియమిస్తుంది. కాని పంచాయతీరాజ్ పరిధిలో పని చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి, అంతకంటే తక్కువ స్థాయిలో పంచాయతీరాజ్ పరిధిలోని వైద్య సిబ్బంది వేతనాలను జిల్లా పరిషత్ చెల్లిస్తుంది. అందువల్ల వారు జెడ్‌పికే బాధ్యత వహించాల్సి ఉంటుంది. వారికి సంబంధించిన కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్‌లను జిల్లా విస్తరణాధికారి (డిడిఒ) తయారు చేస్తారు. ఆయన సలహాలు సూచనలను పాటిస్తారని జిల్లా వైద్యాధికారి చెప్పారు. గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించే లక్ష్యంతో చేపట్టిన కొన్ని కార్యక్రమాలు -జాతీయ గ్రామీణ ఆరోగ్యమిషన్, ఆర్‌సిహెచ్ 2, కుటుంబ సంక్షేమం, ఆర్ అండ్ టిబి, కుష్టు నివారణ, ఎంసిహెచ్, శిశు ఆరోగ్యం, పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం, మలేరియా నివారణ, వ్యాధుల నివారణ చికిత్సలు, ఆరోగ్య సమాచార కార్యక్రమాలు, చిరంజీవి యోజన, జన సురక్ష యోజన, 1994 నాటి పిఎన్‌డిటి చట్టం అమలులో ఉన్నాయని వైద్యాధికారి వివరించారు.

ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కలిగించేందుకు గాను కరపత్రాలు, పోస్టర్లు, హోర్డింగ్స్, మతనాయకులతో సమావేశాలు, ప్రజాప్రతినిధుల సహకారం, ఆరోగ్యమేళాలు, వ్యాధి నిర్ధారణ శిబిరాలు, విద్యార్థులను భాగస్వాములను చేయడం, స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వాస్థ సంఘాల సహకారం తీసుకుంటున్నారు. జిల్లా, తాలుకా, పంచాయతీరాజ్ స్థాయిలలో సమాచార ప్రచారాలను, కమ్యూనికేషన్ ఏర్పాట్లు చేయడానికి ప్రత్యేకంగా ఒక అధికారి ఉంటారు. ఈ కార్యక్రమాల అమలు తీరును గ్రామపంచాయతీ స్థాయిలో స్త్రీ, పురుష ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో మెడికల్ ఆఫీసర్, బ్లాక్ స్థాయిలో తాలూకా ఆరోగ్య అధికారి, జిల్లా స్థాయిలో జిల్లా ఆరోగ్యశాఖాధికారి,

## గెలుపు గులామంటుంది

'శిశిరం' వెంటనే 'వసంతం'
'తిమిరం' తరువాత 'తేజస్సు'
కాలక్రమంలో క్రమం తప్పకుండా వస్తాయి
అందుకే,
కష్టాలు కలకాలం కాపురముండవని
మనసుపెట్టి శ్రమపడితే
ప్రతిమనిషీ ఓ మనీషి కాగలడు.
తనకు తెలివితేటలు లేవని
అంతా తన తలరాత అని నిట్టూర్చక
మేలైన ఆలోచనలతో మేథస్సుకు పదునుపెడితే
మేరుపర్వతమంత ఎత్తుకు ఎదగొచ్చు.
అబ్రహాంలింకన్ అమాంతం ఒక్క రోజులో
అమెరికా అధ్యక్షుడైపోలేదు.
ఆర్మ్‌స్ట్రాంగా ఒక్క గెంతులోనే
అందాల చందమామను అందుకోలేదు.
ప్రపంచప్రఖ్యాత మేథావులంతా
నిద్రాహారాలు మాని నిరంతర శ్రమతోనే
అంతటివారు కాగలిగారనే వాస్తవాన్ని గ్రహించి
పట్టుదలతో పట్టువదలని విక్రమార్కుడిలా
ఫలితం అందేదాకా ప్రయత్నిస్తే
ఓటమనేది ఓడిపోయి తలవంచుతుంది
గెలుపు నీకు గులామంటూ సలాం చేస్తుంది

**- డా|| వి. రాజేంద్రప్రసాద్,**
*రీజనల్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రాజమండ్రి*

పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు. వీరికి తోడుగా జిల్లా హెల్త్ సొసైటీ, జిల్లా పరిషత్ చైర్మన్ ఆధ్వర్యంలోని జిల్లా హెల్త్ మిషన్ పర్యవేక్షిస్తూ ఉంటాయి. నిర్వహణాపరమైన సమాచారాన్ని కంప్యూటరైజ్ చేయడానికి కచ్చితమైన వ్యవస్థ చురుగ్గా పనిచేస్తూ ఉంది. వాటికి నెట్ సదుపాయం కూడా ఇవ్వడంలో ఏ సమయంలోనైనా ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించే అవకాశం ఏర్పడుతోంది.

క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలు బహిర్గతమయ్యాయి. ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి తగినంత ఆర్థిక వనరులు లేవు. సిబ్బంది, మందుల కొరతతోపాటు, ఇప్పుడు పని చేస్తున్న సిబ్బంది కూడా పనిచేస్తున్న ప్రాంతాల్లో నివసించడం లేదు. ఈ కారణంగా వారి నుంచి పూర్తి స్థాయి సేవలు అందించడలేకపోతున్నారు. అసలే పరిమితంగా ఉన్న సిబ్బందిపై పనిభారం ఎక్కువగా ఉండడం కూడా ఒక సమస్యగా తయారైంది. ప్రజారోగ్యాన్ని పటిష్టంగా కాపాడేందుకు ఆరోగ్య కేంద్రాల నిర్మాణం తప్పనిసరి. అవసరమైనంత మందిని నియమించాలి. మందులు, పరికరాలు సమృద్ధిగా సమకూర్చాలి. క్షేత్రస్థాయిలో నిత్యం తిరుగుతూ సేవలందించాల్సిన సిబ్బందికి సొంత వాహనాలు కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయం అందించాలి.

ఆర్‌సిహెచ్2 కు చెందిన ఇద్దరు జిల్లా స్థాయి కో-ఆర్డినేటర్‌ల అభిప్రాయాలను కూడా సేకరించాము. వారు ఆర్‌సిహెచ్-2 కార్యక్రమంతో పాటు ఎన్ఆర్‌హెచ్ఎం-5 పనులను కూడా అమలు చేస్తుంటారు.

గ్రామ ఆరోగ్య కమిటీ పేర సర్పంచ్, ఎఎన్ఎంల సంయుక్త ఖాతాలోకి ప్రతి గ్రామంలోని సబ్‌సెంటర్‌కు 10000 రూపాయల మొత్తాన్ని డిపాజిట్లు చేస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో సివిల్ పనులు, శుచి శుభ్రతల నిర్వహణకు రూ. 25,000 జమ చేస్తారు. ఈ మొత్తాన్ని అవసరమైన పరికరాలు, సామాగ్రి, కాంపాక్ట్‌మైక్‌లు, రికార్డులు, కంప్యూటర్, ఫ్యాక్స్ జిరాక్స్ యంత్రాల కొనుగోలుకు కూడా ఉపయోగించవచ్చు. పంచాయతీరాజ్ పరిధిలో ఉండే ప్రాథమిక ఆరోగ్య రక్షణ కార్యక్రమం కింద చేపట్టే ఇతర ప్రోగ్రామ్‌లలో జనని సురక్షయోజన, చిరంజీవి యోజన, కుటుంబ సంక్షేమం, సార్వత్రిక వ్యాధి నివారణ, ఎయిడ్స్ నియంత్రణ ప్రచారాలు, కుష్టు, క్షయ నివారణ, సమగ్ర వ్యాధి నివారణ కార్యక్రమం, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ, అంటువ్యాధుల నియంత్రణ, గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ వంటివి ముఖ్యమైనవి.

ఈ కార్యక్రమాలన్నిటిపై ప్రజలకు సరైన అవగాహన కలిగించడం చాలా అవసరం. అందుకోసం ఐసీడీఎస్ గ్రామస్థాయి సిబ్బంది, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, స్వయం సహాయక బృందాలు పనిచేస్తాయి. వారితోపాటు స్వచ్ఛంద సంస్థలు, ఐఈసీ కార్యకర్తలు, కొందరు ఆదర్శ దంపతులు ఇందులో భాగస్వాములవుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి జిల్లా, తాలుకా, గ్రామ స్థాయిల్లో సూక్ష్మ ప్రణాళికలు రూపుదిద్దుకుంటాయి. సామర్థ్యం పెంపు కృషిలోను, శిక్షణ కార్యక్రమాల్లోను, సమీక్షా సమావేశాల్లోను ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొంటూ ఉంటారు. జిల్లాస్థాయిలో శిక్షణ ఇస్తారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ సంస్థ శిక్షణ నిర్వహిస్తుంది. జిల్లా, బ్లాక్ స్థాయి ఆరోగ్య శాఖాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, (సబ్‌సెంటర్ స్థాయిలో) పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.

పిహెచ్‌సి స్థాయిలో అన్నిరకాల రోగులకు ప్రాథమిక సేవ, అత్యవసర సేవలు, సిహెచ్‌సి స్థాయిలో ఓపిడి సదుపాయాలు, సబ్‌సెంటర్ స్థాయిలో ప్రసవాలకు వసతులు కల్పించాల్సి ఉంది. కంటెంజెన్సీ నిధులను జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ జాప్యం లేకుండా విడుదల చేస్తూ ఉండాలి. సత్వర నిధుల మంజూరు, జిల్లా పరిషత్, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పూర్తి సహకారం అవసరమని ఈ అధికారులు సూచించారు.

మూడు పిహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్ల అభిప్రాయాలు గమనిస్తే, వాటిలో నిర్వహణలోను, మౌలిక వసతుల విషయంలోను, మందుల సరఫరా, గర్భనిరోధక సాధనాలు, సిబ్బంది గురించి వారు అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. వాటి గురించి అవగాహన కలగాలంటే ఒక పీహెచ్‌సీని ఉదాహరణగా పరిశీలించాల్సి ఉంటుంది. సురేంద్రనగర్ జిల్లా, లింబ్డి బ్లాకులోని పన్సినా గ్రామపంచాయతీలో ఈ పీహెచ్‌సీ ఉంది. దీని పరిధిలో 19 గ్రామాలలోని, 32,616 మంది ప్రజలున్నారు.

ఇక్కడ జనాభాకు, వైద్యుల సంఖ్యకు మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. బ్లాక్ స్థాయిలో రెండు మూడు బ్లాకులకు ఒక బ్లాక్ హెల్త్ ఆఫీసర్ ఉంటున్నారు. సురేంద్రనగర్ జిల్లాలోని లింబ్డి, చూడీ బ్లాక్‌లను ఒకరే పర్యవేక్షిస్తున్నారు. అహ్మదాబాద్ జిల్లాలోని బర్వాలా బ్లాక్‌లో ఒక అధికారి రెండు బ్లాకులను పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ ఉండే మెడికల్ ఆఫీసర్ మూడు బ్లాక్‌లపై బాధ్యతలు చూస్తున్నారు. అంటే ఒక్క అధికారి లక్ష మంది అవసరాలు గమనిస్తూ, ఇంకా అదనంగా పాలనాపరమైన బాధ్యతలు నిర్వహించాలి. కొంతమంది మెడికల్ ఆఫీసర్లు వారి సహాయాన్ని ఎక్కువ పాలనాపరమైన, పర్యవేక్షణ పరమైన పనులకే కేటాయించవలసి వస్తోంది. అంతే కాని రోగుల వ్యాధులకు చికిత్స చేయడానికి సమయం చాలడం లేదని చెప్పారు. బర్వాలా పీహెచ్‌సి పరిధిలో 14 గ్రామ పంచాయతీల్లో 48 వేల మంది జనాభా ఉంటారు.

ఈ గ్రామం జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఇంత పని ఒత్తిడి ఉన్న పీహెచ్‌సీలో జూనియర్ ఫార్మాసిస్టు ఒకరు, ఒక మహిళా ఆరోగ్య సూపర్‌వైజర్, సూపర్‌వైజర్, వార్డు ఆయా, వార్డు బాయ్, ఒక డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయవలసి ఉంది. నలుగురు ఎంపిహెచ్‌డబ్ల్యులు ఉండాలి. కాని ఒక్కరే ఉన్నారు. అలాగే ఎనిమిది సబ్‌సెంటర్‌లకు ఎనిమిది మంది మాత్రమే మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు. పీహెచ్‌సికి సొంత భవనం ఉంది. వాహనం ఉంది. కాని డ్రైవర్ లేడు. సిబ్బందికి గృహసదుపాయం లేదు. కనీసం విశ్రాంతి గది కూడా లేదు. ఫర్నీచర్ లేదు. అయిదు పడకలకు సదుపాయం ఉంది. కానీ ఒక్కటీ ఉపయోగపడటం లేదు.

నాగ్నేష్ గ్రామంలోని సబ్‌సెంటర్‌ను 15 ఏళ్ళ క్రితం నిర్మించారు. స్లాబ్‌పని, గుమ్మాలపని ఇంకా పూర్తికాక ముందే కాంట్రాక్టరు తెలివిగా అధికారులను మాయచేసి తనకు రావలసిన సొమ్ము చేజిక్కించుకున్నారు. ఇంక తరువాత పత్తాలేడు. ఆ పనులు ఇప్పటికీ

అలాగే పెండింగ్‌లో ఉండిపోయాయి. అప్పటినుంచి గ్రామ సర్పంచ్‌లు, సెక్రటరీలు అధికారులను కలిసి మొర పెట్టుకుంటున్నా పని మాత్రం జరగడం లేదు. ఫలితంగా గ్రామపంచాయతీ కార్యాలయానికి వెనుకనే ఉన్న సబ్‌సెంటర్ భవనం పశువులశాలగా మిగిలిపోయింది. ఫలితంగా సబ్‌సెంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యు / ఎఫ్‌హెచ్‌డబ్ల్యుల ఇంట్లో నడుస్తున్నది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 25,000 రూపాయల గ్రాంటు లభిస్తుంది. అక్కడ తాగునీటి సదుపాయం, ఆపరేషన్ థియేటర్ నిర్మాణం, వాష్‌బేసిన్, ఫార్మాసిసురూమ్ ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. కంప్యూటర్‌కు అనుమతి లభించింది. ఇంకా కొనుగోలు చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయి సిబ్బందితో జరిపిన సంభాషణల్లోను సమష్టి గోష్టిలోను వెల్లడైన విషయం ఏమిటంటే, వారికి ఆషా (గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్త) అన్నవారు లేరన్నది. ఇదే విధంగా ప్రతి సబ్‌సెంటర్‌కు రూ.10,000 ఇచ్చారు. ఈ మొత్తంలో సిటీస్కాన్ పరికరాలు, బరువు తూచే యంత్రం, బ్లాంకెట్, బిపి పరికరం, స్టెతస్కోప్, దిండుకవర్లు, సూదులు విరిచే పరికరం కొనుగోలు చేశారు.

ప్రజలకు ఆరోగ్య కార్యక్రమాల గురించి అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో కొన్ని కార్యక్రమాలు చేపడుతుంటారు. పోస్టర్ల విడుదల, ఇంటింటి ప్రచారం, ఎంఎన్ఎస్ సమావేశాలు, మమతా దివస్, తల్లుల సహకారం, ఓఆర్‌డి శిక్షణ వంటివి ముఖ్యమైనవి. ప్రతి గ్రామపంచాయతీలో గ్రామ స్థాయి ఆరోగ్యకమిటీ ఉంటుంది. సబ్‌సెంటర్‌ల వరకు కార్యాచరణ ప్రణాళిక ఉంటుంది. క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బందికి రెండు రోజులపాటు కంప్యూటర్ వాడకంపై శిక్షణ ఇచ్చారు. ఏం లాభం? కంప్యూటర్ సదుపాయం ఇంకా ఏర్పాటు లేదు. గ్రామాల మధ్య దూరం ఎక్కువ. రవాణా సదుపాయం లేదా సబ్‌సెంటర్‌లో రోగులకు తలదాచుకోవడానికి నీడ లేదు. అదికాక సిబ్బందికి పనిభారం ఎక్కువగా రాంటున్నది. ఈ వాస్తవ పరిస్థితులు అన్నీ గమనించాల్సిన ఒక్క మహిళా ఆరోగ్య కార్యకర్త, అయిదుల్సి వేల మంది ప్రజల ఆరోగ్య అవసరాలు చూడాల్సి వస్తుంది. ఇంకా 20-25 కార్యక్రమాల అమలును పర్యవేక్షించాల్సి ఉంటుంది. సబ్‌సెంటర్‌లలో స్వీపర్, ఫ్యూన్ వంటి సహాయకులు లేరు. కనీసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి వేతనంతో సరిపడా జీతాలు ఇవ్వాలని వారంతా కోరుతున్నారు.

వైద్య ఆరోగ్య సేవల వికేంద్రీకరణకు అనేక అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. 73వ రాజ్యాంగ సవరణ తరువాత పంచాయతీరాజ్ సంస్థలకు ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి సహకారం మద్దతు లభిస్తున్నాయి. ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేయడం వల్ల, సామాజిక స్పృహ పెరగడం వల్ల, ప్రజల భాగస్వామ్యం విస్తరించడం వల్ల, గ్రామ ప్రాంతాలలోని 70 శాతం మంది ప్రజలకు ఆరోగ్య సేవలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి ఇంట్లోను పారి శుద్ధ్య సదుపాయాలు కల్పించాలన్న ప్రభుత్వ యోచనను ప్రజలు గుర్తించి ఆచరణలో పెడుతున్నారు. కంప్యూటర్ సదుపాయం వల్ల వారికి ఇతర ప్రాంతాల నుంచి తోడ్పాటు లభిస్తోంది. ఒక టీచరు, లేదా ఒక పారిశుధ్య కార్మికుడు నిత్యం తమ విధులను ఉత్సాహంగా నిర్వహించ గలుగుతున్నారు. ఫలితంగా గడచిన అయిదేళ్ళ కాలంలో గ్రామ ప్రాంతానికి మెరుగైన విద్యా, వైద్య సదుపాయాలు లభిస్తున్నాయి.

### పరిశీలించిన అంశాలు

- ★ అభివృద్ధి కృషిలో అయిదు అంశాలు కీలకపాత్ర వహిస్తాయి. అవి విధాన నిర్ణయం, కార్యక్రమాలు, సంస్థాగత సహకారం, నిర్వహణాపరమైన ఏర్పాటు, సమాజ సహకారం.
- ★ విద్యా, ఆరోగ్యం వంటి అంశాలను వికేంద్రీకరించిన తరువాత, గ్రామ పంచాయతీల ప్రాధాన్యం పెరుగుతూ వస్తోందని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ రెండు రంగాలలో చూపించే శ్రద్ధ కారణంగా సాధారణ ప్రజలు వాటిని రాపయోగించుకొని సంతృప్తి చెంద గలుగుతున్నారు. నిర్ణయాలను తీసుకోవడంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటూ, ఆసక్తి చూపిస్తున్నారు.
- ★ గుజరాత్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంచాయతీరాజ్ చట్టం, వాటి ఆధారంగా జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు విస్తృతమైన విధులను, బాధ్యతల ను ఈ సేవల కల్పనలో అప్పగించింది. కాని పాలనాపరమైన అధికారులు కాని, ఆర్థిక వనరులు కాని లేవు. ఇంతవరకు సమకూర్చిన సదుపాయాలనే మరింత సమర్థంగా ఉపయో గించుకునేలా ప్రజలను ప్రోత్సహించడంతో పాటు నియమించిన సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్న అంశాన్ని పర్యవేక్షించడానికి మాత్రమే ఈ సంస్థలను ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నది.
- ★ విద్యా, వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ప్రజా ప్రతినిధుల సహకారంతో పంచాయతీరాజ్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న గ్రామ కమిటీలు కీలక సాధనాలుగా రూపుదిద్దుకున్నాయి.
- ★ ప్రస్తుతం ఈ సేవల విషయంలో ఉన్న వ్యవస్థాగత సదుపాయాలు, వాటి ప్రయోజనాల గురించి ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు పూర్తి అవగాహన ఉంది. అదే సమయంలో తమకు ఎదురుగా ఉన్న రకరకాల వ్యవస్థలలో ఎవరి బాధ్యత ఏమిటి, ఎవరి విధులు ఏమిటి అన్న విషయంలో అయోమయం కూడా ఉంది.
- ★ స్థానిక ప్రజల నుంచి కాని, ప్రజా ప్రతినిధుల నుంచి ఏదైనా అభ్యర్థన లేక సూచన వస్తే దానిపై అధికారులు స్పందించే తీరు, సమాధానం రావడంలో చాలా ఆలస్యం జరుగుతోంది. ఇది సత్వర పరిష్కారం అందకుండా చేస్తున్నది.
- ★ ఏ సేవా కార్యక్రమం గురించి అయినా ప్రజలకు సరైన అవగాహన కల్పించాలంటే అందుకు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడమే ఉత్తమ మార్గం.
- ★ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమర్థంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చి రాపయోగపడాలి అంటే తప్పనిసరిగా తల్లిదండ్రులు, టీచర్ల అసోసియేషన్‌లను ఏర్పాటు చేయడం అవసరం.
- ★ ప్రజా ప్రతినిధులలోను, ఈ తరహా కమిటీలలోను రాండే చాలామంది మధ్యవయస్కులు, తక్కువగా చదువుకున్న వారు. అందువల్ల యువకులు, విద్యావంతులు వాటి నిర్వహణకు ముందుకు వచ్చేలా ప్రోత్సహించడం అవసరం.

★ ప్రజలను, ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రశ్నించినప్పుడు నిర్ధారణ అయిన మరో విషయం పర్యవేక్షణ బాధ్యత జిల్లా తాలుకా స్థాయి అధికారులదేనని వారంతా భావిస్తున్నారు. అంతేకాక, గ్రామపంచాయతీ, గ్రామసభ, గ్రామకమిటీలు, ఇతర అసోసియేషన్‌లు కూడా పర్యవేక్షణ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలరన్న నమ్మకం వారిలో ఇంకా కలగలేదు. అంటే ఇంకా వారిలో పై నుంచి అజమాయిషీని ఆశిస్తున్నారే కాని, వారు దానిని స్వీకరించడానికి సిద్ధంగా లేరు.

★ బ్యాంకు ఖాతాలు తెరవడానికి మాత్రమే గ్రామ ఆరోగ్య కమిటీలను ఏర్పాటు చేస్తున్నారన్న అపోహ విస్తృతంగా ఉంది. అందువల్ల అన్ని గ్రామాల్లోనూ బ్యాంకు బ్రాంచీలు లేకపోవడం కారణంగా అవి చురుకైన పాత్ర నిర్వహించలేకపోతున్నాయి.

★ గుజరాత్‌లో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద పనిచేసే అక్రెడిటెడ్ సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (ఆషా) లేరు. అంతేకాక రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు కాని, అధికారులకు కాని, స్వచ్ఛంద సంస్థలకు కాని సరైన శిక్షణ ఇవ్వడం లేదు. సర్వశిక్షా అభియాన్, జాతీయ గ్రామీణ ఆరోగ్యమిషన్, ఐసీడిఎస్, త్రాగునీరు, పారిశుధ్యం వంటి కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన కెపాసిటీ బిల్డింగ్, ప్రజా చైతన్యం చాలా ముఖ్యమన్న గుర్తింపు కనిపించడంలేదు.

★ కెపాసిటీ బిల్డింగ్, ప్రజా చైతన్యం అన్న రెండు అంశాలు సమర్థంగా రూపుదిద్దుకున్నప్పుడే ప్రణాళికల రూపకల్పనలోను, పర్యవేక్షణలోను ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అంతేకాక ప్రభుత్వం సమాకూర్చే ఆస్తులు తమ అందరి ఉమ్మడి ఆస్తులన్న భావన పటిష్టమవుతుంది.

★ పంచాయతీరాజ్ సంస్థలలోని ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఈవిధంగా వికేంద్రీకరించే సేవల గురించిన సరైన, సానుకూలమైన అవగాహన కలగడం లేదు.

★ గ్రామస్థాయి, విద్యా, ఆరోగ్య కమిటీలు, తల్లి-టీచర్ల అసోసియేషన్, పేరెంట్ టీచర్ల అసోసియేషన్‌ల సభ్యులకు సరైన శిక్షణ కాని, అవగాహన కాని కలిగించే ప్రయత్నాలు లేవు.

★ కమిటీలు, అసోసియేషన్‌ల సభ్యులలో వయోధికులు ఎక్కువగా ఉండడం, విద్యావంతులు కాకపోవడం పెద్ద లోపాలు.

★ సిబ్బంది, మందులు కొరతగా ఉండడం, ఆరోగ్య కేంద్రాలకు సరైన రవాణా సదుపాయం లేకపోవడం వల్ల గ్రామీణులు స్థానికంగా లభించే ప్రైవేటు డాక్టర్లను ఆశ్రయిస్తున్నారు.

★ ఆషా వర్కర్‌లు లేరన్న విషయాన్ని ప్రజలు గుర్తించలేకపోతున్నారు. అలాగే ప్రభుత్వం ఎన్‌ఆర్‌హెచ్‌ఎం కింద అందించే నిధులను అవసరాల ప్రాతిపదికన ఉపయోగించాలన్న విజ్ఞత కొంత ఉండడం లేదు.

★ నాగ్నేష్ సబ్‌సెంటర్‌లో భవన నిర్మాణం పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ సొమ్ము చేజిక్కించుకుని తప్పించుకోవడంలో ఏర్పడిన పరిస్థితి గమనించాం. ఇలాంటివి ఫలితాలను ఇవ్వలేవు.

★ గ్రామసభల స్థాయిలో సూక్ష్మ ప్రణాళికలు రూపుదిద్దుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులను అడిగితే ప్రణాళికలు స్థానికంగానే రూపొందుతున్నవన్నారు. కాని ప్రజలనడిగితే గ్రామ సభలలోనే జరుగుతున్నాయిని చాలా కొద్దిమంది అంగీకరిస్తున్నారు.

### *సలహాలు - సూచనలు*

★ అధికారాలు, విధులు బదలాయింపు గురించి పంచాయతీరాజ్ స్థాయిలో అందరికీ పూర్తి అవగాహన కలిగించడం తక్షణ అవసరం.

★ అన్ని కమిటీలు, అసోసియేషన్‌లలో విద్యావంతులు, యువకులతో పాటు మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి తగిన శిక్షణ ఇవ్వడం అవసరం.

★ గ్రామ సభలను బహిరంగంగా నిర్వహించడంతో పాటు ప్రజలంతా వాటిలో పాల్గొనేలా ప్రోత్సహించాలి.

★ సిబ్బంది నియామకానికి, మందుల సరఫరాకు, సబ్‌సెంటర్‌ల నిర్వహణకు మరిన్ని నిధులు సమకూర్చాలి.

★ విస్తృత ప్రాతిపదికన సామాజిక అభివృద్ధిపై గ్రామసభ ముందుగా దృష్టి సారించాలి. అంటే విద్యావ్యాప్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం వంటి అంశాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి. అప్పుడే విద్య, వైద్యపట్ల ఉన్న మూఢనమ్మకాలు అపోహలను తొలగించుకోవడానికి ప్రజలు ముందుకు వస్తారు.

★ గ్రామ విద్యా, వైద్య కమిటీలు, అసోసియేషన్‌ల సభ్యులకు శిక్షణ, విజ్ఞాన యాత్రలను నిర్వహిస్తూ ఉండాలి.

★ అత్యవసర రవాణా సేవలకు ఎన్‌ఆర్‌హెచ్‌ఎం నిధులను వినియోగించుకోవాలని గ్రామాల్లోని ప్రతి ఒక్కరికి తెలియ చెప్పేందుకు దండోరా వేయించాలి. అందుకు తగిన ఆదేశాలను వైద్య సిబ్బందికి జారీ చేయాలి.

★ పని చేస్తున్న గ్రామాలలోనే సిబ్బంది నివసించేలా ప్రోత్సహించాలి.

★ నిర్మాణంలో ఉన్న సబ్‌సెంటర్‌ల పనిపై శ్రద్ధ తీసుకోవాలి.

★ 24 గంటలూ సేవలందించేందుకు వీలుగా సిబ్బందిని నియమించాలి.

★ అవసరమైన మందులు, పరికరాలు సమకూర్చినపుడే మెరుగైన సేవలు గ్రామీణులకు అందుతాయి.

★ ఉపాధ్యాయులకు బోధన విధులు తప్ప, ఇతర బాధ్యతలను అప్పగించరాదు. ఓటర్ల నమోదు, జనాభా లెక్కల సేకరణ, ఎన్నికల విధులు వంటి వాటి వల్ల వారు విద్యార్థులకు బోధించాల్సిన బాధ్యత సక్రమంగా నిర్వహించ లేకపోతున్నారు.

★ ప్రధాన ఉపాధ్యాయులకు పాలనాపరమైన పనుల ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. అందువల్ల పార్ట్‌టైమ్ క్లర్క్‌లను నియమించాలి.

★ చట్టబద్ధమైన విధుల నిర్వహణకు తగిన పాలనాపరమైన అధికారులు డిఇసిలకు కల్పించాలి.

★ జిల్లా స్థాయి సంస్థలకు అవసరమైన ఆర్థిక వనరులు కల్పించి, చట్టబద్ధమైన బాధ్యతల నిర్వహణకు అవసరమైన అధికారాలు ఇవ్వాలి.

★ ఇంగ్లీషు మాధ్యమంలో బోధన, కంప్యూటర్ శిక్షణ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ప్రారంభించాలి.

*- డాక్టర్ ఇ. వెంకటేషు*
E-mail: apevs@yahoo.com

**ఈ సంవత్సరం వాతావరణ శాఖ వారు విడుదల చేసిన అంచనాల ప్రకారం జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతంలో 98% వరకు నమోదయ్యే అవకాశం వుంది. అయితే మన రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాలలోనూ సాధారణం కన్నా ఎక్కువగానే వర్షపాతం నమోదయింది. కోస్తా జిల్లాలలో 54 శాతం అధికంగాను, తెలంగాణలో 28 శాతం అధికంగాను, రాయలసీమలో 66 శాతం అధికంగాను వర్షపాతం నమోదయింది. జలాశయాలన్నీ నీటితో నిండి కళకళలాడుతున్నాయి.**

ఖరీఫ్‌లో సాగులోవున్న పంటలలో సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకొని మంచి పంట దిగుబడులు పొందేందుకు ప్రయత్నిస్తూ రబీ పంటలకు కూడా ప్రణాళిక తయారు చేసుకోవాలి. భూమిలో ఉన్న తేమను సద్వినియోగం చేసుకుంటూ రబీలో ఆహారధాన్యాలు, అపరాలు, నూనెగింజల పంటలతో పాటుగా, కూరగాయ పంటల సాగుకు సిద్ధంగా వుండాలి.



పాప్‌కార్న్, మాధురి లాంటి రకాలు ఎకరాకు 5-6 కిలోల, ఇతర రకాలు ఎకరాకు 7 కిలోల విత్తనం అవసరం. మొక్కజొన్నకు పూత దశకు ముందు, పూత దశలో, గింజలు పాలు పోసుకునే దశలో నీరు పెట్టడం అవసరం.

# రబీ పంటల సాగు

## జొన్న

ఖరీఫ్‌లో పండించిన జొన్న కన్నా రబీలో పండించే జొన్న గింజ నాణ్యత బాగుంటుంది. మార్కెట్‌లో ఎక్కువ ధర పలుకుంది. రబీ జొన్నకు చీడపీడల బెడద కూడా తక్కువగా వుంటుంది. సాధారణ రబీ ప్రాంతంగా జొన్న పంట ఆదిలాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలలో అక్టోబర్ మొదటి పక్షంలో విత్తుకుంటారు. అక్టోబర్ మొదటి వారంలో విత్తిన జొన్న సాధారణంగా జనవరిలో కోతకు వస్తుంది. నల్లరేగడి నేలల్లో తేమ ఎక్కువగా నిల్వ ఉంటుంది. ఈ పైరు తేమను బాగా వుపయోగించుకొని, శీతాకాలంలో వీచే గాలికి ఏపుగా ఎదుగుతుంది.

**రబీలో సాగుకు అనువైన జొన్న రకాలు**

సి.యస్.హెచ్ -6, సి.యస్.హెచ్-9, సి.యస్. హెచ్ -13, పి.జి. 890, యస్.పి.వి. 462, సి.యస్.వి. -14 ఆర్, యన్.జె.21 22, యన్. 14, ఎన్.టి.జె.4 యన్ -13 - ఈ రకాలు రబీకి అనుకూలం.

ఎకరాకు 3-4 కిలోల విత్తనాలు సరిపోతాయి. కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందు కలిపి విత్తన శుద్ధి చేయాలి. వరుసల మధ్య 45 సెం.మీ మొక్కల మధ్య 12-15 సెం.మీ దూరం ఉండేలా విత్తుకోవాలి.

## మొక్కజొన్న

మొక్కజొన్న రబీ పంటగా తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో అక్టోబరు నుండి నవంబరు వరకు వేసుకోవచ్చు. అంబర్ పాప్‌కార్న్, మాధురి, ప్రియ లాంటి ప్రత్యేక రకాలు, డిహెచ్ యం- 107, డిహెచ్‌యం 109 డిహెచ్‌యు 105 లాంటి హైబ్రిడ్ రకాలు సాగుచేయవచ్చు.

## కుసుమ

రబీలో సాగు చేసే పంటలలో కుసుమ చాలా ముఖ్యమైంది. మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే కుసుమలో హెక్టారుకి 500 - 1000 కిలోల వరకు దిగుబడి పొందవచ్చు. మన రాష్ట్రంలో ప్రస్తుతం దిగుబడులు 250-300 కిలోలు మాత్రమే వుంటుంది. కానీ, మంచి సాగు పద్ధతులు పాటిస్తే దిగుబడులు బాగా పెరుగుతాయి. కుసుమ పంట సకాలంలో విత్తుకో గలిగితే సస్యరక్షణ ఖర్చులు బాగా తగ్గుతాయి. కుసుమను అక్టోబరులోనే విత్తుకోవాలి.



మంజీరా రకం 115-120 రోజులలో కోతకు వచ్చి ఎకరాకు 3.4 క్వింటాళ్ళ దిగుబడి ఇస్తుంది.

సాగర ముత్యాలు రకం 115-125 రోజులలో కోతకు వచ్చి ఎకరాకు 5.6 క్వింటాళ్ళ దిగుబడి ఇస్తుంది. రంగారెడ్డి, కర్నూలు, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్లగొండ, కడప జిల్లాలలో కుసుమ సాగులో వుంది. కుసుమకు నీటి అవసరం తక్కువ. పైరు ఎదిగే దశ, పూత దశలో తేమ వుండాలి. నీరు వుంది కదా అని కుసుమకు ఎక్కువ నీటి తడులు ఇవ్వకూడదు. కుసుమ వేళ్ళు బాగా లోతుకుపోయి మిగతా రబీ పంటలు ఉపయోగించుకోలేని తేమను ఉపయోగించుకుంటాయి.

సహజంగా తక్కువ దిగుబడినిచ్చే శనగ, కొత్తిమీర, గోధుమ వంటి మెట్ట పంటలతో కుసుమను మిశ్రమ పైరుగా సాగు చేయవచ్చు.

## ప్రొద్దుతిరుగుడు

ఈ సంవత్సరం మంచి వర్షాలు కురవటం వలన భూమిలో తేమ బాగా వుంది. కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాల వలన ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిని తిరిగి పంటలు విత్తుకోవాల్సిన పరిస్థితులు నెల కొన్నాయి. ఇలాంటి పరిస్థితులలో వర్షాధారంగా అక్టోబర్ -నవంబర్ మాసాల్లో ప్రొద్దుతిరుగుడు పంటను విత్తుకోవచ్చు. లోతట్టు ప్రాంతాల్లో ఈ పంటను సాగుచేయకూడదు. ఆమ్ల లక్షణాలు కలిగిన నేలల్లో కంటే కొద్దిగా క్షార లక్షణాలు వున్న నేలల్లో ఈ పంట బాగా పండుతుంది.

నీరు నిల్వ ఉండని నేలలు దీని సాగుకు శ్రేష్ఠం. వరి పండించిన భూముల్లో, ఆ భూముల్లో మిగిలిన వున్న తేమ, పోషకాలతో ప్రొద్దు తిరుగుడు సాగు చేయవచ్చు. యం.ఎస్.ఎఫ్.హెచ్ 8, యం.ఎస్.ఎఫ్. హెచ్ - 17, ఎ.పి.యస్.హెచ్ -11, కె.బి.యస్. హెచ్ -8 లాంటి సంకర రకాలు సాగుచేయవచ్చు.

సంకర రకాలు ఎకరాకు 2 నుండి 2.4 కిలోలు, నీటి పారుదల వుంటే ఎకరాకు 1.6 -2.0 కిలోల విత్తనం సరిపోతుంది. నేల స్వభావాన్ని బట్టి మొక్కల సాంద్రత మారుతుంది.

తేలిక నేలల్లో 4520 సెం.మీ దూరం, బరువు నేలల్లో 6030 సెం.మీ దూరం, మధ్యస్థ నేలల్లో 4530 సెం.మీ దూరం పాటించాలి. మొక్కలు మొలకెత్తిన 10-15 రోజుల తర్వాత కుదురుకు ఒక ఆరోగ్యవంతమైన మొక్కను మాత్రమే వుంచాలి.

గంధకం తక్కువగావున్న నేలల్లో ఎకరాకు 10 కిలోల గంధకాన్ని జిప్సం రూపంలో వేస్తే నూనె శాతం పెరిగి ఎక్కువ దిగుబడులు పొందవచ్చు. విత్తనాలు విత్తేముందు కిలో విత్తనానికి 2-3 గ్రాములు థైరమ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేయాలి. ప్రొద్దు తిరుగుడు పంటలో బొరాన్ వాడకం వలన ఫలదీకరణ శాతం పెరుగుతుంది. బొరాన్ పొడి లీటరు నీటికి 2 గ్రా. చొప్పున కలిపి పువ్వు లోని మగభాగం తెరుచుకున్నపుడు పిచికారీ చేయాలి. ఎకరాకు 200 లీటర్ల మందు నీరు అవసరం అవుతుంది. దీని వలన గింజలు అధికంగా తయారు అవుతాయి. దీని బదులు ఎకరాకు 8 కిలోల బోరిక్ ఆమ్లాన్ని దుక్కిలో వేసుకోవచ్చు.

### కంది

అధిక వర్షాల వలన మొదటి పంట పూర్తిగా దెబ్బతిన్న ప్రాంతాల్లోనూ, తొలకరిలో స్వల్పకాలిక పంటలైన పెసర, మినుము లాంటివి వేసుకున్న



చోట్ల, స్వల్పకాలిక వరి రకాల తర్వాత కూడా కంది పంట వేసుకోవచ్చు. అయితే కంది పంటను అక్టోబరులోనే వేసుకోవాలి. ఆలస్యంగా వేసుకోకూడదు. రబీలో 120 -125 రోజులలో పంటకు వస్తుంది. రబీ కంది జనవరిలో పూతకు వస్తుంది. ఈ సమయంలో శనగ పచ్చ పురుగు ఉధృతి తక్కువగా ఉంటుంది. రబీ కంది ఎత్తు తక్కువగా వుండటం వలన సస్యరక్షణ చర్యలు తీసుకోవటం సులువవుతుంది.

పల్నాడు, లక్ష్మీ, ఎల్.ఆర్.జి. 38, డబ్ల్యు. ఆర్.జి. 27 ఆభయరకాలు రబీలో వేసుకోవచ్చు. రబీలో విత్తుకోవాటానికి ఎకరానికి 6-8 కిలోల విత్తనం సరిపోతుంది. దిగుబడి ఎకరాకు 5-6 క్వింటాళ్ళ వరకు వుంటుంది. రబీ కందిలో సహ పంటలుగా కొత్తిమీర, అలసంద, పెసర, మినుము లాంటి పంటలు వేసుకోవచ్చు.

రైజోబియం కల్చర్‌తో విత్తనశుద్ధి చేసి విత్తుకున్నట్లయితే ఎక్కువ దిగుబడులు పొందవచ్చు.

## కూరగాయ పంటలు

రబీకాలం కూరగాయ పంటల సాగకు అనుకూలం. బంగాళదుంప (ఆలుగడ్డ), కూర మిరప, క్యాబేజి, కాలిఫ్లవర్, టమోటా, చిక్కుడు రబీలో సాగుకు అనుకూలం.



### ఆలుగడ్డ

అక్టోబర్ రెండవ పక్షం నుండి నవంబర్ మొదటి వారం వరకు నాటుకోవచ్చు.

కు ఫ్రీ సింధూర్, కు ఫ్రీ చంద్రముఖి, కు ఫ్రీ బాద్‌షా, కు ఫ్రీ లాలిమ రకాలు అనుకూలం.

ఆలుగడ్డ విత్తన దుంపలను శీతల గిడ్డంగుల నుండి తీసుకువస్తారు. వీటిలో మొలక బాగా రావటానికి వారం - పదిరోజులు నీడలో వుంచాలి. మొలకశాతం పెంచటానికి జిబ్బరిలిక్ ఆమ్లం 1 మి.గ్రా 1 లీటరు నీటిలో కలిపి, ఈ మందు ద్రావణంలో గంటసేపు వుంచి, తర్వాత ఆరబెట్టి 10 రోజులు వుంచాలి. విత్తిన 35 రోజులకు, 65 రోజులకు తప్పని సరిగా మట్టిని ఎగదోయాలి.

### కూరమిరప

రాత్రి వేళ ఉష్ణోగ్రత 10 -17° సెంటీగ్రేడ్ మధ్య 30-40 రోజులు వుంటే కూర మిరప సాగుకు అనుకూలం. అక్టోబర్‌లో నాటుకోవటం మంచిది..

కాలిఫోర్నియా వండర్, ఆర్కగౌరవ్, ఆర్కమోహిని, ఆర్కబసంత్, హీరా, ఇందిరా, భారత్ రకాలు అనుకూలం. నీరు బాగా ఇంకే బరువైన, సారవంతమైన నేలలు అనుకూలం. ప్రతి 10-12 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి.

## క్యాబేజి

చల్లటి తేమగల వాతావరణం క్యాబేజి సాగుకు అనుకూలం.

దీర్ఘకాలిక రకాలు అక్టోబర్ మొదటి పక్షం నుండి నవంబర్ చివరి వరకు వేసుకోవచ్చు. నాదిలక్ష్మీ 401, సోనా, శ్వేత, అవంతి, గ్రీన్ ఛాలెంజర్ లేట్ డ్రమ్‌హెడ్ లాంటి రకాలు అనుకూలం. తేలిక నేలల్లో వారం రోజుల కొకసారి, బరువైన నేలల్లో 10 రోజుల కొకసారి నీటి తడి ఇవ్వాలి.



సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. కోసేటప్పుడు గడ్డలకు దెబ్బ తగలకుండా చూడాలి.

## కాలిఫ్లవర్

శీతాకాలం కాలిఫ్లవర్ సాగుకు అనుకూలం. స్నోబాల్ -16, పూసా స్నో బాల్-1, 2 పూసా హిమజ్యోతి, పూసా సింథటిక్ రకాలు అనుకూలం.




నాటిన 15వ రోజు, 30వ రోజు కలుపుతీసి మట్టి ఎగదోయాలి. పువ్వులోకి సూర్యరశ్మి చేరకుండా ఆకులను పువ్వు మీదకు కప్పుతూ దారం చుట్టాలి. తేలిక నేలలో వారానికి ఒకసారి, బరువునేలల్లో 10 రోజుల కొకసారి నీరు పెట్టాలి.

## చిక్కుడు

రబీ సాగుకు ఆర్కజయ, ఆర్క విజయ రకాలు అనుకూలం. ఇవి పొద రకాలు. ఎకరాకు 12-16 కిలోల విత్తనం అవసరం అవుతుంది. చిక్కుడు పాదుల్లో నీరు నిలవకుండా చూడాలి. పాదుల్లో 2-3 సెం.మీ లోతుగా ఎండినపుడు నీరు కట్టాలి.

## ధనియాలు




చల్లటి వాతావరణం, తక్కువ ఉష్ణోగ్రత, తగినంత మంచు అనుకూలం. అక్టోబర్ మొదటి పక్షం నుండి నవంబర్ మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు.

సింధు, సాధన, స్వాతి రకాలు అనుకూలం. తేలికపాటి భూముల్లో డి హెచ్ -5 రకం వేసుకోవచ్చు. కొత్తిమీర కొరకు ఇ-సి-232666 రకం అనుకూలం. ధనియాలతో పాటు ఆవాలు, కుసుమలు, శనగలు మిశ్రమ పంటగా వేసుకోవచ్చు. ఎకరానికి 6 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తన మోతాదు ఇంత కన్నా ఎక్కువ వాడకూడదు. సాధన, సింధు లాంటి రకాలు త్వరగా బెట్టకు వచ్చే నేలల్లో సాగు చేయకూడదు.

సాళ్ళ మధ్య 30 సెం.మీ, సాళ్ళలో మొక్కల మధ్య 10 సెం.మీ ఎడం వుండేలా గొర్రుతో విత్తుకోవాలి. రకాన్ని బట్టి 40-45 రోజులకు పూత మొదలై 80-100 రోజులలో పక్వానికి వస్తాయి. 60% గింజలు పక్వానికి వచ్చినప్పుడు కోసుకోవాలి. ధనియాల పంట ఉదయం పూట మాత్రమే కోసుకోవాలి. పంట కోసిన తర్వాత 2-3 రోజులు పొలంలోనే ఆరనిచ్చి కోసుకోవాలి. విత్తనాన్ని అప్పుడపుడు ఎండబెట్టి నిల్వలో ఆశించే పురుగులను అరికట్టుకోవాలి.

*- జి. విజయ కుమార్, ఆకాశవాణి*



**"మీ** టాయిలెట్ ఎక్కడుంది"

ఈ ప్రశ్న ఇంకా ఆధునికంగా అడగాలంటే "వేర్ ఈజ్ యువర్ రెస్ట్ రూం?" అని అడగాలి.

భూమ్మీదే కాదు, ఈ చరాచర జగత్తులో ఏ గ్రహం మీద అడగు పెట్టినా సరే, మొదట ఈ సౌకర్యం వెతుక్కోవాల్సి వస్తుంది. ఈ ప్రశ్న అడగ్గానే ఎవరైనా ఎందుకో తడబడతారు. అది మొదటి స్పందన. తర్వాత వేలుతో ఆ దిక్కుకి చూపిస్తారు. వెళ్ల దల్చుకున్న వ్యక్తి కూడా కొంచెం మొహమాటంగానే అటు వెడతారు. అంటే యాన్యువల్ రిపోర్టు ఫైల్ చూపించినంత గొప్పగా, మరుగుదొడ్డి చూపించలేరు. ఎందుకంటే అది ఎలా వుందోనన్న భయం, మరుగుదొడ్డికి వెళ్ళివచ్చిన అతిథి లోపల కూచుని ఏమనుకుని వచ్చాడో అని సందేహం......

# ప్రధాన స్రవంతి మాధ్యమంలోకి ప్రాధమిక అవసరాలు రావా..?

అంటే అభివృద్ధి వేరు, ప్రాధమిక అవసరాలు వేరు అని ఇలాంటప్పుడే మనకి అర్థమవుతుంది. ప్రాధమిక అవసరాల్ని గురించి అసలెప్పుడూ మాట్లాడుకోక పోవడం వల్లనే అది అభివృద్ధి నిరోధక సమస్యగా మారిన సందర్భమే ఇప్పుడు మన కళ్లముందు వున్నది.

సాధారణంగా ప్రధాన స్రవంతి మాధ్యమం (మెయిన్ స్ట్రీం) అంతా కూడా రాజకీయ ఎత్తుగడల గురించో, సినిమాల గురించో రాసినట్టుగా జీవభౌతిక సమస్యలు రాయలేదు. అరకొరగా వున్న ప్రత్యామ్నాయ పత్రికల్లో ఒకటి అరా వ్యాసాలు మాత్రమే వచ్చాయి. కొద్ది సార్లు బహిర్భూమికి వెళ్లిన స్త్రీల మీద, బాలికల మీద జరిగిన నేరాలు రికార్డయ్యాయి. అది కూడ నేరం పరిధిలోనే ఆలోచించాయి గాని అంతకంటే ఎక్కువ విషయాలు బైట పెట్టలేదు. సరిగ్గా ఈ గ్యాప్స్ పూరించడం కోసం పనిచెయ్యాలనుకుంది తెరిసా రెహమాన్ ఉద్యమం...!

ఎవరీ తెరిసా రెహమాన్...? ఏమిటా ఉద్యమం అనే సందేహం మీకు రావచ్చు. ఆవిడ ఒక సాధారణ విలేకరి. తెహల్కా, ఇండియా టుడే, టెలిగ్రాఫ్ పత్రికల్లో ఆమె రెగ్యులర్‌గా రాస్తూ వుంటుంది... పర్యావరణ కాలుష్యంతో దెబ్బతింటున్న టీ తోటల మీద రిపోర్టు రాయడానికి అస్సాం వెళ్ళింది. అక్కడి కార్మికులంతా ట్యూబర్కిలోసిస్ వ్యాధితో చనిపోతూ వుండటం చూసింది. నిజానికి ఈ వ్యాధి చనిపోయేంత తీవ్రమైనది కాదు. మంచి ఆహారంతో మందులతో తేలిగ్గానే నయం చేసుకోవచ్చు.

మరి అక్కెడెందుకలా జరుగుతోంది అని చూడగా, చూడగా తేలినదేమిటంటే అక్కడ పారిశుధ్య సమస్య తీవ్రాతి తీవ్రంగా వుంది. ఎన్ని మందులూ, బల వర్ధక ఆహారం తీసుకున్నా గానీ ఫలితం వుండటం లేదు. శ్వాసకోశ వ్యాధులు తగ్గుముఖం పట్టడమే లేదు. అక్కడి డాక్టర్లు కూడా చేతులు ఎత్తేశారు. అప్పుడు ఆవిడ తన పరిశోధన టీ తోటల మీద కాకుండా మల విసర్జన చుట్టూ వున్న సామాజిక అంశాల మీద చేయాలని నిర్ణయించుకుంది.

ఆమె అస్సాం వెళ్లినప్పుడు అక్కడ వానల భీభత్సం విపరీతంగా వుంది. మామూలుగా కూడా అక్కడ ఎప్పుడు చూసినా వరదలు ముంచెత్తుతూ వుంటాయని మనకి తెలుసు. తెరిసాకి వంట చేసే అమ్మాయి, తాము మలవిసర్జన కోసం వెళ్ళాలంటే ఎంత కష్టపడతారో చెప్పినప్పుడు మనసు ద్రవించిపోయిందని ఆమె అంటుంది. నేలంతా నీటితో నిండిపోయి కూచునేందుకు చారెడు నేల దొరక్క ఒక కర్రతో నీటి లోతు కొలుచుకుంటూ కిలోమీటర్ల కొద్దీ వెళ్లాల్సి వస్తూ వుంటుందని, అనేక మంది అక్కడి నీటి పాములకి బలయిపోతుంటారని, కళ్లముందే రోగాలతో పిల్లలు చనిపోతే పాతి పెట్టేందుకు కూడా చోటు దొరకడం కష్టమేనని, కాబట్టి అసలు విసర్జన క్రియే జరక్కుండా పొట్ట మాడ్చుకోవడం మామూలైపోయిందని ఆమె చెప్పినట్టు తన రిపోర్టులో రాసింది. ప్రకృతి భీభత్సాల్ని రిపోర్టు చెయ్యడానికి వెళ్లిన కలాలు, కెమేరాలు ఈ విషయాల్ని ఎప్పుడూ వెలుగులోకి తేవని, అని కేవలం డెవలప్‌మెంట్ జర్నలిస్టుల పని అనుకుంటారని కూడా తెరిసా ఆరోపించింది.

రెండువేల ఎనిమిదవ సంవత్సరం డిల్లీలో జరిగిన శాకోశాన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న దేశాలన్నీ నీటి సమస్యమీదే కొట్టుకుపోతుంటే, తెరిసా మాత్రం పట్టువదల్ని విక్రమార్కుడిలా ఓపెన్ డెఫికేషన్ మీద మాట్లాడింది. అది చూసి ఇస్తాన్‌బుల్, టర్కీ దేశస్థులు కొందరు ముసిముసిగా నవ్వుకున్నారని ఆమె అంటున్నారు. అంతర్జాతీయ శానిటేషన్ సదస్సు రెండువేల ఎనిమిదిని శానిటేషన్ ఇయర్‌గా ప్రకటించినప్పుడు వాటర్ ఫర్ లైఫ్‌తో కలిసి పనిచెయ్యడానికి యునైటెడ్ నేషన్స్ నిర్ణయించుకుంది.

ఇండోనేషియాలో శానిటేషన్ వైఫల్యం వల్ల ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతిన్నది. అంతర్జాతీయ బ్యాంకువారి రిపోర్టు ప్రకారం 6.3 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. ఇప్పటికి ఇంకా వ్యర్థ జలాల తరలింపు సమస్య గానే వుంది.1/3వ వంతు భారతీయులు మాత్రమే శానిటేషన్ అవసరాన్ని గుర్తిస్తున్నారు. ఈ సదస్సులో ప్రతిఫలించిన అంశాలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని తెరిసా రెహమాన్ శానిటేషన్ స్క్రైబ్స్ అనే న్యూస్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ప్రారంభించింది. మరుగుదొడ్లు, రుతుస్రావం, శానిటరీ పాడ్స్, మలవిసర్జన లాంటి అస్పృశ్య అంశాల్ని ప్రధాన స్రవంతి మాధ్యమంలోకి తేవడమే తన లక్ష్యమని ఆమె అంటున్నారు.

సౌత్ ఆసియా కాన్ఫరెన్స్ స్ఫూర్తితో సామాజికంగా నాటుకున్న అభద్రతా భావనల్ని, మత రాజకీయ భావనల్ని వెలుగులోకి తెచ్చేందుకు ఈ విలేకరుల బృందం పనిచేస్తుంది. ఆసక్తిగల విలేకరులు తమ రిపోర్టులు దీనికి పంపుకోవచ్చు. మొదట మందకొడిగా నడిచినప్పటికీ, ఇప్పుడు కొంత ప్రోత్సాహకరంగానే వుంది. రాసే వాళ్ల సంఖ్య తక్కువగా వున్నగానీ చదివేవాళ్ల సంఖ్య బాగానే వుందని తెరిసా అంటోంది.

ప్రాధమిక అవసరాల్ని ప్రధాన మాధ్యమంద్వారా గుర్తింపచేయడమే తన ఉద్దేశ్యంగా ఈ సంస్థ పని చేస్తోంది. తమలో వున్న బిజినెస్ జర్నలిస్టుల్ని కూడ నేను ఎకనామిక్ ఆఫ్ శానిటేషన్ మీద రాయమని కోరుతున్నానని తెరిసా తన ఇంటర్వ్యూలో చెప్పింది.

*(ది హూట్ ఆన్ లైన్ న్యూస్ మ్యాగజైన్ నుంచి స్వేచ్ఛాను వాదం)*

**- కొండేపూడి నిర్మల**

**"ఒరేయ్ పెద్దోడా, మన ఊరు ఒక మారు వెళ్ళిరారా, వంశధార వరదలకు ఇళ్లన్నీ దిబ్బయిపోయాయి... ఉన్న రెండెకరాల వన్నెవట్టి రైతు నర్సిగాడికి బెడ్డశిస్తుకి మీనాన్నగారు ఇచ్చారు. మీ నాన్నగారు కాలంచేసి పదిహేనేళ్ళయిపోయింది. మళ్ళీ మళ్ళీ తిరిగి రాయడమే అవుతున్నదేగాని సంవత్సరం, సంవత్సరం ఏదో మూడువేలు పడేస్తున్నాడు. ఉన్న భూమి కాస్త చేజారిపోతుందన్న భయంతో చెబుతున్నాను. నువ్వెలాగూ రిటైరై ఖాళీగా ఉన్నావు గదా. చేను కోతకోసి కుప్పలు పెట్టేమన్నాడు. ఇంకా నూర్చాక వెళితే కొట్లో ధాన్యం పోసేసుకుని ఏం పంటలు బాబూ అంటాడు. ఇప్పుడు వెళితే ఎంత పండింది తెలుస్తుంది. ఆలోచించరా... బతిమలాట కాదు. ఆర్డరు వేస్తున్నట్టుగా కాక చెప్పుకుపోయింది అమ్మ.**


తనేం చేయగలడు. తనకు పదవ ఏటే విశాఖపట్నం వచ్చి ఇక్కడే చదువు, ఉద్యోగం, సొంతిల్లు, పిల్లల చదువులు, పెళ్ళిల్లు, పట్నవాసపు వాతావరణం ఒళ్ళంతా జీర్ణించుకున్నారు. తను ఆ ఊరు వెళ్ళి అప్పుడే ఓ ఇరవైయేళ్ళు అయిఉంటుంది. హైస్కూలు చదువులప్పుడూ, కాలేజీ చదువుల వరకు సెలవుల్లో వెళ్లి తమ పొలాలు.... పొలం పనులు... ఎడ్ల బండ్లు తోలడం.... గత్తం పెరగడం అన్నీ చేసేవాడు. పొలాల సరిహద్దు గట్లు గుర్తే. రైతులు... పాలికాపులు... వాళ్ళపై అజమాయిషి చేయడం తనకి తెలియనవి కాదు. అప్పటి ఆత్మీయతలు బుగతల మీద రైతువారీ అభిమానాలు వేరు. ఒకే కుటుంబంలా ఉండేవారు. ఎవరి మర్యాదలు వారికి దక్కేవి.

అమ్మ చెప్పింది కదా అని కావలసిన సరంజామాతో తను పుట్టిన రామనగరం బయలు దేరాడు జగన్నాథం.

ఆర్టీసి బస్సుల ధర్మమా అని డైరెక్టుగా వారి ఊరికి విశాఖ నుంచి వెళ్ళవచ్చు. బస్సులో సీటు దొరికినందుకు ఊపిరి పీల్చుకుని కూర్చున్నాడు. ఆర్టీసి బస్సులు రాకముందు ప్రయాణం గురించి ఆలోచించాడు. అప్పట్లో రామనగరం వెళ్ళాలంటే ఓ ఐదు రూపాయలు ఉంటే సరి. విశాఖ నుండి శ్రీకాకుళం వరకు బస్సు ఛార్జీ అన్నమాట. అక్కడ నుండి రామనగరం వెళ్ళాలంటే బస్సు కండక్టరు ఫ్రంటు సీటు ఖాళీ చేయించి కూర్చోబెట్టేవాడు. టిక్కెట్టుకేముంది బాబు. నాన్నగారి దగ్గర తీసుకుంటామని వినయంగా చెప్పేవాడు.

ఆ రోజుల్లో ఆ ఊరికి వచ్చే మూడు బస్సుల డైవర్లకు, కండక్టర్లకు ధాన్యం పండే వేళ కళ్లంలో సంవత్సరానికి ఓ పుట్టెడు ధ్యానం కొలిసేవారు. ఆ బస్సులు పక్క ఊరిలోఉన్న ఎమ్మెల్యే తులసినాయుడుగారివి. తులసి నాయుడు గారికి మా నాన్నగారంటే గురుభక్తి. అది తనకిచ్చే మర్యాదవెనుక కథ.

బస్సు తగరపువలస దాటింది. పంటపొలాలు బంగారంలా మెరుస్తున్నాయి. వరి పంట బాగానే పండింది గాబోలు. వరి వెన్నులు బరువుతో మెడలు వాల్చి ఉన్నాయి. ఓ పక్క కోతలు కోస్తున్నారు. నిండు గర్భిణీ ధాన్యలక్ష్మికి మనసున నమస్కరించుకున్నాడు.



# ఊరికి

దూసి శ్రీరామమూర్తి

**గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

తన చిన్ననాటి జ్ఞాపకాలలోకి తుర్రున పరిగెట్టింది తన పట్నం మనసు.

"నాన్నా జగన్నాథ్... ఉభయ కుశలోపరి. మన పంట కోతకు వచ్చింది. ఊడికల కర్ర పొలం కోత మొదలెడుతున్నాం వీలుంటే రావల సింది. ఇట్లు మీ నాన్న.. పోస్టు కార్డు వచ్చేది, ఆ రోజు నైట్ హాల్టు బస్సుకే ఊరులో ఉండేవాడు తను.

సూర్యుడు లేవకుండానే తూర్పున చుక్క దూరగానే ఆడ, మగ కొడవళ్ళతో పొలాలకు బయలు దేరేవారు. చేను కోసి వంజగా పెట్టేవారు. ముందుగానే నాన్నగారు చేప్పేవారు. ఒకటి రెండు మడి చెక్కల్లో చేనె చొప్ప కొయ్యమని. ఆ చొప్పతోనే మా పూరిల్లు, పశువుల శాఖ నేయించేవారు. మిగతాది చేనుగా కోయించేవారు. సూరీడు పొడిచి ఒళ్ళు వేడెక్కేవరకూ చేను కోసేవారు. ఇప్పుడు చూడాలి పొలాన్ని? ఇంత వరకు సూర్యనమస్కారాలు చేస్తున్నాయా అన్నట్లు నిల్చుని ఉన్న చేను కొయ్యడం అవగానే గుండె భారం దిగిందన్నట్లు భూదేవికి గుంపుగా సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్లు ఉండేది.

ఆడ మగ కూలీలు గుడ్డలతో మూటకట్టుకున్న సత్తుగిన్నెల్లో, కంచు గిన్నెల్లోని చల్దన్నం ఊరిబిండి ఒడియంతోనో, పచ్చిమిరపకాయతోనో, ఉల్లిపాయతోనో సంతుష్టిగా తినేవారు. పక్కగా పారే పంట కాలువులే వాళ్ళ చేతులు శుభ్రపరుచుకోడానికి, దాహం తీర్చేందుకు. అప్పుడు వాళ్ళు కాల్చే చుట్టల పొగలకు ఆకాశంలోకి వచ్చే మేఘుడు బలాదూర్ అయ్యేవాడు.

ఈ కార్యక్రమం అయ్యేంతవరకు గట్టుమీద చేలకి కాపుండడం, వెన్నుల నుండి ధాన్యం ఏరుకోడానికి వచ్చే పిట్టల్ని కేటల్‌బార్‌కు రాయుంచి కొట్టడం తన పని. పొలంలో చేను కోసేంతవరకు ఆడకూలీల్లో ముసలమ్మ ఆ ఊరి అమ్మవారి మీదో, పైలోకాలకి పోయిన ఆ ఊరి కుల పెద్దమీదో వరసలు కట్టి పాడేది. మిగతావారంతా వంత పాడేవారు. మగ కూలీలు ఊరి రాజకీయాలో, పక్కఊరి పంటల మీదో ఊసులాడుకునేవారు.

ఆడ కూలీలు వంగుని కొడవలితో కోస్తున్నప్పుడు ఎదురుగా గట్టుమీద అటు చూసామో! ఆడాళ్ల సిగముడి కట్టు మెడలోంచి వాలుజారే సూత్రాలు, వాటికి వేలాడే గులింపుల్ల, పిన్నీసులు అవికాక ఇంకేమైనా చూస్తున్నామెమోనని "బుగతా నువు పంతులువైతే అయ్యావు కాని ఆడవాళ్ళకు ఎదురుగా గట్టుమీద నుల్చొని ఆ చూపేటి? పక్కగట్టు మీదకు పోరాదు? బేగి కోడలును తెచ్చిమనీ పెద బుగతకు చెప్పాలి" నను మెత్తగా చురుకేసేవారు.

చేను కుప్పవేయడం పెద్ద ఆర్టే. పంట దిగుబడిని బట్టి ఎన్ని కుప్పలు వేయాలో నిర్దేశించేవారు. చొప్పకు కోసే చేను కుప్పవేరు. చేనుకోసే ముందుగానే మెరకమీద వాళ్లకు నియమించబడ్డ జాగాలో తుప్పలుకొట్టి, కంపలతో తుడిచి, పేడతో అలికి ఉంచేవారు. ఆ ఊరిలో వారందరికి కుప్పలు వేసుకోడానికి, నూర్పులకు, గాలికి పోయడానికి అదే జాగా.

ఇది మునసబు గారి కళ్ళం. రామయ్య బుగత కళ్ళం, చిట్టిబాబు కళ్ళం ఇలా ఆయా జాగాలకు పేర్లు. ఇంటి పేరున కూడా కళ్ళాల పేర్లు పిలిచేవారు. మల్టీ నేషనల్ కంపెనీ పేరుల్లా.

నూర్పులు, గాలికి పెట్టడం బల్లమీద పొణకలతో ధాన్యం ఇళ్ళల్లోని గాదెలకు చేరిన తరువాత మెరకదిబ్బ అంతా గ్రామకంఠమే. అంత వరకూ అక్కడ ఆవుల మందలుండవు, తట్టల్లోకి పేడేరుకునే అమ్మాయిలు కనబడరు. పిల్లలు కర్రాబిల్లా ఆడరు. ఎవరి సేద్యం వారిది. ఎవరి నూర్పు వారిది. ఎవరి ధాన్యపు రాశి వారిది. కాపలా అక్కరలేని నిజాయితీ అక్కడ ఉండేది.

చేను మోత చూడముచ్చటగా ఉంటుంది.

వడ్డాది పాపయ్య యువపత్రిక ఆఖరి అట్ట లోపలి పేజీల్లో ముద్రణ అయిన చాలా బొమ్మలకు వీరే మోడల్స్.

చేను మోసే వారి వెంట పరికిని, జాకెట్లతో, గౌనులతో బొంగులు చంకన పెట్టుకుని పరిగెట్టే పిల్లలు కొంతమంది చేను మోసేటప్పుడు రాలిన ధాన్యపు వెన్నులు ఏరుకునేవారు. అలా ఏరుకునే వారిని ఎవరూ దెబ్బలాడరు. ఆ శ్రమని లేకేరడం అనేవారు. అలా కోతలన్నాళ్లూ తిరిగీ ఓ పుట్టెడు ధాన్యం సంపాదించే పిల్లలు ఉండేవారు. వీరిలో ఎక్కువమంది మడిచెక్కగూడా లేనివారే.

తనూ సరదాగా వాళ్ళ వెంట పరిగెట్టి లేకి ఏరి నెయ్యి ఉండలు కొనేవాడు. తలుచుకుని నవ్వుకున్నాడు జగన్నాథం.

"పండిన పంటంతా ఏటిచేసేస్తారు బుగత? మడిచెక్కైయినా లేనోళ్ళాగ లేకి ఏరేస్తున్నావు. పట్టణంలో ఉన్న మరదలికి నెయ్యి చెక్రాలు ఒట్టికెళ్ళాల గాబాలా. గాజులకైనా డబ్బులివ్వవ్" బుగ్గలు పొడుస్తూ సరసమాడేది రైతుకూలి బోడి.

అలా కుప్పపెట్టిన చేని వారివారి వీలును బట్టి నూర్పును మొదలెట్టేవారు. కళ్ళంలో కుందిరి ఒకటి, ఊడిక రువ్వలతో చేసినది వేసుకునేవారు. వాళ్ళ హోదాను బట్టి లోపలి గడ్డివేసి బొంతా, పరుపో, మంచమో రాత్రి కాపలాకై పడకలు. కుందిరిలో ఓ పెద్ద టార్చిలైటు. కుందిరికి వేళాడుతూ హరికేన్ లాంతరు. నూర్పులు అయ్యేటప్పుడు తెల్లారుగట్ల ఎడ్లను నాలుగు నాలుగుగా లంకెలు కట్టేవారు. లేదా పోతులను లంకెలు కట్టేవారు. చేనును వలయాకారంగా పోసి లంకెల ను వాటిమీద తిప్పేవారు.

అదో అనుభూతి. అసలే చలికాలం. తెల్లవారుజామున లంకెల వెనుక కొరడాపట్టుకొని అజమాయించడం. వెన్నుల తిన్న పశువు పేడలు వేయబోతే తోకెత్తి కొంచెం గడ్డితో నూర్పులో పడకుండా పట్టి ఓ కుప్పగా వేయడం. సొంపుగా వెన్నుల చివరనున్న ధాన్యం గింజలు కాలిపిక్కలకు తగిలి చుర్రుమనడం అదో మజా. అనుభవించాల్సిందే.


ఓ పక్కనుంచి నలిగిన చేనును కొంటెతో తిరగేయడం ధాన్యం నుండి వేరువడిన గడ్డిని కుప్పగా వేయడం. ఎడ్లబండిని ఏటవాలుగా చేసి ఆ చెక్కల మీద చొప్పకట్టలను చాకచక్యంగా కొట్టి ధాన్యాన్ని రాలనిచ్చేవారు. గింజ విరగడం ఉండేదికాదు. చొప్పకట్టలో ధాన్యపు గింజ ఉండేది కాదు. నూర్పవగా రాలిన ధాన్యం చేనులతో మండీగా పోయడం. మండీగా పోసిన ధాన్యం తడియకుండా, మంచుపడకుండా ఎండుగడ్డితో కప్పడం అదో పెద్ద పరిశ్రమే.

గాలికి పట్టడానికి ఆలస్యమయినప్పుడు ధాన్యపు మండీల మీద బల్ల చెక్కల మీద పేర్లు చెక్కించి బూడిదతో అద్ది ముద్రలు వేసేవారు.

అందరినూర్పులు అయి, గాలులు బాగా వీచేవేళ గాలికి పట్టే ముందు ధాన్యపు మండీకి పూజచేసి వరి పిండి, బెల్లం కలిపిన ముద్దలు నైవేద్యం పెట్టి చేనుకోసిన కూలీలు, నూర్చిన కూలీలకు పంచిపెట్టేవారు. అలా చేస్తే ఆ కూలీలకు ఒళ్ళు నొప్పులు పోతాయంట.

గాలికి పోయగా వచ్చిన మంచి ధాన్యం ఓ పక్క రాశిగా పోసేవారు. కొంచెం పొల్లు, చిన్నచిన్న గడ్డి ముక్కలు ఓ పక్క రాశిగా పోసేవారు. అక్కడే రైతువాటా, బుగతవాటా, పాలికాపు సంవత్సర ఒప్పందం, చాకలి, మంగలి, దేముడి గుడికి ఇవ్వాల్సిన ధాన్యం ఏర్పాటుచేసి ఎవరిది వారు పట్టుకెల్లగా మిగిలిన నిఖర రాశి ఆ ఏడాది పంటగా కొలుచుకునేవారు.

ముహూర్తాలు చూసుకుని ధాన్యపు కొట్టుకు, గాదెలకు బళ్లమీద పాణకలతో ధాన్యం తోలుకొచ్చేవారు.



జగన్నాధం ఫ్లాష్ బ్యాక్‌లోంచి బయట పడకుండానే తన జన్మభూమి రామనగరం ఖాణా వచ్చేసింది.

తన పూర్తిగా భూమి మీద కాలుపెట్టకుండానే ఆర్టీసి బస్సు కదా తుర్రుమంది.

తను ఎయిర్ బ్యాగ్‌తో చుట్టూ చూశాడు. ఎంత మార్పు?

ఊర్లో ఎవరైనా ఉంటేనా? పట్టణాలకు వలసపోతే పుట్టిన ఊరు సంగతి అంతే. తను సామాను మోయడానికి రైతులేడు, కంబారిలేడు. ప్రస్తుతం తను రైతు కాకపోయిన కంబరిలా నడుచుకెల్లాడు.

వంశధార వరదలకు ఊరంతా దిబ్బయింది. ఓ మూడు డాబా ఇళ్లు మాత్రం మిగిలాయి. తన ఇల్లు పశువులశాల దిబ్బల్లో మద్దయి ఉన్నాయి.

అక్కడికి వెల్లడానికి మనసురాక రాముడు మావయ్య ఇంటివైపు వెళ్లి పరిచయం చేసుకున్నాడు. ఇంకెక్కడి రాముడు మావయ్య? మావయ్యా లేడు, కొడుకులూ లేరు. ఏనాడో వంశధార ఒడ్డుకు చేరారు. ఉన్న మనవళ్లకి తన వివరాలు చెప్పాడు.

ఏటికెళ్లి తనివితీరా వంశధార నదిలో స్నానమాడాడు. ఇంటికి తిరిగి వచ్చాడు.

తను వచ్చినట్లుగా కబురందింది కాబోలు రైతు నరిసి ప్రత్యక్షం. సాపాటు కర్ర, తను, నోటిలో చుట్ట, తలపాగ, పోల్చుకోవడం కొంచెం కష్టమే అయినా అదే గొంతుక, బుగతా అన్న సంబోధనతో కొన్ని కుశల ప్రశ్నలు వేశాడు.

అమ్మ తనకు చెప్పిన విధంగా శిస్తు, పంటలో భాగం, ఎరువుల కయ్యే ఖర్చులో తనిచ్చేది, మినప, నువ్వుల పంటల్లో కొంచెమైనా అమ్మ సంతృప్తికైనా ఇమ్మని వేడుకున్నట్లుగా.... అజమాయిషిగా అతని నైపుణ్యాన్ని చూపాడు జగన్నాధం.

"ఏటి బుగతా, ఈ పాటి దానికి బస్సెక్కి పా్రావాలా? ఫోనులో మాట్లాడితే సరిపోద్దికదా. పొలానికి వెళ్ళి చూసినా నీ పొలమేదో పోల్చిసుకోగలరేటి? అంటూ తన సెల్‌ఫోన్ హోల్డరునని నెంబరు రాసుకోమన్నాడు నర్సిగాడు.

ఆ వాతావరణంలో ఒక రాత్రి కూడా అక్కడ ఉండాలనిపించక తిరుగు ప్రయాణం నైట్ హాల్ట్ బస్సుకేనని ధాన్యం, డబ్బులు ఇస్తే పట్టుకెళ్తానని చెప్పాడు జగన్నాధం.

"ఏం పంటలు? ఏం నూర్పులు? మీ అయ్య బతికున్నప్పటి పంటలా? నూర్పులకి ట్రాక్టర్లు, గాలికి ఎకరేయడానికి మిషన్లు దుక్కికీ ట్రాక్టర్లు, బోలెడు అద్దెలు, ఆయిల్ ఖర్చు. ఆడా, మగా పట్టణాలు వెళ్ళిపోతే ఏదో ఇంకో పనిచేయలేనివాడిని. ఏదో వ్యవసాయం. రెక్కలు ముక్కలవడమే తప్పా, ఎకరాకి ఖర్చులు పోను పది పుట్టెల ధాన్యం ఏటని ఇచ్చేస్తాం?" ఘాటైన చుట్టపొగ మొఖంమీ్మదికి వదులుతూ చెప్పాడు నర్సిగాడు. తన మట్టుకు ఏం చేయగలడూ. అది కాదు నర్సి అనబోయి ఊరుకున్నాడు.

"బుగతా నా కొడుకులూ సింగపూర్, దుబాయ్‌లకు పోనారు. వచ్చీ అయ్యా అంటున్నారు. ఇదిగో రెండువేల రూపాయలు. మినుగులు, నువ్వులంటారా వాటి వాసన మేము చూసి పంటలైంది. మీకు నచ్చకపోతే ఇంకో రైతును చూసుకోండి" చుట్ట పొగలోంచి మాటమీద మాట చెప్పుకుపోయాడు నర్సిగాడు.

ఏం చేస్తాడు? పదే పదే తాను ఈ ఊరు రాలేడు. ఇల్లే లేని ఊరిలో ఏం కాపురముంటాడు. ఉన్న ఒక్క రైతు బ్లాక్‌మెయిల్ చేస్తేనేమి పంట పండలేదని మెయిల్ ఐడి చేస్తేనేమి పొలం కొర్నుగా ఉండకుండా సాగవుతుంది. అని డీప్‌గా ఆలోచించి సరే అన్నాడు జగన్నాథం.

రైతును వెంట పెట్టుకుని వసపూరి కోవెల వైపు నడిచాడు. అక్కడ హుండీలో అమ్మ ఇచ్చిన ఇచ్చు రూపాయలు వేద్దామని. కోవెలకు తలుపూ లేదు, కోవెలలో హుండీ లేదు. ఓ కాలు విరిగిన నంది, వీబూదిలేని శివలింగం. ఓ నమస్కారం పెట్టుకున్నాడు.

సాయంకాలంవరకూ చిన్నప్పుడు తాను చదివిన స్కూలు, చిన్నప్పటి నేస్తాల ఇళ్ళు తిరిగాడు.

తిరుగు ప్రయాణంలో రైతిచ్చిన డబ్బుల సంచి తన ఎయిర్ బ్యాగ్‌లో పెట్టుకున్నప్పుడు తనకి జ్ఞాపకం వచ్చిందల్లా ఒక్కటే. తన పొలంలోన చేని కోసి కుప్పలికి మోసికెళ్లే వేళ చిన్నప్పుడు తను ఏరిన లేకి. రైతు కూతురు బోడి మాటలు...

☆

# పోషకాహార లోపం- ప్రగతికి అవరోధకం

**'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్, తిండి కలిగితే కండకలదోయ్, ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్' అన్న గురజాడ పలుకులు భారతదేశంలో పోషకాహార రంగంలో నేడు నెలకొని ఉన్న పరిస్థితులకు అద్దంపట్టేలా ఉండటమే కాకుండా, దేశంలో నెలకొని ఉన్న ఆరోగ్యం పోషణ పరిస్థితుల పట్ల మరింత శ్రద్ధ కనపర్చవలసిన విషయాన్ని గుర్తుకు తెస్తున్నాయి.**

యునిసెఫ్ 2008 నివేదిక ప్రకారం, ప్రపంచంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు 40 శాతం మంది భారతదేశంలోనే ఉన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో తక్కువ బరువుతో జన్మించే నవజాత శిశువుల (నెలలోపు వయసు) జననాలలో 35 శాతం మనదేశంలోనే సంభవిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా తక్కువ బరువుతో జన్మించిన కారణంతో సంభవించే శిశువుల మరణాలలో 8.3 శాతం మనదేశంలోనే సంభవిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రతి 5 శిశుమరణాలలో ఒకటి భారతదేశంలోనే సంభవిస్తోంది. ప్రతీ సంవత్సరం మనదేశంలో 25 లక్షల శిశుమరణాల సంభవిస్తున్నాయన్నది యునిసెఫ్ నివేదిక ద్వారా తెలుస్తోంది. అంటే ప్రతీ 3 సెకన్లకు ఒక శిశువు మరణిస్తున్నట్లు యునిసెఫ్ నివేదిక ద్వారా తెలుస్తోంది. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా సంభవించే 5 సంవత్సరాలలోపు పిల్లల మరణాలలో 21 శాతం మనదేశంలోనే సంభవిస్తున్నాయి. జన్మించిన 0-28 రోజుల లోపు సంభవించే శిశుమరణాలలో మూడింట ఒకవంతు మనదేశంలోనే జరుగుతున్నాయి.

ప్రపంచబ్యాంకు నివేదిక (2006) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 35 శాతం ప్రజలు అయోడిన్ లోపంతోను, 40 శాతం ప్రజలు ఐరన్ లోపంతోను, 40 శాతం పిల్లలు 'విటమిన్ ఎ' లోపంతోనూ బాధపడుతున్నారు. పోషకాహారలోపాన్ని నివారించటంలో జరుగుతున్న తీవ్రమైన జాప్యం వల్ల పిల్లల భవిష్యత్తేగాక, అభివృద్ధి చెందుతున్న దేశాల భవిష్యత్తు కూడా అధోగమనంలోకి వెళ్ళే ప్రమాదముందని 2006 యునిసెఫ్ నివేదిక స్పష్టంగా హెచ్చరించింది.





### కుపోషణ-దారిద్ర్య విషవలయం

పిల్లలలో పోషకాహార లోపం ప్రభావం భవిష్యత్తులో దేశంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పోషకాహార లోపంతో బాధపడే వ్యక్తులు అధికంగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్థూల ఆదాయంలో సుమారు 3 శాతం ఆదాయం కోల్పోతున్నాయన్నది ఒక అంచనా. పోషకాహార లోపంతో బాధపడే పిల్లలు త్వరగా అనారోగ్యం పాలవుతారు. ఒక సాధారణ ఆరోగ్యవంతమైన శిశువుతో పోలిస్తే స్వల్ప కుపోషణకు

## బక్కచిక్కుతున్న గ్రామీణ భారత్

గురయ్యిన శిశువు మృత్యువాత పడటానికి రెండురెట్లు అధికంగాను, ఒక మాదిరిగా కుపోషణకు గురైన శిశువుకు రెండు రెట్లు అధికంగాను, తీవ్రమైన కుపోషణకు గురైన శిశువు 8 రెట్లు అధికంగాను మృత్యువాతన పడే అవకాశాలున్నట్లు పరిశోధనలు తెలియచేస్తున్నాయి.

పిల్లలు ఎదిగే వయసులో సంతులిత ఆహారం అందకపోవటం వల్ల వారిలో భౌతిక, మానసిక ఎదుగుదల లోపిస్తాయి. తక్కువ బరువుతో జన్మించిన శిశువు కూడా బలహీనంగా ఉండటం వల్ల త్వరగా జబ్బుల పాలవటానికి ఆస్కారముంటుంది. పసి వయసులో జబ్బుల పాలవటం వల్ల శిశుమరణాలు కూడా త్వరగా సంభవిస్తాయి. తక్కువ బరువుతో జన్మించటం వల్ల శిశువు పెరిగి పెద్దయినప్పటికీ, ఆ తక్కువ బరువు శిశువుపై తీవ్రమైన పరిణామాలు చూపుతుంది. ఈ ప్రభావం ఒక తరం నుండి మరొక తరానికి కూడా సోకుతుంది. పోషకాహారలోపంతో బాధపడే తల్లులు బరువు తక్కువ శిశువులకు జన్మనిస్తారు. వీరు

మరల పోషకాహార లోపంతో బాధపడే తల్లులుగా మారుతారు. శిశుమరణం ఆ కుటుంబానికి తీరని వేదనను మిగల్చటమే గాక, జన్మించిన శిశువులు జీవిస్తారో లేదో తెలియక పేదకుటుంబాలు అధిక సంతానంవైపు మొగ్గు చూపుతాయి. ఫలితంగా పేదకుటుంబాలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడటం, కుటుంబంలోని మహిళ ఆరోగ్యం పాడవటం వంటి ప్రతికూల ప్రభావాలు కూడా సంభవిస్తాయి. కుపోషణ అన్నది ఒక విషవలయంలాంటిది. గొలుసు చర్యవలె ఒక దానిని అనుసరించి మరొకటి సంభవిస్తాయి.

మనదేశంలో సంభవించే శిశుమరణాలలో అధికశాతం నివారించ తగినవే. అయినప్పటికీ, శిశుమరణాలను అరికట్టటంలో భారతదేశంలో ప్రగతి చాలా నెమ్మదిగా ఉన్నది. పేదరికం, ఆకలి, అనారోగ్యం, శిశుమరణాలు ఇవన్నీ పరస్పరం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలే కాకుండా, ఒకదాని ప్రభావం మరొకదానిపై తీవ్రమైన పరిణామాలను చూపుతుందని పలు పరిశోధనల వల్ల తెలుస్తోంది. అయితే వీటన్నింటినీ శాస్త్రీయమైన పద్ధతిలో అధ్యయనం చేసి వివిధ దేశాలలో ఈ అంశాల ప్రభావం ఎలా ఉన్నది అని తెలుసుకోవటానికి గ్లోబల్ హంగర్ ఇండెక్సును రూపొందించారు.



2000-2006 మధ్య అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రపంచవ్యాప్తంగా 119 దేశాలలో ప్రపంచ ఆకలి సూచికను లెక్కించగా, భారత దేశం 96వ స్థానంలో ఉన్నది. బంగ్లాదేశ్ (102) స్థానంలో వుంది. భారతదేశం 96వ స్థానంలో ఉండటానికి ప్రధాన కారణం 5 సంవత్సరాల లోపు పిల్లలలో పోషకాహారంలోపం అధికంగా ఉండటమే. 119 దేశాలలో 5 సంవత్సరాల లోపు పిల్లలలో పోషకాహార స్థాయిని లెక్కించగా భారతదేశం 117వ స్థానంలో ఉంది. భారతదేశం తరువాత స్థానాలలో బంగ్లాదేశ్, నేపాల్‌లు మాత్రమే ఉన్నాయి.

## గ్లోబల్ హంగర్ ఇండెక్సు

ప్రపంచదేశాలలో ఆకలి, పోషకాహారస్థాయిని లెక్కించటానికి రూపొందించబడిన సూచికే ఈ ప్రపంచ ఆకలి సూచిక. ఈ సూచిక పేదరికం మూడు కోణాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ సూచికను లెక్కించే సమయంలో 1) మొత్తం దేశజనాభాలో పోషకాహారలోపంతో బాధపడే జనాభా శాతం 2) 5 సంవత్సరాలలోపు పోషకాహారం లోపంతో బాధపడే పిల్లల శాతం, 3) 5 సంవత్సరాలలోపు వయస్సుగల పిల్లల మరణాల రేటు (ప్రతీ 1000 మందికి). ఈ మూడు పరిమితులకు సమానమైన భారాలను ఇచ్చి ఈ ఆకలి సూచికను రూపొందించటంతో పేదరికం మూడుకోణాలను పరిగణనలోకి తీసుకొన్నట్లయింది. ఈ ప్రపంచ ఆకలి సూచిక దేశాలను 100 పాయింట్ల కొలమానంపై ఆయా దేశాల ఆకలి, పోషకాహార స్థాయిలను బట్టి స్థానాలను నిర్ణయిస్తుంది. 0 విలువ ఉత్తమ ప్రమాణాలను, 100 విలువ అధమ పరిస్థితులను సూచిస్తాయి.

## సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు- పోషకాహారం

మానవ అభివృద్ధి రంగంలో 2015 సం. నాటికి సాధించాల్సిన పురోగతిపై 191 దేశాలు ఏర్పర్చుకొన్న 8 సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలలో పేదరికం-ఆకలితో బాధపడుతున్న ప్రజల సంఖ్యను తగ్గించటం, మాతృ శిశుమరణాల శాతం తగ్గించటం వంటివి ప్రధానంగా ఉన్నాయి. ఈ లక్ష్యాల సాధనకు ఏర్పాటు చేసుకున్న ఉపలక్ష్యాలలో ప్రపంచవ్యాప్తంగా తక్కువ బరువుతో జన్మించే వారి సంఖ్యను 1990 స్థాయి నుండి కనీసం సగమైనా 2015 నాటికి తగ్గించాలనేది ప్రధానమైనది. ఈ విషయంలో మనదేశంలో ప్రగతి చాలా నిదానంగా ఉంది. ప్రస్తుతం స్థాయిలోనే ఈ తగ్గింపు చర్యలు ఉన్నట్లయితే భారతదేశం 2040 నాటికి కూడా ఈ లక్ష్యాన్ని చేరుకొనే అవకాశంలేదన్నది నిపుణుల అంచనా. దేశవ్యాప్తంగా 2005-06 సంవత్సరంలో జరిపిన 3వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేక్షణ ఫలితాలు కూడా పిల్లల్లో పోషకాహార లోప స్థాయి ప్రమాదకరమయిన స్థాయిలో ఉన్నట్లు తెలియచేస్తున్నాయి.

ఈ నివేదికల వల్ల దేశంలోని 3 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలలో వయస్సుకు తగ్గ పొడవు లేని పిల్లలు 38%, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలు 19%, వయస్సుకు తగ్గ బరువు లేని పిల్లలు 46% ఉన్నట్లు తెలుస్తోంది. 6-35 నెలల లోపు పిల్లలలో రక్తహీనతతో బాధపడే వారు నూటికి 79 మంది ఉన్నారన్నది కూడా విస్మయం కల్గించే విషయమే. ఇదే మన రాష్ట్రంలో 3 సంవత్సరాలలోపు పిల్లల్లో వయస్సుకు తగ్గ పొడవు లేని పిల్లలు 34%, ఎత్తుకు తగ్గ బరువులేని పిల్లలు 13%, వయస్సుకు తగ్గ బరువు లేని పిల్లలు 37% శాతం ఉన్నారు. ఇది దేశ సరాసరి కన్నా మెరుగుగా ఉన్నప్పటికీ దృష్టి సారించవలసిన విషయమే. రక్తహీనతతో బాధపడే పిల్లల సంఖ్య దేశ సరాసరితో సమానంగా అంటే 79 శాతం ఉంది.

## పథకాలెన్నున్నా ఏం ప్రయోజనం?

ప్రజలకు ఆహార భద్రత కలగచేయటం ద్వారా జీవనప్రమాణాలను పెంపొందించటానికి ప్రభుత్వం అన్నపూర్ణ, అంత్యోదయ అన్నయోజన, పి.డి.ఎస్. వంటి పలు కార్యక్రమాలను అమలు పరుస్తోంది. ఆరోగ్య సేవలు గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ఆరోగ్యమిషను ద్వారా పలు సేవలు అందచేస్తున్నాయి. అనుబంధ పోషకాహారం అందచేయటానికి ఐ.సి.డి.ఎస్., మధ్యాహ్న భోజన పథకం, కౌమార దశలో ఉన్న బాలికలకు జీవననైపుణ్యాలు నేర్పటానికి రాజీవ్ కిశోరబాలికా సాధికార పథకాలు అమలు అవుతున్నాయి. కానీ ఈ పథకాలు క్షేత్ర స్థాయిలో అనుకున్న రీతిలో అమలు అవ్వకపోవటం వల్ల దేశంలోని 5 సంవత్సరాలలోపు పిల్లలు ప్రమాదకరమయిన స్థాయిలో పోషకాహార లోపంతో బాధపడుతున్నారు.

| పథకం | 2010-11 కేంద్ర బడ్జెట్టు |
|---|---|
| | (కోట్ల రూపాయలు) |
| ఐ.సి.డి.ఎస్ | 8700.00 |
| పి.డి.ఎస్ | 55578.00 |
| మధ్యాహ్నభోజన పథకం | 2545.00 |
| జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషను | 13910.00 |
| జాతీయ ఆహార భద్రత మిషను | 1350.00 |
| రాజీవ్ గాంధీ కిశోర బాలికల సాధికారతా పథకం | 1000.00 |

పిల్లలలో కుపోషణకు ప్రధానమైన కారణాలలో దారిద్ర్యం, సమాజంలో మహిళల స్థితి, గర్భిణీ సమయంలో సరైన సంరక్షణ లోపించటం, తక్కువ బరువుతో జన్మించే వారి శాతం అధికంగా ఉండటం, ఎక్కువ జనసాంద్రత, పిల్లల సంరక్షణలో జాగ్రత్త వహించక పోవటం, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులో లేకపోవటం వంటివి ప్రధాన కారణాలు. ఐతే ఒక్కో ప్రదేశంలో ఒక్కో రకమైన కారణం వల్ల పోషకాహారసమస్య తలెత్తుతూ ఉంటుంది. పిల్లలో కుపోషణను సమర్థవంతంగా ఎదుర్కోటానికి మహిళా అక్షరాస్యత 43%, ఆహారభద్రత 26%, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులో లేకపోవటం 19%, మహిళా స్థితిగతులు 12% ప్రభావాన్ని చూపుతాయని అంతర్జాతీయ పరిశోధనల వల్ల మనకు తెలుస్తోంది.

## పంచాయతీరాజ్ సంస్థలు ఏం చర్యలు తీసుకోవాలి

సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు ప్రపంచ స్థాయిలో, దేశ స్థాయిలో ఏర్పరచుకొన్నప్పటికీ, లక్ష్యాల సాధన గ్రామాలలోనే మొదలు కావాలి. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటేనే ఈ లక్ష్యాల సాధన వీలవుతుంది. అందుకోసం పంచాయతీరాజ్ సంస్థలలో పనిచేసే ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్యంగా పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించటానికి అవసరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి.





కేవలం పోషకాహార వారోత్సవాల సందర్భంగా ఒక తంతులా కాకుండా సంవత్సర కాలమంతా ఈ విషయంపట్ల శ్రద్ధ కనబరచాలి. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం కల్పించాలి. అంగనువాడీ కేంద్రాలలో పిల్లలు ఎదుగుదల క్రమాన్ని నమోదు చేస్తున్నదీ, లేనిదీ తప్పనిసరిగా పర్యవేక్షించాలి. పిల్లల ఎత్తును, బరువును నెలవారీగా నమోదు చేస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించాలి. పోషకాహార లోపంతో బాధపడే గ్రేడ్ 3, 4 పిల్లల వివరాలు సేకరించి, వారి తల్లితండ్రులతో చర్చించి ఆ పిల్లలు ఆరోగ్యవంతులుగా మారేలా తగు శ్రద్ధ వహించాలి. గ్రామసభలలో తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్ర పనితీరుని సమీక్షించాలి.

పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా అందరు పిల్లలకీ అందేలా శ్రద్ధ వహించాలి. 'ఎ' విటమిన్ సప్లిమెంటు అందరు పిల్లలకీ అందేలా చూడాలి. సూక్ష్మ పోషకాలైన ఐరన్, అయొడిన్ వంటివి పిల్లలకు సక్రమంగా అందేలా ఆరోగ్యశాఖతో సంప్రదింపులు జరిపి తగు చర్యలు చేపట్టాలి. పసిపిల్లలకు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్గించటం, పరిశుభ్రమయిన త్రాగునీరు ప్రజలకు ముఖ్యంగా పిల్లలకు అందేలా, గ్రామంలో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలి. ఐ.సి.డి.ఎస్, మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పంపిణీ నాణ్యతతో జరిగేలా చూడాలి. పి.డి.ఎస్-చౌకధరల దుకాణంలో సరుకులు సక్రమంగా ప్రజలకు బట్వాడా చేస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించాలి.

జాతీయ ఆరోగ్య మిషను కార్యక్రలాపాలలో చురుగ్గా పాలుపంచుకుంటూ ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా జాగ్రత్త వహించాలి. గ్రామంలోకి వచ్చే ప్రభుత్వ నిధులను ప్రతీ పైసా ఖచ్చితంగా ఎటువంటి అవినీతికి తావులేకుండా ఖర్చు అయ్యేలా శ్రద్ధ వహించాలి. ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్య పర్చటంలో ప్రధాన పాత్ర పోషించాలి. మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు 15శాతం మహిళా శిశుసంక్షేమ నిధులనుండి కూడా అనుబంధ పోషకాహారం అందించే వీలున్నది కనుక ఈ అవకాశాన్ని కూడా తప్పనిసరిగా సద్వినియోగపర్చుకొని పోషకాహారం స్థాయిని పెంచటానికి కృషి చెయ్యాలి.

శాస్త్ర సాంకేతిక రంగాలలో, ఇన్ఫర్మేషను టెక్నాలజీ రంగంలో ప్రగతిపథాన దూసుకుపోతున్న మనదేశంలోని పిల్లల్లో కుపోషణను నివారించగలగితే భారతదేశం మరింత పురోగతి సాధించే అవకాశం ఉందని 2006లో ప్రపంచబ్యాంకు చెప్పిన విషయం నిజం కాగలుగుతుంది. ఆ రోజు తప్పక వస్తుందని ఆశిద్దాం.

*- డాక్టర్ వి. శివ శంకర ప్రసాద్,* అపార్డు

# బడి పిల్లలకు బతుకుబాట చూపించాలి

**గ్రామీణ వాతావరణంలో, ప్రభుత్వ నిర్వహణలో ఉన్న పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, చదువుల్లో వెనుకబడి ఉన్నారన్న విషయం నిర్వివాదాంశం. దానికి కారణాలు అనేకం.**

సకాలానికి పుస్తకాలు అందకపోవడం, అలసత్వం, ప్రేరణ లోపించడం, పిల్లలను బాగా ఇష్టంగా చదువుకొనేట్లు ప్రోత్సహించలేకపోవడం, పాఠశాలల్లో సరిగా మూల్యాంకన చెయ్యకపోవడం, తప్పొప్పులు దిద్ది, బాగా రాయడం, చదవడం అలవాటు చెయ్యకపోవడం, ఒకటినుండి 10 తరగతుల వరకు నేర్చుకొన్నా, నేర్చుకోకపోయినా పైకి నెట్టివేయడం వంటివి - ఎన్నో ఉన్నాయి.

అంతేకాక, తల్లిదండ్రుల్లో అవగాహన లేక పోవడం, నాలుగు రూపాయలు సంపాదించేందుకు జీవితాలను గడిపేయడం, తల్లిదండ్రులు కూడా దాదాపు నిరక్షరాస్యులుగా ఉండటం, తమ పిల్లలు ఏం చదవాలో, ఎలా చదవాలో, ఎందుకు చదవాలో, చదువు ద్వారా ఎంత ఉన్నతమైన స్థితికి చేరుకోవచ్చో, పిల్లలు ఏఏ నైపుణ్యాలు సంపాదించుకోవాలో తెలియక పోవడం, తెలియ జెప్పలేక పోవటం వంటివి కూడా ముఖ్యమే. అటు పాఠశాలలు, ఇటు తల్లిదండ్రులు పిల్లలను గాలికి వదిలివేయడంతో పిల్లలు చదువులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు. బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో జీవితాలు తీర్చిదిద్దుకోలేక పోతున్నారు.

అయినా అక్కడక్కడ కొందరు పిల్లలు చదువుల్లో రాణిస్తున్నారు, పై తరగతులకు పోతున్నారు. కాని నూటికి 80% మంది అరకొర చదువులతో పాఠశాల విద్య గట్టెక్కామనిపిస్తున్నారు. ఇంటర్ చదువుల కొచ్చేటప్పటికి, పునాది సరిగ్గా లేకపోవడంతో చదువుల్లో చతికిలపడుతున్నారు. అవసరమైన నైపుణ్యాలు సాధించలేక మంచి జీవితాలను అందుకోలేక, చిన్నాచితక ఉద్యోగాలతో ఇమిడిపోయి జీవితాలను భారంగా ఈడుస్తున్నారు.

ఈ కారణాలు పిల్లల చదువులకు ప్రతిబంధకాలే అయినా వీటన్నిటి కన్నా అత్యంత ముఖ్యమైన మరో కారణం, పిల్లల్లో చదువుల పట్ల సరైన ప్రేరణ, ఉత్సాహం, ఆసక్తి, ఇష్టం మొదలైనవాటిని సమాజం, అధ్యాపకులు, ప్రభుత్వం కలిగించకపోవడమే.

పిల్లలను ఉత్సాహపరిచి, వాళ్ళల్లో దాగి ఉన్న అనంతమైన శక్తి సామర్థ్యాలను తట్టిలేపి, చదువుపట్ల ఆసక్తిని, ప్రేమను కలిగించి జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడాలి.

ఇక్కడేదీ అయాచితంగా గాని, ఉచితంగా గాని లభించదు. ఊరికే ఎవరూ ఎవరికీ సహాయం చెయ్యరు. తమకు తామే సహాయం చేసుకోవాలి. ప్రముఖమైన ఒక సూక్తి ఉంది, 'తనకు తాను సహాయం చేసుకోని వాడికి, దేవుడు కూడా సహాయం చెయ్యడ'ని.

అందుకే పిల్లలకు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎలాగో నేర్పించాలి. కాలం విలువ తెలియజేయాలి.

జీవితం పట్ల, చదువు పట్ల నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని తొలగించాలి, నిర్లక్ష్యం, సోమరితనం, బద్ధకం, వాయిదాలు వేసే మనస్తత్వాలను తొలగించాలి.

నాకు రాదు, నేను చెయ్యలేను, ఇది కష్టం, మేం పేదవాళ్ళం వంటి ఆత్మ న్యూనతా భావాలు ఒదిలించాలి, అంటే ఈ భూమ్మీద ఎవరైనా ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా, తాము కూడా అంతటి స్థాయికి ఎదగగలమనే నమ్మకాన్ని వాళ్ళ మెదడు పొరల్లో నాటాలి.

ఆధారపడే మనస్తత్వం, తెచ్చి పెట్టుకొన్న అసమర్థతలను ఒదలగొట్టాలి.

ఒక స్పష్టమైన లక్ష్యం పెట్టుకొని, దాన్ని సాధించగలననే బలమైన నమ్మకాన్ని పెంచి, సాధించేవరకు ఒదిలిపెట్టననే సడలని పట్టుదల రగిలించి, విద్యాసంవత్సరం మొదలైనప్పటి నుండి రేపు 2011లో వచ్చే 10వ తరగతి పరీక్షల వరకు ఒక పకడ్బందీ ప్రణాళిక రచించుకొని, తన్ను తాను ప్రేరేపించుకొని కృషి చేస్తే ఉన్నతమైన ఫలితాలు సాధించ వచ్చనే పచ్చి నిజాన్ని వాళ్ళకు నేర్పించాలి. ఖచ్చితంగా గ్రామీణ బాల బాలికల్లో, యువతలో ఒక గొప్ప మార్పు వస్తుంది. మరింత శ్రద్ధగా తమ జీవితాలను తీర్చిదిద్దుకోగలుగుతారు.

ఈ ఒక్క పాఠం చాలా మంది పిల్లలలో ఒకకొత్త ఉత్సాహాన్ని నింపుతుంది, సరికొత్త సృజనాత్మకమైన ఆలోచనలు కలిగిస్తుంది. తమ జీవితాలకు తామే బాధ్యత వహించే నైపుణ్యం కూడా కలుగుతుంది.

గొప్ప వాళ్ళెవరూ గొప్ప పనులు చేసి గొప్ప వాళ్ళు కాలేదు. అత్యంత సామాన్యమైన పనులనే గొప్పగా చేశారు. గొప్ప స్థాయికి చేరుకొన్నారు. మరెందరికో స్ఫూర్తిప్రదాతలుగా ఉన్నారు.

చదువుల్లో గ్రామీణ యువత ముందంజ వేస్తే, దేశం సుభిక్షం అవుతుందని వేరే చెప్పనవసరం లేదు. ఈ నాటి ఈ పేద గ్రామీణ భారతం, విజ్ఞానవంతులైన యువతతో కళకళలాడుతుంది. గ్రామీణ ముఖ చిత్రమే మారిపోతుంది.

- వి.వి.యస్. ప్రసాద్
రిటైర్డ్ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, ఇంటర్మీడియట్ విద్య

# అవిగో కోవెల దివ్వెలు...!

నరనరాల్లో
జీవంలా ప్రవహించిన సాహిత్యం
తీరం చేరింది
కవిత్వంలో పంచె కట్టించటమే కాదు
ఫ్యాంటూ కోటూ తొడిగించిన
నేర్పరి...
రెప్పల్ని విదిల్చి
చేతనా వర్తనంలోకి
చూపుల్ని గుచ్చిన
మొనగాడు...
పద్యాన్ని చేతుల్లోకి తీసుకొని
బరువు తూచి చెప్పే
జాణ...
కచాకచీ తన్నుకొనే
ఛందోవ్యాకరణాలకు
మధ్యవర్తి...
కాలాన్ని నిలబెట్టి
కాక తీయ గల
మెత్తని మాటకారి
సౌమ్యంలో కడిగిన ముత్యం
సౌజన్యంలో పండిన విత్తూ సంపత్తూ
ఇప్పుడెక్కడ...?

ఇంకెవరికి...
బుద్ధీ హృదయమూ
శాస్త్రమూ, కళా
ఉచ్ఛ్వాస నిశ్వాసాలవుతాయి?
ఇప్పుడెవరు....
'చుట్టుప్రావ' చుట్టూ ఆలోచనల్ని తిప్పుతారు?
వినయంతో ఒదిగిన విద్యకు దిక్కేది?
ద్రవంలో ఘనీభవిస్తూ
ఘనంలో ద్రవిస్తూ





ఆచార్య శ్రీ కోవెల సంపత్కుమారాచార్య


దేనినైనా లొంగే
దేనికైనా లొంగదీసే
ఆ సౌలభ్యగుణం ఆవిరైనట్లేనా...
నిశ్చల బిందువులో
రహస్యంగా ధ్వనించే
కవనార్తుల హృదయవీణను మీటే వైణికుడేడీ?
ఒక్కటైన పలు గుండెలతో
సభల్లో... సంభాషణల్లో
బోధనల్లో... సూచనల్లో
ఉవ్వెత్తున ఎగసిన (గడిచిన)
ఆ కోవెల గంటలేవి...

ఎక్కడ...
కొన్ని దశాబ్దులు
జాజ్వల్యమానంగా వెలిగిన
ఆ కోవెల దివ్వెలు...

అవిగో...
పురుడు పోసుకుంటున్న కవులకలాల్లో...!
లోతుల్ని తవ్వుతున్న విమర్శకుల హలాల్లో...!!

*(1. చుట్టుప్రావః ఇది అనంతుడు రాసిన ఛందోదర్పణంలోని ఒక అస్పష్టాంశం. దాని సంగతేంటో చూడండి... అని వారు రెండు నెలల క్రిందట అడిగారు.*
*2. సౌలభ్యంః శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం ఇది స్వామివారి ఒక గుణం.)*

– అద్దంకి శ్రీనివాస్








Printed & Published by: Dr. Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Chief Editor : Dr. Phani Kumar

# కోవెల దివ్వెలు







RNI No. APTEL / 2009/27888



# నీ బాటలో...

శతకోటి సౌరభానికి జిలుగు వెలుగు రేడు...
సాహస్రాబ్ధిపై చెరగని ముద్రవేసిన శతాబ్ది సూరీడు...

ఆయుధం పట్టని పోరాట యోధుడు...
అహింసతో చెలరేగిన నవశక నాయకుడు...

దండిదండంతో వేసిన మంత్రం...
తెల్లదొరల తాటతీసిన సత్యాగ్రహ యంత్రం...

విదేశి వస్త్ర దహనాలు... సహాయ నిరాకరణ ఉద్యమాలు...
నీ మస్తిస్కంలో ఉదయించిన పోరువ్యూహాలు...

రక్తమే చిందించని వందేమాతరం రణనినాదాలు...
శత్రువుల శతఘ్నులు చిన్నబోయేలా...

ఆత్మగౌరవరాగ తరంగాలను
ఎలుగెత్తి చాటిచెప్పిన ఓ యోగిపుంగవా...

కాశ్మీరం మొదలు కన్యాకుమారి తీరం వరకు
నీవిచ్చిన పిలుపు భారతీయతకు తొలి మేలుకొలుపు...

ఓ శాంతి విధాత... స్ఫూర్తిదాత...
మా జాతికి పితవై... మహాత్ముడువై... మహితాత్ముడ వై...

తరతరాల యుగయుగాల నవయుగ వైతాళికుడవై... వెలిగిపో...
సృష్టి ఉన్నంత వరకు మా హృదయాలలో నిలిచిపో...

నీవందించిన స్వేచ్ఛా భిక్షతో
చూపించిన శాంతియుత మార్గంలో మళ్ళీ నడవాలనుంది...

అందుకే ఓ బోసి నవ్వుల బాపూ
మరోసారి మానాయకుడవై మమ్మల్ని నడిపించు...

అఖండ భారతం ఎదురుచూస్తోంది...
నీ పిలుపు కోసం...

మహాత్మా..! మా మాట మన్నించు...
వంద కోట్ల గొంతులు నిన్ను అనుసరిస్తాయి...

కడదాక నీ వెంట నడుస్తాయి...
నీ బాటలోనే పయనిస్తాయి...

- ప్రభాకర్ ఆరిపాక